ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.TELTEL / 2013 /50370
మంగళవారం 03.12.2024 | సంపుటి : 11 సంచిక : 141 | పేజీలు : 12 వెల: రూ. 4/-




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

**సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని..**

## వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య



**వాజేడు(జనంసాక్షి):**ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య చేసుకున్నారు. ముళ్లకట్ట సమీపంలోని హరిత రిసార్ట్స్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తున్నది. అయితే ఏటూరునాగారంలో ఎన్‌కౌంటర్ జరిగిన రాత్రే ఆయన సూసైడ్ చేసుకోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నత అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మిగతా 2లో..

**లారీ చక్రాల కింద**



## నలిగిన బతుకులు

### కూరగాయల వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ

నలుగురి దుర్మరణం.. పలువురికి తీవ్రగాయాలు

ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి



**చేవెళ్ల(జనంసాక్షి):**రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చేవెళ్ల మండలం ఆలూరు స్టేజి వద్ద ఓ లారీ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. హైదరాబాద్ -బీజాపూర్ రహదారి పక్కన దాదాపు 50 మంది కూరగాయలు విక్రయిస్తుండగా.. వారిపైకి లారీ దూసుకెళ్లడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దూసుకొస్తున్న లారీని చూసి అక్కడి జనమంతా భయంతో పరుగులు తీశారు. వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ చెట్టును ఢీకొట్టి ఆగింది. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో మిగతా 7లో..

**సొంత చెల్లిని అన్నే..**

## మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య



- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో చోటు చేసుకున్న ఘటన
- నెలక్రితమే ప్రేమ వివాహం చేసుకున్న నాగమణి

**హైదరాబాద్(జనంసాక్షి):**రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యకు గురయ్యారు. రాయపోలు నుంచి ఎండ్లగూడ వెళ్లే రహదారిపై ఈ ఘటన జరిగింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నాగమణి విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమెకు వివాహం జరగ్గా, 10 నెలల క్రితం భర్తతో విడాకులయ్యాయి. అనంతరం నెల రోజుల క్రితం మరో వ్యక్తిని కులాంతర ప్రేమ మిగతా 2లో..



# ఆరోగ్యతెలంగాణ

### ఆరోగ్య ఉత్సవాలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**పదినెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా!**

- ప్రభుత్వంపై విపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టండి
- మీ తలరాతలు మార్చిన ప్రజాప్రభుత్వం ఇది.. దీనిని మీరే కాపాడుకోవాలి
- తెలంగాణ సమాజమే మా కుటుంబం
- అభివృద్ధి ,సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఇందిరమ్మ పాలన
- దిగ్విజయంగా సాగుతున్న గృహజ్యోతి పథకం
- ప్రజాప్రభుత్వం సంకల్పం సత్ఫలితాలిస్తోంది
- ఉత్సవాల్లో భాగంగా అంబులెన్సులు ప్రారంభించిన సీఎం

**హైదరాబాద్(జనంసాక్షి):**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలే అవుతోందని, ఈ పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా? అయినా ఈ కాలంలో మనం చేయాల్సింది చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతోన్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మిగతా 2లో..





## కోకాకోలా ప్లాంట్‌ను ప్రారంభించిన సీఎం

సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో రూ.1000 కోట్లతో ఏర్పాటు

ప్లాంట్ పరిసరాల్లో కలియదిరిగిన ముఖ్యమంత్రి రేవంత్

**సిద్దిపేట(జనంసాక్షి):**సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో రూ.1000 కోట్లతో నిర్మించిన కోకాకోలా కంపెనీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్లాంట్‌లో కలియతిరిగారు. కూల్ డ్రింక్ తయారీ వివరాలను అక్కడి సిబ్బందిని మిగతా 2లో..


## జీవో 317పై ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కసరత్తు

### మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):** జీవో 317కు సంబంధించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు అనుగుణంగా సీఎస్ శాంతికుమారి మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ మేరకు మార్గదర్శకాలతో కూడిన జీవో ఎంఎస్ నెం. 243, 244, 245 జారీ చేశారు. మెడికల్, స్పౌస్, మ్యూచువల్ ఆధారంగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వీటికి సంబంధిం చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు కేటగిరీలకు సంబంధించి విడివిడిగా మార్గదర్శకాలను జారీ చేశారు. ఖాళీలకు లోబడి స్థానిక కేడర్‌లో మార్పు, బదిలీకి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో ఆయా స్థానాల్లో ఉన్న ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని అందులో పేర్కొంది.

## మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచండి

### ఏటూరునాగారం ఎన్‌కౌంటర్ ఘటనలో పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు



**హైదరాబాద్(జనంసాక్షి):**ఏటూరు నాగారంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. భోజనంలో మత్తుపదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపారని న్యాయస్థానానికి తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలు ఉన్నాయని న్యాయవాది కోర్టులో వాదించారు. కనీసం వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం చేశారన్నారు. ఎన్‌హెచ్ఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా మావోయిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించారని హైకోర్టుకు తెలిపారు. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ, పోలీసులు భద్రత దృష్ట్యా మృతదేహాలను ఆసుపత్రికి తరలించామని కోర్టుకు తెలిపారు. కేఎంసీ వైద్య నిపుణుల ఆధ్వర్యంలోనే పోస్టుమార్టం నిర్వహించారని స్పష్టం చేశారు. పోస్టుమార్టం ప్రక్రియను మొత్తం వీడియో తీశారని పేర్కొన్నారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని పోలీసులకు ఆదేశాలిచ్చింది. అలాగే మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించాలని తెలిపింది. ఈ విషయంపై తదుపరి విచారణను మంగళవారంకు హైకోర్టు వాయిదా వేసింది. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై డీజీపీ జితేందర్ మిగతా 2లో..

## పల్లెతనం ఉట్టిపడేలా ..

### సరికొత్తగా రూపుదిద్దుకుంటున్న తెలంగాణ తల్లి విగ్రహం

హైదరాబాద్ శివార్లలో సిద్ధంచేస్తున్న శిల్పులు అత్యంత గోప్యంగా డిజైన్ తయారు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిష్టించబోతున్న తెలంగాణ తల్లి విగ్రహం హైదరాబాద్ నగర శివార్లలో రెడీ అవుతోంది. దీన్ని అత్యంత గోప్యంగా డిజైన్ చేపిస్తోంది.. పెద్ద అంబర్ పేట గండి చెరువు దగ్గరలోని ఓ శిల్పి దీన్ని తయారు చేస్తున్నారు.. తెలంగాణ సచివాలయం మిగతా 2లో..

## విభజన అంశాలపై సమాలోచనలు

- తొలిసారి ఏపీ, తెలంగాణ అధికారుల కీలక భేటీ
- 9, 10 షెడ్యూల్‌లో సంస్థల ఆస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చ
- పంపకం కాకుండా మిగిలిపోయిన నిధులపైనా సంప్రదింపులు



**అమరావతి(జనంసాక్షి):** రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని విభజన అంశాలపై చర్చించేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారుల కమిటీ భేటీ అయింది. ఏపీలో తొలిసారి జరుగుతున్న ఈ భేటీలో ఇరు రాష్ట్రాల సీఎస్‌ల నేతృత్వంలో అధికారుల కమిటీ సమావేశమైంది. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లో సంస్థల ఆస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చించనున్నారు. విద్యుత్ బకాయిలు, ఉమ్మడి సంస్థల ఖర్చులను తిరిగి చెల్లించే అంశంతో పాటు విభజన పూర్తికాని సంస్థలకు చెందిన నగదు నిల్వలపైనా చర్చించనున్నారు. పంపకం కాకుండా మిగిలిపోయిన రూ. 8వేల కోట్ల అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది జులై 5న తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీ అయిన విషయం తెలిసిందే. ఆ భేటీకి కొనసాగింపుగా ఇరు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ఏపీ నుంచి సీఎస్, ఆర్థిక శాఖ కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో సీఎండీ, వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్, తెలంగాణ నుంచి సీఎస్, ఆర్థిక, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు తదితరులు హాజరయ్యారు.



ప్రధాని అద్భుత పనితీరుతో

## ‘ప్రగతి’ పరుగులు

### మోడీపై ఆక్స్‌ఫర్డ్ ప్రశంసలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్ ప్లాట్‌ఫారమ్ ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన వేగంగా అమలవుతోందని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం, గేట్స్ ఫౌండేషన్ అధ్యయనాల్లో మిగతా 2లో..

## రాజ్యాంగంపై చర్చకు సిద్ధం


### 13, 14వ తేదీల్లో లోక్‌సభలో, 16, 17వ తేదీల్లో రాజ్యసభలో చర్చించేందుకు తేదీలు ఖరారు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటికీ.. విపక్షాల ఆందోళనలతో ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. పలు అంశాలపై చర్చ జరపాలన్న విషయంపై కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. ముఖ్యంగా రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 13, 14వ తేదీల్లో లోక్‌సభలో, 16, 17వ తేదీల్లో రాజ్యసభలో చర్చించేందుకు తేదీలు ఖరారు చేసినట్లు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. మంగళవారం నుంచి ఉభయసభలు సజావుగా సాగేలా విపక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాలు మొదలైనప్పటికీ.. పలు అంశాలపై చర్చించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో మిగతా 10లో..

## మరోసారి రెచ్చిపోయిన హుతీలు

- అమెరికా వాణిజ్య నౌకలపై దాడి..
- క్షిపణులు, డ్రోన్లను నేలకూల్చిన నేవీ



**న్యూయార్క్(జనంసాక్షి):**హూతీ తిరుగుబాటుదారులు మరోసారి రెచ్చిపోయారు. అమెరికాకు చెందిన వాణిజ్య నౌకలపై వారు దాడి చేసినట్లు యూఎస్ అధికారులు వెల్లడించారు. అరేబియా సముద్రంలోని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో ప్రయాణిస్తున్న మూడు అమెరికా వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకొని యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. రక్షణగా వెళ్తున్న యుద్ధనౌక సత్వరం స్పందించి ఆ దాడులను తిప్పికొడుతూ మిగతా 2లో..



## పుత్రవాత్సల్యం..

### క్రిమినల్ కేసుల నుంచి కుమారుడికి జో బైడెన్ క్షమాభిక్ష..

ఆ కేసులు కేవలం రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆరోపణ

ఇది అధికార దుర్వినియోగం: ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్‌కు భారీ ఊరట లభించింది. మరికొద్ది రోజుల్లో అధ్యక్ష పీఠం నుంచి దిగిపోనున్న జో బైడెన్..తన కుమారుడికి కేసుల నుంచి పూర్తి ఉపశమనం కల్పించారు. అక్రమంగా ఆయుధం కొనుగోలు సహా రెండు క్రిమినల్ కేసుల్లో హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కుమారుడిపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవేనని ఈసందర్భంగా జో బైడెన్ ఆరోపించారు." అమెరికా ప్రజలకు నిజాన్ని చెప్పాలి - నా జీవితం మొత్తంలో నేను మిగతా 2లో..

## బెయిల్ వచ్చిన మరునాడే మంత్రి పదవా!?

### తమిళనాడులో అసలేంజరుగుతోంది?

కేబినెట్ మంత్రి హోదాతో సాక్షులను ప్రభావితం చేసే అవకాశం

సెంథిల్ బాలాజీ వ్యవహారంలో సుప్రీం ఆగ్రహం



2లో

## పశ్చిమాఫ్రికా దేశం గినీలో ఘోర విషాదం

### ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అభిమానుల ఘర్షణ చెలరేగి 100 మంది మృతి



2లో

## మళ్లీ రైతుల పోరుబాట..

- కేంద్రం వైఖరికి నిరసనగా ‘ఛలోఢిల్లీ’తో కదం తొక్కిన అన్నదాతలు
- నోయిడా వద్ద అడ్డుకున్న పోలీసులు.. రహదారిపై నిలిచిన రాకపోకలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పంటలకు మద్దతు ధర పెంచాలంటూ పంజాబ్ రైతులు నేడు ‘ఛలో ఢిల్లీ’ కార్యాచరణకు కదం తొక్కారు. అయితే, నోయిడాలోని దళిత్ ప్రేరణ్ స్థల్ వద్ద పంజాబ్ రైతులను పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వందలాది రైతులు ముందుకు రాకుండా పోలీసులు నిలువరించారు. అయినప్పటికీ బారికేడ్లు తొలగించి ఢిల్లీ వైపు దూసుకెళ్లేందుకు రైతులు ప్రయత్నించారు. రైతుల ఛలో ఢిల్లీ నేపథ్యంలో మూడంచెల భద్రత చర్యలు అమలు చేసిన పోలీసులు... రైతులు ముందుకు సాగకుండా ఆపేశారు. పోలీసులు భారీగా వాటర్ క్యానన్లు, టియర్ గ్యాస్ షెల్స్ సిద్ధంగా ఉంచారు. అదనపు బలగాలను మోహరించి, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. రైతుల ఆందోళన కారణంగా ఢిల్లీ-నోయిడా రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. రైతుల పాదయాత్రతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లపై రైతులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదు. వారితో చర్చలకు సైతం సుముఖత చూపడం లేదు. దీంతో కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతుల మిగతా 10లో..

# పల్లే తనం ఉట్టిపడేలా..

ముందు దీని కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. డిసెంబర్ 9 న ఆవిష్కరించడానికి రేడి అవుతున్నారు.. దీనిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు సీఎం ఏడాది ఫిబ్రవరి 4న కేబిటనేట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వం చేసిన ప్రకటన. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కొత్తగా రూపొందిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహంపై స్పెషల్ గా ఫోకస్ చేస్తుంది సర్కార్.. దీని కోసం స్వయంగా శిల్పులతో రేవంత్ సమావేశాలు నిర్వహించారు. దాని తర్వాత డిజైన్ ను ఫైనల్ చేశారు.. సగటు తెలంగాణ మహిళ రూపంలో తెలంగాణ తల్లి ఉండనున్నట్లుగా విగ్రహనికి సంబంధించి అన్ని భాధ్యతలు చూస్తున్న వెల్లడించారు. తెలంగాణ వ్యవసాయం, బతుకమ్మ, శ్రమ జీవనం, పోరాటం, ఇలా అన్ని సందేశాలు ఇచ్చే విధంగా తెలంగాణ తల్లి విగ్రహన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం ఇప్పటికే సీఎం రెండు మూడు సార్లు ఏవరికీ చేప్పకుండా విగ్రహం తయారు చేస్తున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు. ఇక తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయబోయే ప్రదేశంలో పెద్ద ఫౌంటైన్‌ను, రాత్రికాగానే లేజర్ ఫౌంటైన్ ను ఏర్పాటు చేయనున్నారు. దీన్ని ట్యాంక్ బండ్ పైకి, ఎన్టీఆర్ మార్గ్ లోకి వచ్చే సందర్శకులకు సైతం అనుమతి ఇవ్వనున్నారు.. ఇప్పుడు పెట్టబోయే విగ్రహం కోసం సాదరణ సందర్శకుల కోసం ప్రత్యేక గేటును కూడ ఏర్పాటు చేయనున్నారు. అయితే.. ప్రస్తుతం సర్కార్ ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తుంది.. డిసెంబర్ 9వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి..డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా.. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. సోనియా గాంధీ జన్మదినంతో పాటు ప్రజా పాలన ఏడాది విజయోత్సవాలను ఘనంగా నిర్వహించేలా రేవంత్ రెడ్డి సర్కార్ ప్లాన్ చేసింది.

## సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని..
# వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య



మధ్య భీకరపోరు కొనసాగింది. ఇరువర్గాల మధ్య హెూరాహెూరీగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకుల తోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు. తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు సమీప గ్రామాల ప్రజలు చెప్తున్నారు. చెల్పాక పంచాయతీ పరిధిలోని పోలుకమ్మ వాగు గొత్తికోయగూడేనికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం పుల్లలమెద తోగు సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శబరీశ్ పరిశీలించారు. మృతుల్లో నర్సంపేట–ఇల్లందు ఏరియా దళ కమాండర్ కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), డివిజన్ కమిటీ సభ్యుడు ఏగోలోపు మల్లయ్య అలియాస్ కోటి (43), ఏరియా కమిటీ సభ్యురాలు ముసకి జమున (23), ఏరియా కమిటీ సభ్యుడు కరుణాకర్ (22) ఉన్నట్టు ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. మిగిలిన వారిని గుర్తించాల్సి ఉన్నదని చెప్పారు. పీఎల్‌జీఏ వారోత్సవాలకు ఒకరోజు ముందు మావోయిస్టు పార్టీకి తెలంగాణలో భారీ దెబ్బ కోలుకోలేని దెబ్బతగిలింది.

### సొంత చెల్లిని అన్నే..
## మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య



వివాహం చేసుకున్నారు. ఇది నచ్చని ఆమె సోదరుడు పకడ్బందీగా ప్లాన్ చేసి, డ్యూటీకి వెళ్తుండగా కార్‌తో ఢీ కొట్టి, వేట కొడవలితో నరికి హత్య చేశాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. '8 సంవత్సరాలుగా నేను నాగమణి ప్రేమించుకుంటున్నాం. మా ప్రేమ విషయం తెలిసి ఇంట్లో వాళు నాగమణిని పట్టించుకోవడం మానేశారు. 2021లో ఆమెకు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. అంతకుముందు 4 సంవత్సరాలు తను హాస్టల్?లోనే ఉంది. ఆ సమయంలో నేనే ఆమెకు కావాల్సిన అవసరాలు తీర్చి చదివించాను. కానిస్టేబుల్ జాబ్ వచ్చాక తల్లిదండ్రులు ఆమెకు దగ్గరయ్యారు. నవంబర్ 10వ తేదీన యాదగిరిగుట్టలో మేం పెళ్లి చేసుకున్నాం. పెళ్లి చేసుకున్న వెంటనే మాకు ప్రాణహాని ఉందని పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేశాం. మేం పెళ్లి చేసుకున్నప్పటి నుంచి మమ్మల్ని చంపుతామని నాగమణి కుటుంబసభ్యులు బెదిరిస్తూ వచ్చారు. ఈరోజు అనుకున్నట్టే నా భార్యను వాళ్ల తమ్ముడు చంపేశాడు. రాయపోల్ నుంచి హయత్‌నగర్ బయలుదేరే ముందు నాకు ఫోన్ చేసింది. మా తమ్ముడు నన్ను చంపేస్తున్నాడు అంటూ ఫోన్ కట్ చేసింది. వెంటనే మా అన్నయ్యకు విషయం చెప్పాను. ఆయన వెళ్లేలోపే రక్తపు మడుగులో నాగమణి కొట్టుకుంటుంది.' అని నాగమణి భర్త శ్రీకాంత్ వివరించారు. కాగా హత్యలో కొత్త విషయాలు వెలుగు లోకి వస్తున్నాయి. తొలుత పరువు హత్య అనుకున్నప్పటికీ కారణాలు వేరే ఉన్నాయని తెలుస్తున్నది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణి సోమవారం ఉదయం హత్యకు గురయ్యారు. ఇది పరువు హత్య అని తొలుత భావించినప్పటికీ పోలీసుల విచారణలో ఆస్తి గొడవలే కారణమని తెలుస్తున్నది. రాయపోల్‌కు చెందిన నాగమణి గత నెల 1న.. అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ను యాదగిరిగుట్టలో కులాంతర వివాహం చేసుకున్నది. అనంతరం వారు హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో నాగమణి తన సొంత గ్రామానికి వెళ్లారు. అయితే సోమవారం ఉదయం స్కూటీపై డ్యూటీకి వస్తుండగా.. కారులో వెంబడించిన తమ్ముడు పరమేష్ ఆమెను ఢీకొట్టాడు. అనంతరం కొడవలితో మెడ నరికి చంపాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఆస్తి కోసమే చంపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నాగమణికి తల్లిదండ్రులు లేకపోవడంతో పరమేశ్ అన్నీ తానే చూసుకున్నాడు. కాగా ఆమెకు ఇదివరకే వివాహమై విడాకుల కూడా అయ్యాయి. దీంతో తమ వారసత్వంగా వచ్చిన భూమిని మొదటి వివాహం తర్వాత తమ్ముడికి ఇచ్చేసింది. అయితే రెండో పెండ్లి చేసుకున్న తర్వాత.. ఆ భూమిలో వాటా ఇవ్వాలని గత కొంతకాలంగా తమ్ముడిపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో అక్కపై కోపంతో ఉన్న పరమేశ్ ఆమెను హత్యచేశాడు.

## బంగ్లాలో ఆందోళనలపై ప్రధాని జోక్యం చేసుకోవాలి

**ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిమాండ్**

**కోల్‌కతా(జనంసాక్షి):** బంగ్లాదేశ్ లో హిందువులు, ఇతర మైనారిటీలు, దేవాలయాలపై దాడులు జరుగుతుండటంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఈ దాడుల నేపథ్యంలో కొత్త డిమాండ్‌ను తెర పైకి తీసుకొచ్చారు. ఆందోళనకర పరిస్థితులు నెలకొన్న బంగ్లాదేశ్‌లో ఐరాస శాంతి పరిరక్షక దళాన్ని ఏర్పాటుచేయాలని దీదీ పిలుపునిచ్చారు. మైనారిటీల భద్రత కోసం ఈవిషయంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని కోరారు. "బంగ్లాదేశ్‌లో మన వాళ్లు, మన కుటుంబాలు, ఆస్తులు ఉన్నాయి. అక్కడి పరిస్థితులను చక్కబెట్టేందుకు భారత్ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈవిషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తాం. మన ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలి" అని సీఎం డిమాండ్ చేశారు.ప్రపంచవ్యాప్తంగా మతపరంగా జరిగే దురాగతాలను ఆమె తీవ్రంగా ఖండించారు. "బంగ్లాలో ఐరాస శాంతి పరిరక్షక దళాన్ని ఏర్పాటుచేయాలన్నారు.

# ఆరోగ్య తెలంగాణ



మీరు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు. ఈ ప్రభుత్వం కష్టం మీద వచ్చిందని చెప్పడం లేదని, కానీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించడం ద్వారా మా తలరాతను మార్చి పెద్ద బాధ్యతలు ఇచ్చారని, కాబట్టి విషప్రచారాన్ని కూడా తిప్పికొట్టే బాధ్యత మీదే అన్నారు. నల్లచట్టాలు తెచ్చిన మోదీ, వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌లో గల హెచ్ఎండీఏ మైదానంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ప్రజాపాలన వేడుకల్లో భాగంగా 213 అంబులెన్స్‌లను ప్రారంభించారు. 108, 102 వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత విద్య, వైద్యం అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ రెండింటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఏడాదిలోపు తమ ప్రభుత్వం వైద్యశాఖలో 14 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. వైద్య శాఖ బలోపేతమైతేనే ఆరోగ్య తెలంగాణ నిర్మాణమవుతుందన్నారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున వైద్య శాఖలో ఎవరూ భర్తీ చేయలేదన్నారు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. తెలంగాణ సమాజమే తమ కుటుంబం అనుకొని తాము ఉద్యోగాలు ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ ఎనిమిది మెడికల్ కాలేజీలను ఇచ్చి కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఉద్యోగాలు ఊడితేనే యువతకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పరీక్షలు వాయిదా వేయమని చాలామంది డిమాండ్ చేశారని, కానీ విద్యార్థుల విలువైన సమయం వృథా అవుతుందని అలా చేయలేదన్నారు. కానీ గత ప్రభుత్వం పలుమార్లు వాయిదా వేసిందన్నారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నదని... తాము మాత్రం పంటలు వేసేలా ప్రోత్సహించామన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించామని గుర్తు చేశారు. తాము అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు పడుతుంటే కొంతమందికి భయం పట్టుకుందన్నారు. సంక్రాంతికి ముందు గంగిరెద్దుల వాళ్లు వచ్చినట్లు కొంతమంది వస్తారని, కానీ వారు వచ్చేది పంచాయతీ ఎన్నికల కోసమే అన్నారు. సీఎంగా తన పనిని ఆపి పక్కన పెడితే... అభివృద్ధి ఆగిపోతుందన్నారు. అందుకే తాను పని మీద దృష్టి సారించానన్నారు. మీరు (కార్యకర్తలు, ప్రజలు) భుజాలపై మోస్తేనే తాము అధికారంలో కూర్చున్నామన్నారు. మాకు కుర్చీ రావడానికి కారణం ఈ ప్రజలు, కార్యకర్తలే అన్నారు. కాబట్టి ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మీదే అన్నారు. అందుకే ప్రతిపక్షం చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టే బాధ్యత కూడా మీదేనని సభకు వచ్చిన వారిని ఉద్దేశించి అన్నారు. పేదలపై కరెంట్ బిల్లు భారం తప్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం 'గృహజ్యోతి' పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ ను వినియోగించే కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా కరెంట్ అందిస్తోంది. దీంతో ఆయా కుటుంబాలకు కరెంట్ బిల్లు చెల్లించే అవసరం తప్పింది. ఆమేరకు కుటుంబాలపై భారం తగ్గింది. ఈ పథకంపై తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. పేదల ఇంట విద్యుత్ వెలుగులు పంచాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలను ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద కేవలం హైదరాబాద్ లోనే 10.52 లక్షల కుటుంబాలు లబ్ది పొందుతున్నాయని సీఎం చెప్పారు. ఈ పరిణామం హర్షణీయం అని పేర్కొన్నారు. సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ గా ఇందిరమ్మ పాలన నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

## కోకాకోలా ప్లాంట్‌ను ప్రారంభించిన సీఎం




అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించడం ఇదే తొలిసారి. సీఎం వెంట మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ ఉన్నారు. సీఎం పర్యటన సందర్భంగా కంపెనీలోకి కాంగ్రెస్ నేత నర్సారెడ్డిని పోలీసులు అనుమతిం చకపోవడంతో కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. కంపెనీ గేటు ధ్వంసం చేసి కార్యకర్తలు లోపలికి దూసుచ్చినట్లు సమాచారం.

## మరోసారి రెచ్చిపోయిన హూతీలు

ఏడు క్షిపణులు, డ్రోన్లను నేల కూల్చిందని తెలిపారు. ఈ దాడి లో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదన్నారు. "యూఎస్‌కు చెందిన వాణజ్య నౌకలపై హూతీల దాడిలో అమెరికన్ నేవీ డెస్ట్రాయర్స్ మూడు యాంటీషిప్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు ఓ యాంటీ షిప్ క్రూయిజ్ క్షిపణిని కూల్చివేశారు" అని అధికారులు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్ ఏర్పాటుచేసిన ప్రతిఘటన కూటమిలో హమాస్, హెజ్బొల్లాలతో పాటు హూతీలూ భాగస్వాములు. దీంతో గాజాలో ఇజ్రాయెల్ విధ్వంసాన్ని నిరసిస్తూ హూతీలు ఎర్ర సముద్రంలో దాడులకు దిగుతున్నారు. 2023 నవంబర్‌లో ఎర్ర సముద్రం, ఏడెన్ గల్ఫ్‌లో నౌకలపై దాడులు ప్రారంభించారు. ఎర్ర సముద్రం మీదుగా జరిగే అంతర్జాతీయ నౌకా వాణిజ్యాన్ని వరుస దాడులతో అతలాకుతలం చేస్తున్నారు. ఈనేపథ్యంలో హూతీల దాడుల నుంచి వాణిజ్య నౌకలకు రక్షణగా అమెరికా, ఇతర దేశాలు ఎర్ర సముద్రంపై సైనిక నౌకలను మోహరించాయి.

## ప్రధాని అద్భుత పనితీరుతో 'ప్రగతి' పరుగులు

వెల్లడైంది. 'ప్రగతి ప్లాట్ ఫామ్ దేశవ్యాప్తంగా 340 ప్రాజెక్ట్‌లను వేగవంతం చేసింది. దీని విలువ సుమారు 205 బిలియన్ల డాలర్లు. 'ఇది కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల రూపకల్పన విషయంలో రెడ్ టేప్ బ్యూరోక్రసీని తగ్గించడానికి వీలు కల్పించింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 44 ప్రగతి సమావేశాలు నిర్వహించి మొత్తం రూ.18.12 లక్షల కోట్లతో 355 ప్రాజెక్టులపై సమీక్షించారు 'అని డిసెంబర్ 2 న విడుదల చేసిన అధ్యయనంలో వెల్లడించాయి. కాగా తాజా సమావేశంలో రోడ్డు కనెక్టివిటీకి సంబంధించి రెండు, రెండు రైలు, బొగ్గు, విద్యుత్, జలవనరుల రంగాల్లో ఒక్కో ప్రాజెక్టుతో సహా ఏడు ప్రాజెక్టులపై సమీక్ష జరిగింది. ఈ ప్రాజెక్టుల వ్యయం మొత్తం రూ.76,500 కోట్లకు పైగానే. ఈ ప్రాజెక్టులు 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించినవి. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార?ండ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, ఒడిశా, గోవా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీలో ఈ ప్రాజెక్టులు ఉన్నాయి. 340 ప్రాజెక్టులలో చాలా వరకు మూడు నుండి 20 సంవత్సరాల వరకు గడువు ముగిసినట్లు కేస్ స్టడీ పేర్కొంది. ప్రగతి ప్లాట్ ఫామ్ లో ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డ్ ఉంది. ఇది దశాబ్దాల నుండి నెలల వరకు ఆలస్యాన్ని తగ్గించడంలో సహాయపడింది. 2015లో ప్రారంభించబడిన ప్రగతి ప్లాట్‌ఫారమ్ ప్రజల ఫిర్యాదులను పరిష్కరిస్తుంది, అలాగే ముఖ్యమైన కేంద్ర కార్యక్రమాలను అలాగే రాష్ట్రాలు ఫ్లాగ్ చేసిన ప్రాజెక్టులను పర్యవేక్షిస్తుంది. వాటిని సమీక్షిస్తుంది. అలాగే కేస్ స్టడీ కొన్ని ప్రాజెక్ట్‌లను హైలైట్ చేస్తుంది. జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ వంతెన, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైలు వంతెన, అస్సాంలోని బ్రహ్మపుత్రపై బోగీబీల్ వంతెన, 2018లో పూర్తయింది. జల్ జీవన్ మిషన్, భారతదేశంలోని ప్రతి గ్రామీణ గృహానికి ఇండోర్ ట్యాప్ వాటర్ కనెక్షన్‌లను అందించే కార్యక్రమం. అలాగే ముఖ్యమైన కేంద్ర కార్యక్రమాలను అలాగే రాష్ట్రాలు ఫ్లాగ్ చేసిన ప్రాజెక్టులను పర్యవేక్షిస్తుంది. వాటిని సమీక్షిస్తుంది. అలాగే కేస్ స్టడీ కొన్ని ప్రాజెక్ట్‌లను హైలైట్ చేస్తుంది. జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ వంతెన, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైలు వంతెన, అస్సాంలోని బ్రహ్మపుత్రపై బోగీబీల్ వంతెన, 2018లో పూర్తయింది. జల్ జీవన్ మిషన్, భారతదేశంలోని ప్రతి గ్రామీణ గృహానికి ఇండోర్ ట్యాప్ వాటర్ కనెక్షన్‌లను అందించే కార్యక్రమం. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర స్థాయి అమలు చేసే ఏజెన్సీల మధ్య మెరుగైన సమన్వయాన్ని సులభతరం చేయడం ద్వారా ప్రగతి సమీక్షలు ఈ చొరవపై పురోగతిని వేగవంతం చేయడంలో సహాయపడ్డాయి. "ఉదాహరణకు 2021లో జరిగిన ఒక సమీక్ష, ఆరు నెలల వ్యవధిలో నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో కొత్త కుళాయి కనెక్షన్‌ల రేటులో 20 శాతం పెరుగుదలకు దారితీసింది' అని అధ్యయనం తెలిపింది. '2019లో, మొత్తం భారతీయ కుటుంబాలలో కేవలం 17 శాతం మాత్రమే నీటి సరఫరాను కలిగి ఉన్నాయిబీ నవంబర్ 2024 నాటికి, 79 శాతం మంది ఉన్నారు' అని ఈ అధ్యయనాల్లో తేలింది.

## బెయిల్ వచ్చిన మరునాడే మంత్రి పదవా!?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** క్యాష్ ఫర్ జాబ్ స్కాంలో బెయిల్ పొందిన తమిళనాడు నేత సెంథిల్ బాలాజీకి... జైలు నుంచి విడుదలైన మరుసటి రోజే మంత్రి పదవి లభించడంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మేం బెయిల్ ఇచ్చాం... తర్వాత రోజే మీరు మంత్రి అయ్యారు... ఏం జరుగుతోంది? అంటూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం విస్మయం వెలిబుచ్చింది. సెంథిల్ బాలాజీ బెయిల్ తీర్పును రీకాల్ చేయాలంటూ దాఖలైన పిటిషన్ ను జస్టిస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసీ ధర్మాసనం విచారించింది. మేం ఇలా బెయిల్ ఇచ్చామో లేదో, అలా మీరు మంత్రి అయిపోయారు... ఇప్పుడీ కేసులో సాక్షుల పరిస్థితి ఏంటి? మీరు మంత్రి హెూదాలో అధికార పీఠంపై ఉన్నందున సాక్షుల్లో ఆందోళన నెలకొనదా? అని సుప్రీం ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే సెంథిల్ బాలాజీ బెయిల్ పై పునరాలోచన లేదని, అతడి బెయిల్ రద్దు చేయబోమని స్పష్టం చేసింది. కానీ, సాక్షులు ఆందోళనకు గురవుతారన్న అంశాన్ని మాత్రం పరిగణనలోకి తీసుకుంటామని, ఆ అంశం వరకు విచారణ జరుపుతామని తెలిపింది. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బు వసూలు చేసిన కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ 2023 జూన్ 14న అరెస్ట్ చేసింది. సెంథిల్ బాలాజీ 2011-15లో అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు ఈ స్కాం జరిగింది. సెంథిల్ బాలాజీ 2018లో అన్నాడీఎంకేను వీడి డీఎంకే పార్టీలో చేరారు. స్టాలిన్ ప్రభుత్వంలో మంత్రి పదవిని చేపట్టారు. అయితే, క్యాష్ ఫర్ జాబ్ స్కాంలో ఆయన జైలుకు వెళ్లడంతో మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

## పశ్చిమాఫ్రికా దేశం గినీలో ఘోర విషాదం

జెరెకొరె (జనంసాక్షి):పశ్చిమాఫ్రికా దేశం గినీలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి.పరస్పరం దాడి చేసుకోవడంతో దాదాపు 100 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈమేరకు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. గినీ మిలిటరీ జుంటా నేత మమాడి దౌంబోయ గౌరవార్థం దేశంలోని రెండో అతిపెద్ద నగరం జెరెకొరె నగరంలో ఓ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులోభాగంగా ఆదివారం జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ మధ్యలో రిఫరీ తీసుకున్న ఓ నిర్ణయం వివాదాస్పదమైంది. దాన్ని వ్యతిరేకించిన ఓ జట్టు అభిమానులు మైదానంలోకి దూసుకెళ్లారు. దీంతో అవతలి జట్టు అభిమానులు వీరిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ చెలరేగింది.వేలాది మంది అభిమానులు వీధుల్లోకి వచ్చి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. కొందరు పోలీస్‌స్టేషన్‌కు నిప్పు పెట్టారు. ఈ హింసాత్మక ఘర్షణల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. వీధుల్లో ఎక్కడ చూసినా చెల్లాచెదురుగా మృతదేహాలు పడి ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై స్థానిక ఆసుపత్రి డాక్టర్ ఒకరు మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 100 మంది మృతిచెందారని వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

# మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచండి

రెడ్డి స్పందించారు. మావోయిస్టులపై విషపదార్థాలు ప్రయోగించారనేది దుష్ప్రచారమని అన్నారు. మావోయిస్టులు స్పృహ కోల్పోయాక కాల్పులు జరిపామనడం అవాస్తమని తెలిపారు. వారు అత్యాధునిక ఆయుధాలతో పోలీసులపై కాల్పులు జరిపారని వివరించారు. పెట్రోలింగ్? చేస్తున్న పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరపడంతో, పోలీసులు ఎదురు తిరిగి కాల్పులు జరపడంతో ఏడుగురు మావోయిస్టులు మరణించారని వెల్లడించారు. హైకోర్టు, ఎన్?హెచ్?ఆర్సీ సూచనల మేరకు శవపరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఎన్?కౌంటర్? కేసు దర్యాప్తు అధికారిగా వేరే జిల్లా డీఎస్పీని నియమించినట్లు డీజీపీ జితేందర్? ప్లెస్? నోట్?లో వివరాలు వెల్లడించారు. కాగా ములుగు జిల్లా ఏటూరు నాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్?లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ బూటకు ఎన్?కౌంటర్?పై తెలంగాణ హైకోర్టులో పౌరహక్కుల సంఘం లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేసింది. మావోయిస్టుల భోజనంలో విషప్రయోగం జరిగిందని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై న్యాయస్థానం మధ్యాహ్నం విచారణను చేపట్టింది. మృతదేహాలను వైద్య నిపుణుల సమక్షంలో పోస్టుమార్టం జరపాలని పిటిషన్‌లో పౌరహక్కుల సంఘం పేర్కొంది. పోస్టుమార్టాన్ని వీడియో ద్వారా రికార్డు చేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. మరోవైపు కుర్సం మంగు, అలియాస్ భద్రుపై రూ.20 లక్షల రివార్డు ఉన్నట్లు జిల్లా ఎస్పీ శబరీష్ తెలిపారు. పూలకొమ్మ అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న గ్రౌండ్స్ బలగాలపై మావోయిస్టులు దాడి చేయడంతో ఆత్మ రక్షణ నిమిత్తం కాల్పులు జరిపామని తెలిపారు. మావోయిస్టుల మృతదేహాల తరలింపులో హైడ్రామా చోటుచేసుకుంది. తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగినా, రాత్రి ఏడు గంటల వరకూ మృతదేహాల తరలింపు జరగలేదు. తొలుత ములుగు ఏరియా ఆసుపత్రికి మృతదేహాలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఫ్రీజర్లను సైతం సిద్ధం చేశారు. ఆఖరి నిమిషంలో రాత్రి పదకొండున్నర గంటల ప్రాంతంలో ఏటూరునాగారం సామాజిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇవాళ ఫోరెన్సిక్ వైద్యులు శవ పరీక్షలు నిర్వహించిన అనంతరం, మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు .వారం రోజుల పాటు పీపుల్స్ గెరిల్లా ఆర్మీ వారోత్సవాలు జరుగుతాయని మావోయిస్టులు ముందే ప్రకటించగా, దానికి ఒకరోజు ముందే ఈ ఘటన జరగడంతో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ములుగు ఎన్?కౌంటర్? ఘటనపై తెలంగాణ పౌరహక్కుల సంఘం నేతలు పలు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. పోలీసులెవ్వరికీ గాయాలు కాలేదని, అసలు ఎన్?కౌంటర్? జరిగినట్లు లేదని, అన్నంలో విషం పెట్టి, స్పృహ కోల్పోయిన తర్వాత చిత్రహింసలకు గురి చేసి కాల్చి చంపారని సంఘం నేతలు ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్?కౌంటర్?పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, నిపుణులైన వైద్య బృందం పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరగాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, కిట్ బ్యాగులు, మావోయిస్టు విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

# పుత్రవాత్సల్యం..

పాటిస్తున్న సూత్రం ఇదే..! న్యాయశాఖ తీసుకునే నిర్ణయాల్లో జోక్యం చేసుకోబోనని అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటిరోజే చెప్పా. ఆ మాటకు నేను కట్టుబడి ఉన్నా. నా కుమారుడు హంటర్ ను అన్యాయంగా విచారించే సమయంలోనూ నేను చూస్తూ ఉండిపోయా. రాజకీయ కుట్రలో భాగంగానే అతడిపై కేసులు పెట్టారు. ఇక జరిగింది చాలు. ఈ కేసుల్లో అతడికి క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించుకున్నా. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నానో అమెరికా ప్రజలు అర్థం చేసుకుంటారని భావిస్తున్నా" అని ఆయన పేర్కొన్నారు. కాగా.. హంటర్ దోషిగా తేలిన సమయంలో క్షమాభిక్షకు యత్నించబోనని స్పష్టంగా పేర్కొన్న బైడెన్ తాజాగా ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది.

**హంటర్‌పై ఉన్న కేసులివే..**

2018లో తుపాకీ కొనుగోలు సందర్భంగా ఆయుధ డీలరుకు ఇచ్చిన దరఖాస్తు ఫారంలో హంటర్ తప్పుడు సమాచారం ఇచ్చారు. తాను అక్రమంగా డ్రగ్స్ కొనుగోలు చేయలేదని, వాటికి బానిస కాలేదని, తనవద్ద అక్రమంగా ఆయుధం లేదని వెల్లడించారు. అయితే అది తప్పని తేలింది. అప్పటికే హంటర్ డ్రగ్స్ అక్రమంగా కొనుగోలు చేశారు. వాటికి బానిసగా మారారు. 11 రోజులపాటు అక్రమంగా ఆయుధం కలిగిఉన్నారు. ఇక, కాలిఫోర్నియాలో 1.4 మిలియన్ డాలర్ల పన్ను ఎగవేత ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది.అక్రమ ఆయుధం కొనుగోలు వ్యవహారంలో హంటర్‌పై నమోదైన కేసులో ఈ ఏడాది జూన్‌లో న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది. అయితే ఇప్పటివరకు శిక్ష ఖరారు చేయలేదు. దీనిపై అప్పట్లో జో బైడెన్ స్పందిస్తూ.. తీర్పును అంగీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కేసులో తాను కుమారుడి తరఫున క్షమాభిక్ష కోరబోనని అప్పట్లో వెల్లడించారు. ఇప్పుడు అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే సమయంలో కుమారుడికి క్షమాభిక్ష ప్రసాదించే అవకాశాన్ని బైడెన్ వినియోగించుకున్నారు.

**బైడెన్ నిర్ణయం న్యాయ విరుద్ధం: ట్రంప్**

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన కుమారుడు హంటర్ బైడెన్‌కు క్షమాభిక్ష పెట్టడాన్ని అగ్రరాజ్యానికి కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తప్పుబట్టారు.ఇది పూర్తిగా న్యాయవిరుద్ధమని, అధికార దుర్వినియోగమని మండిపడ్డారు.అక్రమంగా ఆయుధం కొనుగోలు, ఆదాయపు పన్ను విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారని డెలావెర్, కాలిఫోర్నియాలో తన కుమారుడు హంటర్‌పై కేసులు నమోదైన నేపథ్యంలో తనకున్న అధికారంతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అతడికి వాటినుంచి ఉపశమనం కల్పించారు. హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదించారు . తన కుమారుడిపై కేసులు రాజకీయ ప్రేరేపితమైనవేనని బైడెన్ ఆరోపించారు. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నానో అమెరికా ప్రజలు అర్థం చేసుకుంటారని భావిస్తున్నానని పేర్కొన్నారు. కాగా.. హంటర్ దోషిగా తేలిన సమయంలో క్షమాభిక్షకు యత్నించబోనని స్పష్టంగా పేర్కొన్న బైడెన్.. తాజాగా ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది.దీనిపై డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ బైడెన్ నిర్ణయం 'న్యాయ విఘాతం' అని అన్నారు. 'హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదించినట్లే ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్న జే-6 (జనవరి 6న క్యాపిటల్ హిల్‌లో ట్రంప్ తరఫున అల్లర్లలో పాల్గొన్నవారు) బందీలకు ఎందుకు ఉపశమనం కల్పించలేదని ప్రశ్నించారు. తన కుమారుడిని కేసుల నుంచి తప్పించడం పూర్తిగా న్యాయవిరుద్ధం, అధికార దుర్వినియోగం అని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు.2021 జనవరి 26న అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్(ఏనీవ ఃతిటవని) విజయాన్ని ధ్రువీకరించేందుకు వాషింగ్టన్ క్యాపిటల్ భవనంలో కాంగ్రెస్ సమావేశమైన సమయంలో ట్రంప్ మద్దతుదారులు వేలాదిగా క్యాపిటల్ భవనంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించారు. వారి దాడిలో 140 మందికి పైగా పోలీసు అధికారులు గాయపడ్డారు. దాడుల్లో పాల్గొన్న 1,500 మందిపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ దాడులకు నాయకత్వం వహించిన తీవ్రవాద ప్రౌడ్ బాయ్స్ నాయకుడు ఎన్రిక్ టారియోకు 22 ఏళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తుండగా, ఓత్ కీపర్స్ మిలిటెంట్ గ్రూపు నాయకుడు స్టీవర్ట్ రోడ్స్ 18 ఏళ్లుగా కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. కాగా అమెరికా ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందడంతో వారిపై ఉన్న కేసులను మాఫీ చేస్తారని ఆయన మద్దతుదారులు ఎదురుచూస్తున్నారు.

## ఉక్రెయిన్‌కు అణ్వాయుధాలు తిరిగి ఇవ్వబోం..

**కేవలం రక్షణ కోసమే సాయం చేస్తాం**

**అమెరికా కీలక ప్రకటన**

**వాషింగ్టన్(జనంసాక్షి):** రష్యా–ఉక్రెయిన్‌ల యుద్ధం తీవ్రరూపం దాల్చొచ్చన్న భయాందోళనల మధ్య అమెరికా ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఉక్రెయిన్‌కు అణ్వాయుధాలు తిరిగి ఇవ్వబోమని అగ్రదేశం ప్రకటించింది.సోవియట్ యూనియన్ పతనం తర్వాత కీవ్ వదులుకున్న అణ్వాయుధాలను తిరిగి అప్పగించే ప్రసక్తే లేదని వైట్‌హౌస్ తేల్చి చెప్పింది. అలాంటి ప్రతిపాదన తమ పరిశీలనలో లేదని, ఉక్రెయిన్ తనను తాను రక్షించుకుంటూ రష్యాపై పోరాడేందుకు మాత్రమే సాయం చేస్తున్నామని తెలిపింది. పదవి నుంచి దిగిపోయే ముందు ఆ దేశానికి అణ్వాయుధాలు ఇవ్వాలని జో బైడెన్ కొందరు సూచించారని కొన్ని రోజుల క్రితం అమెరికన్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఈనేపథ్యంలోనే తాజాగా ఈ స్పందన వచ్చింది.కోల్డ్‌వార్ ముగిసే సమయానికి బ్రిటన్, ఫ్రాన్స్, చైనాల కంటే అత్యధిక అణ్వాయుధాలు ఉన్న దేశం ఉక్రెయిన్ సోవియట్ యూనియన్ పతనం తర్వాత ఈ దేశం ఆవిర్భవించే నాటికి రష్యా నుంచి వారసత్వంగా వచ్చిన దాదాపు 5 వేలకు పైగా అణ్వస్త్రాలు ఉక్రెయిన్ వద్ద ఉన్నాయి. కీవ్ కంటే రష్యా, అమెరికా వద్ద మాత్రమే అత్యధిక అణ్వాయుధాలు ఉన్నాయి. 33 హెవీ బాంబర్లు కూడా ఉక్రెయిన్‌లో ఉన్నాయి. కొత్త పాలకులు వీటిని నిర్వహించే సైనికులు, కమాండర్లను దేశానికి విశ్వాసంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయమని కోరగా.. కొందరు నిరాకరించడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అనంతరం ఉక్రెయిన్‌తో అణు నిరాయుధీకరణ చేయించేందుకు బ్రిటన్, రష్యా, అమెరికా చర్చలు జరిపాయి. 1994లో ఈ నాలుగు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఓ ప్రకటన చేశారు.బుడాపెస్ట్ ఒప్పందంగా ప్రకారం ఉక్రెయిన్ అణ్వాయుధాలను నాశనం చేయాలి. దీనికి ప్రతిగా ఉక్రెయిన్ సార్వభౌమ త్వానికి, నాటి సరిహద్దులను గౌరవించాలి. ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా ఈ దేశాలు ఎటువంటి సైనిక శక్తిని ప్రయోగించకూడదు.

# సైన్స్ అభివృద్ధి చెందితే మూఢనమ్మకాలు తొలగిపోతాయి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- 52వ బాలల వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు




**కరీంనగర్ ప్రతినిధి, డిసెంబర్ 02 (జనంసాక్షి) :** సైన్స్ అభివృద్ధి చెందితేనే మూఢనమ్మకాలు తొలగిపోతాయని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొత్తపల్లిలోని సెంట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో. నిర్వహిస్తున్న 52వ బాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చొప్పదండి నియోజక వర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ భారతదేశంలో మన వేదాలోనే శాస్త్రీయ జ్ఞానం ఉంది. ఆనాడు శస్త్ర చికిత్సలో సుశ్రుతుడు ప్రపంచంలోనే మొదటి వాడని అక్కడి నుండి సైన్స్ అనేది క్రమేణా రోజురోజుకు దశలవారీగా అభివృద్ధి చెందుతుందని నిప్పులు కనుగొన్న హెూమోసెఫియన్స్ నుంచి ఈరోజు కృత్రిమ మేధస్సు ద్వారా మరమనుషులను తయారు చేస్తూ సైన్స్ అనేది దినదినం అభివృద్ధి చెందుతుందని, ఇంకా అడ్వాన్స్ గా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలోకి పరుగులు తీస్తున్నామని, మనం ఈ దేశంలో మొట్టమొదటిసారిగా 1975 వ సంవత్సరంలో ఆర్యభట్ట ఉపగ్రహాన్ని మొట్టమొదటిసారిగా ప్రయోగించి ఈరోజు చంద్రయాన్ 1,2,3 దాకా పంపుచున్నామని, ఇది మన దేశ ఔన్నత్యమని, ప్రపంచం అజ్ఞానంలో మగ్గినప్పుడు భారతదేశం ప్రపంచానికి వెలుగులు నింపిందని, వేల సంవత్సరాల క్రితమే భారతదేశం శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకెళుతుందని కొత్త కొత్త ఆవిష్కరణలన్నింటికీ మూలం భారతదేశమేనని వారు తెలిపారు. సైన్స్ అభివృద్ధి చెందితే మూఢనమ్మకాలు తొలగిపోతాయని ప్రతి ఇల్లు ప్రతి కుటుంబం శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకొని భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలని వారు తెలిపారు. ఈ రోజు మన ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అందుకే నైపుణ్య శిక్షణ కేంద్రాల పేరిట స్కిల్ యూనివర్సిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నామని విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చే ప్రభుత్వం ఇదేనని వారు తెలిపారు. జిల్లా అదనపు పాలనాధికారి

ప్రఫుల్దేశాయ్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అవలంబించుకొని నూతన ఆవిష్కరణల వైపు వాళ్ళ మేధస్సును వినియోగించాలని, సైన్స్ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. సాంప్రదాయ శాస్త్రీయ విజ్ఞానం నుండి ఆధునిక శాస్త్రీయ విజ్ఞానం వైపు మన ఆలోచనలు సాగాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని వారు తెలిపారు. విద్యార్థులు ఒకసారి వైఫల్యం చెందినంత మాత్రాన నిరుత్సాహ పడకూడదని మరింత ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించి నూతన ఆవిష్కరణలు చేపట్టాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రీ అజయ్ యాదవ్, ఐ.ఎ.ఎస్., జిల్లా విద్యాధికారి సి.హెచ్.వి.ఎస్. జనార్ధన్ రావు, జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి, డి.సి.ఇ.బి సెక్రటరీ మారం స్వదేశీ కుమార్, సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల చైర్మన్ డా.పిఫాతిమా రెడ్డి, మహ్మద్అజీం, భగవంతయ్య, ఏనుగు ప్రభాకర్ రావు, మిల్కూరీ శ్రీనివాస్, గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, కె.ఎస్. అనంతాచార్య తదితరులు పాల్గొన్నారు. తదనంతరం ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది. జిల్లా సైన్స్ లో జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో ఏడు మంది విద్యార్థులను, ద్వితీయ స్థానంలో ఏడు మంది విద్యార్థులను, సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో ఏడు మంది విద్యార్థులను, తృతీయ స్థానంలో ఏడు మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగింది. అలాగే ఈ రెండు విభాగాల నుండి తృతీయ స్థానానికి కూడా 14 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగింది. అంతేకాకుండా 12 వ ఇన్స్పైర్ అవార్డ్స్ మనక్ 2023-24 కోసం 13 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగింది. సైన్స్ ఫెయిర్ జూనియర్స్, సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన 7o7 విద్యార్థులను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు పంపించడం జరుగుతుంది. అలాగే ఇన్స్పైర్ మనక్ లో ఎన్నిక కాబడిన 13 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయికి పంపించడం జరుగుతుంది. ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని వివిధ ప్రాంతాల నుండి 77 పాఠశాలలకు చెందిన 6860 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పురప్రజలు సందర్శించారు. కార్యక్రమ ముగింపు ఉత్సవంలో సెయింట్ జార్జ్ పాఠశాలలు మరియు బాలభవన్ విద్యార్థుల నృత్యాలు అతిథులను ఎంత గానో అలరించాయి.

# మీడియాది అత్యుత్సాహం

- దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ విమర్శలు



**హైదరాబాద్, డిసెంబర్ 8 (జనంసాక్షి) :** సంచలన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అరెస్ట్‌కు సంబంధించి గత కొన్ని రోజులుగా చర్చ సాగుతోన్న విషయం తెలిసిందే. వర్మను పోలీసులు అరెస్ట్ చేయబోతున్నారని. అందుకే వర్మ తప్పించుకుని తిరుగుతున్నాడని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. అయితే వర్మ తాజాగా ఈ వార్తలపై స్పందించారు. తన అరెస్ట్ విషయంలో ఒక సెక్షన్ మీడియా అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని ఆరోపణలు చేశారు. వర్మపై కేసులు నమోదైన నేపథ్యంలో తొలిసారి బహిరంగంగా మాట్లాడారు. సోమవారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా నమోదు కావడంపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమోదైన కేసులు ఉద్దేశపూర్వకంగా ఉన్నాయనే అనుమానంతోనే ముందస్తు బెయిల్ కోసం అప్లై చేసుకున్నానని తెలిపారు. మనది ఫ్రీ వరల్డ్ అన్న వర్మ, వ్యంగ్యం అనేది మీడియా సహా ప్రతి చోటా ఉంటుందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఓపెన్ చేస్తే వందలాది మీమ్స్ కనిపిస్తాయన్న వర్మ.. తాను ఏడాది క్రితం చేసిన పోస్ట్ కూడా అలాంటిదేనని క్లారిటీ ఇచ్చారు. అయితే ఏడాది తర్వాత ఒక వ్యక్తి మేలుకుని తనపై పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చాడన్నారు. ఈ పోస్టును కారణంగా చూపుతూ ఏపీలోని అనేక చోట్ల కేసులు నమోదు అయ్యాయని, ఇది ఉద్దేశపూర్వకంగా చేస్తున్నదే అనే అనుమానంతో నేను ముందస్తు బెయిల్ కోసం అప్లై చేసుకున్నానని తెలిపారు. పోలీసులు ఇంతవరకు నను అరెస్ట్ చేస్తున్నట్లు కూడా ప్రకటించలేదన్న వర్మ.. ఇంతలో ఒక సెక్షన్ మీడియా సంస్థలు వర్మను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని, వర్మ భయపడి పారిపోయాడని న్యూస్ టెలికాస్ట్ చేస్తూ వస్తున్నాయన్నారు. ఇదే మీడియా సంస్థలు నాయకులతో పాటు ఇతరుల మీద అనే ప్రోగ్రామ్స్ చేస్తుంటాయన్న వర్మ.. మొదటి సారి పోలీసులు సంప్రదించినప్పుడు తాను అందుబాటులో లేనని, రెండోసారి కూడా ఇంకాస్త సమయం కావాలని అడిగానన్నారు. అయితే కావాలంటే వర్చువల్‌గా వీడియోలో మాట్లాడుతానని పోలీసులకు తెలిపినట్లు వర్మ తెలిపారు. ఇక తాను అప్లై చేసుకున్న ముందుస్తు బెయిల్ విషయంలో జ్యుడిషియల్ ప్రాసెస్ జరుగుతోందని వర్మ చెప్పుకొచ్చారు. సెన్సార్ ఇబ్బందుల్లే తాను పొలిటికల్ మూవీస్ మానేస్తానని తెలిపినట్లు వర్మ చెప్పుకొచ్చారు. తాను ఏదైనా పోస్ట్ చేస్తే తనను, తన ఫ్యామిలీని తిడుతూ వందల కామెంట్స్, మీమ్స్ వస్తాయన్న వర్మ.. పత్రికల్లో వచ్చే కార్టూన్స్ ఎవరో ఒక నాయకుడి మీద సెటైర్ వేసేవనని, ఇది దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతోందన్నారు. ఇక తాను చేసే పోస్ట్ లో అర్థం ఒక్కొక్కరికి ఒకలా కనిపించవచ్చని, అది ఎవరి వ్యక్తిగత దృష్టి కోణాన్ని బట్టి ఉంటుందన్నారు. తాను చేసిన తప్పేంటో, ఏ సెక్షన్ లో అరెస్ట్ చేస్తున్నారో పోలీసులు చెప్పకముందే కొన్ని మీడియా సంస్థలు హడావుడి చేస్తున్నాయని అన్నారు.

# పారమిత పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన




**కరీంనగర్, డిసెంబర్ 02 (జనంసాక్షి) :** స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల విధ్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా డిసెంబర్ 2 రోజున భువనగిరి జిల్లాలోని ఉద్యానవనాన్ని విద్యార్థిని విద్యార్థులు సందర్శించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా 5వతరగతి చదువుతున్న 200 మంది విధ్యార్థులు భువనగిరి పట్టణం లోని ఉద్యానవనాన్ని ప్రత్యక్షంగా చూసి వివిధ రకాల పంటలు పండించే వ్యవసాయ క్షేత్రాలను కలియ తిరుగుతూ... పొలం దున్నటం, వరి నాటు వేయడం, పంట పొలాలకు నీటిని అందించే విధానాలు అక్కడి రైతులను ఇంటర్వ్యూ విధానంలో అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో చిన్నారులు స్వయంగా వరి నాట్లు వేసి, పంట పొలాలకు నిరందించి రైతన్న పడే కష్ట సుఖాలను తెలుసుకున్నారు. ఈ క్షేత్ర పర్యటనను ఉద్దేశించి పారమిత పాఠశాలల ఛైర్మన్ డా.ఇనుగంటి ప్రసాదరావు మాట్లాడుతూ... అన్నం పరబ్రహ్మ స్వరూపం అలా మనందరికి అన్నం పెట్టె రైతు యొక్క కష్ట సుఖాలు చిన్నతనం నుండే తెలుసుకొని రైతు యొక్క గొప్పతనాన్ని తెలుసుకునేలా వివరించడం హర్షించదగిన శుభ పరిణామం అని విద్యార్థులను అభినందిస్తూ ఇలాంటి విజ్ఞాన విహారయాత్రలు విద్యార్థులకు మానసికోల్లాసానికి విషయ పరిజ్ఞానానికి ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ఈ క్షేత్ర పర్యటనకు సహకరించిన తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్స్ అనుకర్ రావు, వినోదరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, సమన్వయ కర్త శ్వేత, ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

# భూపాలపల్లికి కొత్త సొబగులు..

- నర్సింగ్ కళాశాల నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు..
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు..
- వర్చువల్ గా భవన నిర్మాణ పనులు ప్రారంభం..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లికి కొత్త సొబగులు సంతరించుకోనున్నాయని, నర్సింగ్ కళాశాల నిర్మాణానికి రూ. 26 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం వైద్య కళాశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి హైదరాబాద్ నుండి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 135 సర్వే నంబర్ లో 5 ఎకరాల సువిశాల స్థలంలో నర్సింగ్ కళాశాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంవత్సరకాలంలో పనులు పూర్తి చేసి భవనాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ బస్సు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైద్య కళాశాల భవన నిర్మాణానికి కాంట్రాక్టర్ కు రెండు కోట్లు ఇప్పించామని, మిగిలిన నిధులు త్వరలోనే మంజూరు చేయించి, పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన గదులు, గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. 150 కోట్లతో నిర్మాణం అవుతున్నటువంటి వైద్య కళాశాల భవనం పనులు వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు 18 నెలల్లో కళాశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలతో అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. భూపాలపల్లిలో మీకు ఎలాంటి లోపం లోటు లేకుండా సొంతింటి కంటే మిన్నగా సౌకర్యాలు కల్పిస్తామని ఎలాంటి ఇబ్బందులు రాకుండా బాగా చదువుకొని భవిష్యత్తులో మన జిల్లా, రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య శాఖలో ఖాళీలు భర్తీ చేసేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ నర్సింగ్ కళాశాలలో 45 మంది అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించినట్లు తెలిపారు. మొత్తం 60 సీట్లు కేటాయించగా 45 మంది విద్యార్థులు ఇప్పటికే జాయిన్ అయ్యారని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, నూతనంగా కోర్సులో చేరిన నర్సింగ్ విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా శిశు వయోవృద్దుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ క్లినిక్ ను శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారంభించారు. ప్రతి మంగళవారం థర్డ్ జెండర్స్ కు ఈ క్లినిక్ లో ప్రత్యేక వైద్య సేవలు అందించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సంక్షేమ అధికారి చిన్నయ్య, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ శాఖలో పూర్తిస్థాయిలో అధికారుల ప్రక్షాళన జరగాలి

- టైగర్ ట్రాకింగ్ వ్యవస్థపై అధికారులకు అవగాహన లేదు
- సమర్థులైన ఐఎఫ్ఎస్ అధికారులను నియమించాలి
- ప్రజల ప్రాణాలు కాపాడడంలో అధికారులు పూర్తిగా విఫలం
- అటవీ శాఖపై అసెంబ్లీ వాయిదా తీర్మానాల్లో ప్రస్తావిస్తా..!
- సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా డిసెంబర్ 2 ( జనం సాక్షి) :** సిర్పూర్ నియోజకవర్గంలో అసమర్థులైన అటవీ శాఖ అధికారుల వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయని , పులి దాడుల నుండి కాపాడంలో అధికారులకు కనీస అవగాహన కూడా లేదని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని తన నివాసంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడారు. టైగర్ ట్రాకింగ్ వ్యవస్థపై అటవీశాఖ అధికారులకు, సిబ్బందికి కనీస అవగాహన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పులి సిర్పూర్ టి మండలంలో తిరుగుతుంటే అధికారులు కాగజ్ నగర్ మండలంలో టైగర్ ట్రాకింగ్ పేరుతో ప్రజలను మభ్య పెడుతూ కాలక్షేపం చేస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు సిర్పూర్ నియోజకవర్గంలో పులి దాడిలో 3 గురు ప్రాణాలు కోల్పోయారని, అలాగే ఏనుగు దాడిలో ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనిమల్ ట్రాకింగ్ పై వీరికి కనీస అవగాహన లేదని అన్నారు. వీరికి ప్రజల నుండి మామూలు తీసుకోవడం ఆనవాయితీగా మారిందని అన్నారు. వన్య ప్రణాళిక పందులు, జింకలు చనిపోతే ప్రజలను వేధింపులకు గురి చేస్తూ లంచాలు తీసుకుంటూ, లంచాలు ఇవ్వకపోతే ఫర్ డిగ్రీ ప్రయోగించి, కేసులు నమోదు చేయడం ఇక్కడి అటవీశాఖ అధికారులకు షరా మామూలుగా మారిందని అన్నారు. పులులు సిర్పూర్ నియోజకవర్గంలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటే, కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మంచిరాల్ జిల్లాలో కవ్వాల్ అభయారణ్యం ఏర్పాటుచేసి అప్పటికి అక్కడ అసలు పులులే ఉండడం లేదని అన్నారు. మంచిర్యాల్ఆసిఫాబాద్ జిల్లాల మధ్య గోలేటి ప్రాంతంలో సింగరేణి ఓపెన్ కాస్టు ఉండడంవల్ల పులులు కవ్వాల్ అభయారణ్యం వైపు వెళ్లడం లేదని అన్నారు. ఇక్కడ ఫారెస్ట్ అధికారులకు మహారాష్ట్రలో టైగర్ ట్రాకింగ్ సిస్టంపై శిక్షణ కల్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో వందల సంఖ్యలో పులులు ఉన్నప్పటికీ అక్కడ మనుషులపై దాడులు జరగడం చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. గతంలో సిర్పూర్ నియోజకవర్గం లో కాగజ్ నగర్ సబ్ డివిజన్ అటల్ శాఖ ఉన్నప్పుడు ఐఎఫ్ఎస్ అధికారులు ఉండేవారని అన్నారు. కానీ ప్రస్తుతం జిల్లాలో కాగజ్ నగర్ ,ఆసిఫాబాద్ అటవీ శాఖ డివిజన్లో కనీసం ఒక్కరు కూడా ఐఎఫ్ఎస్ అధికారి లేరని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్, చుట్టుపక్క జిల్లాలో ఎంతోమంది ఐఎఫ్ఎస్ అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. సమర్థవంతులైన ఐఎఫ్ఎస్ అధికారులను జిల్లాలో నియమించి అటవీశాఖ పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. త్వరలో జరగబోయే శాసనసభ వాయిదా తీర్మానాల్లో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పులి దాడులు, ఇతర అంశాలపై ప్రస్తావిస్తున్నట్లు ఎమ్మెల్యే హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఉపాధ్యక్షులు ఈర్ల విశ్వేశ్వరరావు, దెబ్బటి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సింధం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బాల్క మోని తదితరులు పాల్గొన్నారు.

### పులి దాడి బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

గత నెల 29న పులి దాడిలో మృతి చెందిన కాగజ్ నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లే లక్ష్మి కుటుంబీకులను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అటవీ శాఖ నుంచి వచ్చిన రు.10 లక్షలకు అదనంగా మరో 10 లక్షలు ప్రభుత్వ నుంచి ఇప్పించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అలాగే అధికారులు ఇచ్చిన హామీ వరకు లక్ష్మి కుటుంబీకులకు 5 ఎకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీస్ యాక్ట్

- ఈనెల 30 వరకు అమలు
- జిల్లా ఎస్పీ డీ. జానకి వెల్లడి

**మహబూబ్‌నగర్, నవంబర్ 2 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసులు ఆంక్షలు విధించింది. శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. సోమవారం (డిసెంబర్ 2) నుంచి జనవరి 1 వరకు జిల్లా అంత ఆమలులో ఉండనున్నాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ డీ. జానకి వెల్లడించారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి బహిరంగ సమావేశాలు కానీ, ఊరేగింపులు, ధర్నాలు జరుపకూడదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పే ఎలాంటి ఆయుధాలను వాడకూడదని చెప్పారు. భారీగా జనసమూహాన్ని పోగుచేసే సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, డీజేలపై కూడా నిషేధం ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, ప్రజాపాలన అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు తెలంగాణను నిర్బంధంలోకి నెడుతున్నది. అధికారంలోకి రాగానే ప్రజాభవన్ వద్ద కంచెలు కూల్చి, ఇకపై ఆంక్షలు ఉండవంటూ హడావుడి చేసిన ప్రభుత్వం.. తాజాగా తన అసలు రంగును బయటపెట్టింది. తమ అసమర్థ పాలనను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పోలీసులను నమ్ముకుంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ యాక్ట్‌ను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నది. అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంతోషాలను మింగేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రశ్నించే హక్కును కాలరాసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలు చేయగా, జిల్లాల్లోనూ పోలీస్ యాక్ట్‌ను విధిస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో నవంబర్ మొత్తం పోలీస్ యాక్ట్ అమలు చేశారు. కామారెడ్డి జిల్లాలో గత నెల 7 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా 13 జిల్లాల్లో పోలీస్ యాక్ట్‌ను అమలు చేయగా, అనధికారికంగా 20కి పైగా జిల్లాల్లో పోలీస్ యాక్ట్ నిబంధనలను అమలు చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి.

# సోయా కొనుగోళ్లు బంద్

**బోథ్ డిసెంబర్ 02(జనంసాక్షి) :** ఈ నెల 5 వ నుండి బోథ్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్నటువంటి సోయా కొనుగోలు కేంద్రాలను మూసివేస్తున్నట్లు మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు..ఇట్టి విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 35 మంది దరఖాస్తులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులను కోరారు. ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వడానికి మూడు చక్రాల సైకిల్ పై వచ్చిన దివ్యాంగుడిని ఫించన్ వస్తుందా, ఎంత వస్తుందని ఆప్యాయంగా పలకరించారు. పింఛన్ వస్తుందని ఉపాధి కొరకు బిసి కార్పొరేషన్ ద్వారా రుణ సహాయం అందించాలని కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, బిసి సంక్షేమ అధికారిని ఆదేశించారు. ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారానికి అందచేసిన దరఖాస్తుదారునికి సమస్య పరిష్కార స్వభావంపై లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం చాలా ముఖ్యమైనదని దరఖాస్తులు పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ మంగిలాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు చిరుదివ్వెలు..?


నింగిలో మెరిసే...
ఆ "మబ్బు"...ఏమంటోంది...?
నేను పుట్టి
చినుకై చిటపటమని రాలేది
నేలపై ప్రవహించేదెందుకని...?
మీ పొలాల్లో
పచ్చని పంటలు పండించేందుకు...
ఆరని మీ ఆకలి మంటలు ఆర్పేందుకు...

చేతిలో కరిగే...
ఆ "సబ్బు".. ఏమంటోంది...?
మీ చేతిలో నేను కరిగి కరిగి
కనుమరుగయ్యేదెందుకు..?
మీ ఒంటిమీద
మురికిని తొలిగించేందుకు...
మీకు రోజంతా ఉల్లాసాన్ని
ఉత్సాహాన్ని కలిగించేందుకు...
మీకు సంపూర్ణ ఆరోగ్యాన్ని
ఆనందాన్ని అందించేందుకు...
మీరు ఆర్జించే
ఆ "డబ్బు"...ఏమంటోంది...?
నేడు మీ ఇంట
మీ పరుపుల క్రింద ఉన్న
నేను రేపు మీ వెంట రాలేనని...
మీ కంట కన్నీటిని తుడవలేనని...
నిరుపేదల పొట్టలు కొట్టి
ఆస్తులు అంతస్తులు ఆర్జించినా...
ఆకాశ హర్మ్యాలను నిర్మించినా...
నన్ను ఆ నిరుపేదలకు
నీడ నిచ్చే గూడుగా...
అనాధల ఆకలిని తీర్చే కూడుగా...
దాహం తీర్చే నీరుగా...
ఒంటిని కప్పే వస్త్రంగా...మార్చమని...
ప్రేమతో పదిమందికి నన్ను పంచమని...
అనుభవించమని ఆపై అస్తమించమని...
మిమ్మల్ని పీడించే
ఆ "జబ్బు"...ఏమంటోంది..?
మీరు ప్రతి నిత్యం
వ్యాయామం యోగ ధ్యానం చేస్తూ...
ఒత్తిడికి ఆందోళనకు దూరంగా...
భగవంతునిపై భక్తి భావనలతో...
ప్రతిరోజూ ప్రశాంతమైన చిత్తంతో
అసూయా ద్వేషాల కతీతంగా ఉంటే...
మీకు నేను అతిథిని కానని...
మీ చెంతకు రానని...మీకు...
వేల మైళ్ళ దూరంలో ఉంటానని....
ఈ నాలుగు శుభ సందేశాలు...సకల
మానవాళికి వెలుగునిచ్చే చిరుదివ్వెలు..

కవి రత్న.. "సహస్ర కవి భూషణ్"
పోలయ్య కూకట్లపల్లి అత్తాపూర్ హైదరాబాద్

# పాఠ్యపుస్తకాల్లో తప్పులుంటే..?

*విద్యలో పాఠ్యప్రణాళిక (సిలబస్)ది, పాఠ్యపుస్తకాలది, మూల్యాంకనంది ప్రధానపాత్రలు. ఇవే విద్యకు ఆయువుపట్టు. మొదటిది పాఠ్యప్రణాళిక. విజ్ఞానం అపారం. అనంతం. విద్యార్థి ఈ అనంత విజ్ఞానాన్ని ఒక్కసారే ఒక మాత్రని మింగినట్టు సముపార్జించుట అసాధ్యము. ఒకొక్క దశలో/తరగతిలో ఈ అనంత విజ్ఞానము ఒకొక్క భాగము నేర్చుకుని ముందుకు పోతాడు. తరువాతి తరగతిలో ఇంతకు ముందు నేర్చుకున్న విషయ పరిజ్ఞానం ఆధారంగా మరి కొంత భాగం నేర్చుకుని జ్ఞానసముపార్జనలో మరో ముందడుగు వేస్తాడు.*



పాఠ్యప్రణాళిక విద్యార్థి ఏ తరగతిలో ఏం నేర్చుకుంటాడు, ఎంత భాగం నేర్చుకుంటాడు అన్నది నిర్ణయిస్తుంది. వివిధ తరగతుల పాఠ్యప్రణాళికలు గొలుసుకట్టులా ఒకదానికొకటి అనుసంధానంగా ఉంటూ, విద్యార్థిని ఒక ప్రయోజకపౌరునిగా మానవజాతి ప్రస్థానంలో, ఒక ముఖ్య మైలురాయి స్థాపనలో, సాధనలో, అభివృద్ధి నిర్మాణంలో ఒక ముఖ్య పాత్రధారిగా తీర్చిదిద్దేటట్టు ఉండాలి. చాలా మంది జనులు మన పాఠ్యప్రణాళిక సమయం చెల్లిపోయినదిగా భావిస్తారు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా, పాఠ్యప్రణాళిక ఉండటంలేదని, దాని వలన మన విద్యార్థులు సరైన ఉద్యోగ అవకాశాలు అంది పుచ్చుకోలేక పోతున్నారని గొంతు కలుపుతారు. కానీ అసలు కారణాలు వేరు.

ప్రపంచంలో సాంకేతికత నిరంతరం పరివర్తనం చెందుతున్నది. సాఫ్ట్వేర్ మాత్రమే కాదు, హార్డ్వేర్ కూడా మార్పులు చెందుతున్నవి. కేవలం 2-3 దశాబ్దాల క్రితం వరకు బాగా ఉపయోగించబడిన ఫ్లాపీ డిస్క్ ఇప్పటి తరంలో చాలా మందికి తెలియదు. అంతగా నిరుపయోగం అయిపోయింది. వాటి స్థానాల్ని ఆక్రమించిన పెన్ డ్రైవులకు కూడా నూకలు చెల్లిపోతున్నాయి. క్రమంగా కనుమరుగవుతున్నాయి. పెన్ డ్రైవుల యు ఎస్ బీ పోర్టులు లేని లాప్టాప్లు సాధారణం అవుతున్నాయి. పరివర్తనం అన్నది ఒక్కటే నిరంతరం జరిగేది ఉండేది.

నేను 1985లో డీ.ఆర్.డీ.ఓలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నప్పుడు ఫోర్ట్రాన్ కంప్యూటర్ భాషను వాడాను. నేను, బి. ఇ, ఎం.ఇ. చేస్తున్నప్పుడు, చేసినప్పుడు నాకు కంప్యూటర్ ఎలా ఉంటుందో కూడా తెలియదు. పుస్తకాలలో చదవడం, బొమ్మలు చూడటం తప్ప. అయినా సరే, ఆ భాషలో చక్కగా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ చేయగలిగాను. తరువాత అనేక ఇతర భాషలు నేర్చుకుని నా కార్యక్రమాలను విజయవంతంగా చేయడంలో కృతకృత్యుడనయ్యాను. వేగంగా మారుతున్న ఉద్యోగ ఆవశ్యకతలను విద్య పూరించాలనుకోవడం సరి కాదు. పాఠ్యప్రణాళిక ఆవశ్యకతల అనుగుణంగా మారిపోవాలనుకోవడం సమంజసం కాదు కూడా. అది అసాధ్యం.

విద్య ముఖ్య లక్ష్యం ఈ పరిస్థితిలో- వంట వస్తువులు తెచ్చి, వంట వార్చి, పళ్ళెంలో పెట్టి నోటికి అందివ్వడం కాదు. ఎలా ఆలోచించాలో, ఎలా పని చేయాలో, ఎలా తమ కాళ్లపై నిలబడి స్వశక్తితో బతకాలో నేర్పాలి. కొంత మంది మిడిమిడి జ్ఞానంతో ఎక్కాల పట్టిక గుర్తు పెట్టుకోవడం అవసరమా, పైథాగరస్ సిద్ధాంతం అవసరం ఏమిటి అని వాదిస్తుంటారు. వాస్తవానికి, వారి బలహీనతలను అది కప్పిపుచ్చుకునే ప్రయత్నమే. ఇక రెండవది పాఠ్యపుస్తకం. చాలా ముఖ్య పాత్ర వహిస్తుంది. దాని ఉపయోగం అతి చేసి చెప్పడం అసాధ్యం. ప్రతి శిశువుకు పుట్టుకతో జిజ్ఞాస ఉంటుంది. జిజ్ఞాస అంటే కొత్త విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం, కోరిక. ఆ జిజ్ఞాస ఉన్నంత వరకు చదువు ఇష్టంగా ఉంటుంది ఎందుకంటే చదువు బాహ్య ప్రపంచానికి గవాక్షం. ఆ గవాక్షం లోనుంచి తొంగి చూడాలని ఎవరికి కోరిక ఉండదు? విద్య చేయాల్సిన ఏకైక పని ఆ జిజ్ఞాసను సంరక్షించడం మరియు ఎగదొయ్యడం. పోటీ ప్రపంచంలో విజయకాంక్షను పెంచడం. ఇది నా స్వీయ అనుభవం. నా తల్లి పెద్దగా చదువుకోలేదు, కానీ తెలుగు చదవగలిగే పరిజ్ఞానం ఉండేది. తెలుగు అక్షరాలు గుణింతాలు నేర్పి విజయకాంక్షను రగులజేసి వదిలేసారు. అక్కడ నుంచి నేర్చుకోవడం అంతా కేవలం నా స్వయంకృషి మాత్రమే. ఉపాధ్యాయుల మీద కూడా నేను ఆధారపడలేదు. పుస్తకాల నుంచి నా అంతట నేను నేర్చుకున్నాను. పాఠశాల అధ్యాపకుల అవసరమే లేని నాకు ఇంకా ట్యూషన్లు, కోచింగ్లు ఎందుకు? నేను 1978లో పదవ తరగతిలో రాష్ట్ర స్థాయి స్థానం సంపాదించుకుని జాతీయ ప్రతిభా ఉపకారవేతనం అందుకున్నాను.

విద్యారంగంలో కూడా చీడ చేరుకుంది. పుస్తకాలలో తప్పులు ఉంటున్నాయి. సవరణ అవకాశం ఉన్నా, వేలెత్తి చూపి సరిదిద్దుకోమని సలహా ఇచ్చినా ఆ దిశలో ముందడుగు పడటం లేదు. కొన్ని పాఠ్య పుస్తకాలలో అయితే నిండా తప్పులే. తప్పులు దొర్లుతుంటాయి పూర్తిగా నివారించడం కష్టం. అయితే ప్రచురణకు ముందు దీక్షగా కేవలం తప్పులు వెదికి పట్టుకోవడానికి నిపుణులతో ఒక బృందం ఏర్పరచి తప్పులు తగ్గిస్తారు. దీనినే ప్రూఫ్ రీడింగ్ అంటారు. ఈ ప్రక్రియ నుంచి తప్పులు తప్పించుకుని ముద్రించిన పుస్తకాలలో చొరబడితే,వాటిని తెలియజేయమని విద్యార్థులను , ఉపాధ్యాయులను, పాఠకులను పుస్తక ముందు మాట ద్వారా వినమ్రంగా కోరుతారు. ఇప్పుడు ప్రచురణ కర్తలు, రచయితలు సవరణ జోలికి పోవటం లేదు. పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంతర్జాలంలో లభించే వీడియోలలో తప్పులు ఉంటున్నాయి సంవత్సరాల తరబడి. పరీక్షాపత్రాలలో (పాఠశాల నుంచి ప్రవేశ మరియు ఉద్యోగ పోటీ పరీక్షలు వరకు) తప్పులు ఉంటున్నాయి. ఉపాధ్యాయులలో అసమర్థతలు ఉంటున్నాయి. బాలల్లో సరైన విషయ అవగాహనకు మూలాధారమైన ప్రశ్నించే గుణం, నిరుత్సాహపరచబడి అణచివేతకు గురి అవుతున్నది. పర్యవసానంగా వారిలో ఉండే సహజసిద్ధమైన కొత్త విషయాలు తెలుసుకుందాం, నేర్చుకుందాం అన్న ఆసక్తి, శ్రద్ధ లోపిస్తున్నాయి.

ఈ మధ్య ఒక పదవ తరగతి విద్యార్థిని ఒక గణిత సమస్య నా వద్దకు తెచ్చింది. అది ఆమె పాఠ్యపుస్తకంలోనిది. ప్రశ్న అసంపూర్ణ, ఆ విధముగా లోపముతో నున్నది. తప్పు ప్రశ్న. ఆ పుస్తకం ప్రచురించిన వారికి దాని గురించి చెప్పి తదుపరి ప్రచురణలో ఆ తప్పుని సరిదిద్దుదామని వాళ్ళని సంప్రదిద్దామని చాలా ప్రయత్నాలు చేసాను. ఆ పుస్తకం వ్రాయడంలో/(వ్రాయించడంలో) పాలు పంచుకున్న పెద్దల పేర్లు, వారు పని చేసే సంస్థల వివరాలు ఇచ్చారు పుస్తకం ముందు భాగంలో. కానీ వారిని సంప్రదించగలిగే వివరాలు అంటే దూరవాణి సంఖ్యలు, లేదా చిరునామాలు, ఈమెయిలు వివరాలు ఇవ్వలేదు. కొన్ని ప్రయత్నాల తరువాత ఒకరి సంస్థను దూరవాణి ద్వారా చేరుకున్నాను. ఆయన మాట్లాడే పరిస్థితి లేదని సమాధానం. సరే మిగతా వారి వివరాలు, అందుకు సంబంధించిన వారి వివరాలు అడిగాను. అవి తమకు తెలియదని సమాధానం. ఆ పుస్తకం ఎన్నో ప్రచురణలు నోచుకున్నది. అలా తప్పుతోనే కొనసాగుతున్న ట్టున్నది.



సీతా రామరాజు సనపల
7259520872

# ఉద్యోగ నియామక పత్రాల జాతర



ప్రజా పాలన విజయోత్సవాల్లో ఈ నెల 4న ఉద్యోగ నియామక పత్రాలను సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగం సాధించిన యువతి, యువకులకు అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా పాలన-ప్రజా విజయోత్స వాలను సింగరేణిలో ఘనంగా నిర్వహించాలని, దీనికోసం అన్ని ఏరియాలలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సింగరేణి ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. దీనితో ఏర్పాట్లు పూర్తి చేసా ప్రజా విజయోత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని, సీఎండీ బలరాం నిర్వహించారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిర్వహించే యువశక్తి సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి 9000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తున్నారు. వీటిలో సింగరేణి సంస్థలో ఇటీవల కొత్తగా ఉద్యోగాలు పొందిన 593 మందికి కూడా ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నారని సీఎండీ తెలిపారు. దీనికోసం తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి సంస్థ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అనేక కొత్త పథకాలను, కార్యక్రమాలను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు సీఎండీ.

**ఏడాదిలో 2,165 ఉద్యోగాల కల్పన**

సింగరేణిలో ఏడాది కాలంలో 2,165 కొత్త ఉద్యోగాలను కల్పించడం జరిగిందని, చరిత్రలో అత్యధికంగా 33% లాభాల వాటా బోనస్ను కార్మికులకు పంపిణీ చేయడం జరిగిందని, ఒక్కొక్కరికి రూ.1,90,000 వరకు లాభాల వాటా అందిందని సీఎండీ బలరాం పేర్కొన్నారు . అలాగే తొలిసారిగా కాంట్రాక్టు కార్మికులకు కూడా 5వేల రూపాయల లాభాల వాటా పంపిణీ చేయడం జరిగిందన్నారు. గత ఏడాది పాలనలో సింగరేణి సంస్థలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. అలాగే దీపావళి బోనస్ (పి.ఎల్.ఆర్.ఎస్) ఒక్కొక్కరికి రూ.93,750 చెల్లించడం జరిగిందని, ఇది అంతకుముందు ఏడాది కన్నా 50 కోట్లు అధికమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త గనులను పొందడం కోసం ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు బ్లాక్ కోసం స్వయంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆ రాష్ట్రానికి వెళ్లి



సంబధిత అనుమతులు సాధించడం జరిగిందన్నారు.

**బొగ్గు బ్లాకుల కోసం చొరవ**

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థ మాత్రమే చేపట్టే విధంగా ప్రత్యేక చొరవ చూపించడం జరుగుతోందన్నారు. సింగరేణివ్యాప్తంగా ఇంకా మరెన్నో కొత్త కార్యక్రమాలను కూడా త్వరలో చేపట్టనున్నామని వివరించారు. ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, శాఖల్లో కూడా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. సీఎండీ బలరాం



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

ఏడాది కాలంలోనే సింగరేణి రూపు రేఖలను మార్చేశారు. సంస్థలో, కార్మికులు, అధికారులు అనే తేడా లేకుండా, సంస్థలో అందరూ సమానమే నని, అందరూ కలిసి, మెలిసి పని చేసిన ఫలితం ను సీఎండీ అందరి ముందు ఉంచారు.

**బలరాం సేవలు అనివార్యం**

సీఎండీ బలరాం లాంటి అధికారుల బలం సంస్థకు ఒక భరోసాను కల్పించింది, అంటే అతిషయోక్తి కాదు. కనీసం మరో రెండు ఏండ్లు అయినా సంస్థలో నుంచి ఆయనను కదుపకుండా ఉంచాలి. ఆయన సేవలు సంస్థకు, కార్మికులకు, రాష్ట్ర ప్రభుత్వంకు ప్రస్తుత తరుణంలో చాలా అవసరం. నిజాయితి, పట్టుదల, క్రమశిక్షణను పుణికి పుచ్చుకున్న అత్యంత లో ప్రొఫైల్ అధికారిగా, మంచి అడ్మినిస్ట్రేటర్ గా సీఎండీ బలరాంకు పేరు ఉన్నది. వ్యక్తగతంగా నేను అయితే ఆయనను పని రాక్షసుడు అంటాను. సంస్థ సీఎండీగా భాద్యతలు తీసుకున్న క్షణం నుంచి ఈ ఐఆర్ఎస్ అధికారి ఎన్. బలరాం క్షణం తీరిక లేకుండా పని చేస్తున్నారు. రోజు కనీసం 16 నుంచి 18 గంటలు పని చేస్తున్నారు. బలరాం మరిన్ని రోజులు సంస్థ కోసం, మన తెలంగాణ కోసం కావాలి. ఆయనతోపాటు డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్, పర్సనల్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ ఎస్ డిఎం సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవి ప్రసాద్,ఆయా ఏరియాల జిఎంల టీమ్ వర్క్ మరింత బలోపేతం కావాలి, అంటే బలరాం లాంటి అధికారి సేవలు అవసరం.. అనివార్యం.

# దివ్యాంగుల చట్టం.. చైతన్యం ముఖ్యం

నేడే అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రకారం జాతి, మత కుల లింగ ప్రాంతా వివక్షలను నిషేధించినప్పటికీ వ్యక్తుల శారీరక వైకల్యం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేరు. అంగ వైకల్య అంశాలను హక్కుల కోణంలో కాకుండా సంక్షేమం సహాయం అందించే కోణంలో పరిశీలిస్తున్నారు. విద్య, ఉద్యోగాలు, సామాజిక రాజకీయ రంగాల్లో వికలాంగులకు ఎదురవుతున్న వివక్షతను నివారించే లక్ష్యంతో 1992 సంవత్సరం నుండి డిసెంబర్ 3 నేడు అంతర్జాతీయ వికలాంగుల సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ఏటా డిసెంబర్ 3ను అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది. 1992లో మొదలైన ఈ కార్యక్రమాన్ని 1998 నుంచి అన్ని దేశాలు అమలు చేస్తున్నాయి. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించి సమాజాభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో ఐరాస 1981 ఏడాదిని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది. అలాగే 1983 నుంచి 1992 వరకు వికలాంగుల దశాబ్దంగా నిర్ణయించింది. ప్రపంచ జనాభాలో 100 కోట్లకు పైన వికలాంగులు ఉంటారని ఐరాస అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో సుమారు 2.68 కోట్ల మంది ఏదో ఒక వైకల్యంతో బాధపడుతున్నారు. వీరిలో 1.5 కోట్ల మంది పురుషులు 1.18 కోట్ల మంది మహిళలు. తెలంగాణలో 10,46,822 మంది వికలాంగులు ఉన్నారు.

1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ దివ్యాంగుల సంవత్సరంగా 1976 సంవత్సరం ఐక్యరాజా సమితి యుఎన్ఓ సర్వసభ్య సమావేశమై 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ దివ్యాంగుల సంవత్సరంగా ప్రకటించింది. అప్పటి నుంచి మార్చి నెల మూడవ ఆదివారం దివ్యాంగుల దినోత్సవం చేసుకునేవారు. అయితే 1992 లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ మూడో తేదీని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంగా ప్రకటించింది.. ప్రతి ఏడాది ఐక్యరాజ్యసమితి ఒక నినాదాన్ని అందిస్తుంది. ఈ నినాదాన్ని అన్ని దేశాల ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సభ్య సమాజం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాలతో పాటు దివ్యాంగుల హక్కులు అవసరాలు అభివృద్ధికి సంబంధించి విస్తృత ప్రచారానికై కృషి చేస్తున్నాయి. ఐక్య రాజ్య సమితి దివ్యాంగుల హక్కుల ఒప్పంద తేదీ 2008 మే 3 నుంచి ప్రపంచవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందంపై అభివృద్ధి చెందిన దేశాల కంటే చాలా ముందుగా మన ప్రభుత్వం ఆమోదించి రాష్ట్రపతి ద్వారా ప్రకటన చేసింది. ఇప్పటి వరకు మొత్తం 175 దేశాలు ఈ ఒప్పందాన్ని అమలుకు అంగీకరించాయి.

**మన దేశంలోని దివ్యాంగుల చట్టం.. :** దివ్యాంగుల చట్టం 1995 ప్రకారం ఏడు రకాల వైకల్యాలు ఉండేవి. ఈ చట్టంలో మార్పులు చేర్పులు చేసిన కేంద్ర ప్రభుత్వం 2016 లో నూతన దివ్యాంగుల చట్టానికి ఆమోదం తెలిపింది. ఈ నూతన చట్టంలో అదనంగా 14 రకాల వైకల్యాలను చేర్చింది. అయితే ఈ చట్టం అమలుకు సెక్షన్100 ప్రకారం కేంద్రానికి సెక్షన్ 101 ప్రకారం రాష్ట్రానికి సంబంధిత అంశాల్లో తగిన ఆధారాలు కల్పించింది. చట్టంలో మొత్తం 17 అధ్యాయాలు, 102 విభాగాలు ఒక అనుబంధ ప్రణాళిక ఉన్నాయి. దివ్యాంగుల సాధికరిత, ఆత్మగౌరవం, సొంత నిర్ణయం, స్వేచ్ఛ, వ్యక్తిగత, స్వతంత్రత, వివక్ష లేకుండా సమాజంలో పరిపూర్ణంగా పాల్గొనే అవకాశాలు అడ్డంకులు లేని అనుకూలత వాతావరణం మొదలైనవి కల్పించింది. చట్టం ప్రకారం దివ్యాంగుల హక్కుల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుబంధ శాఖలు సంస్థలు, ప్రభుత్వ సహాయం పొందుతున్న సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కంపెనీ తదితర విభాగాలు బాధ్యులుగా తగిన చర్యలు చేపట్టాలి. చట్టంలోని 2016 సెక్షన్ 37 ఏ, బి, సి ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని మంత్రిత్వ శాఖల నుంచి పేదరిక నిర్మూలన, అభివృద్ధి పథకాల్లో, వ్యవసాయ భూమి, ఇల్లు కేటాయింపుల్లో ఐదు శాతం రిజర్వేషన్, మహిళా





దివ్యాంగులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ తగిన బడ్జెట్ కేటాయించాలని చట్టం చెప్తుంది. అధ్యాయనం రెండు సెక్షన్ 67 ప్రకారం ఎటువంటి వేధింపులు, హింస, కించపరచడం, దోపిడీ వంటి అమానుష క్రియలకు పాల్పడకుండా ప్రభుత్వాలు తగిన చర్యలు, పథకాలు, అవగాహన కార్యక్రమాలు ఆదేశాలు చేపట్టి దివ్యాంగులను రక్షించి ఉచిత న్యాయ సహాయం అందించాలని చట్టం పేర్కొంటుంది.

**అందని ద్రాక్షగానే..**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 74 ఏళ్లు పూర్తయ్యాయి. రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం వంటివి వికలాంగులకు నేటికీ అందని ద్రాక్షగానే మిగిలాయి. ఆర్టికల్ 14 నుండి 19 వరకు సమాజంలో పౌరులందరూ సమానమేనని, ఎలాంటి వివక్షా ఉండరాదని పేర్కొన్నారు. అవి మాటలకే పరిమితమ య్యాయి. సమాజంలో నేటికీ వికలాంగులు ద్వితీయశ్రేణి పౌరులుగానే బతకాల్సి వస్తోంది. వికలాంగులు అంటేనే చిన్నచూపు చూస్తున్నారు. విద్యా, ఉద్యోగాల్లో సైతం వివక్ష కొనసాగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.

నూతన దివ్యాంగుల చట్టం మీద చాలామంది దివ్యాంగులకు అవగాహన లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు రిజర్వేషన్లు ఇతర విషయాలు తెలియడం లేదు. ప్రభుత్వ పరంగా అవగాహన కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది.



కుడుతాడి బాపురావు
జర్నలిస్ట్, 9553307006

# దేశ పరిస్థితిపై ఆ లాయర్ ఏడ్చేసాడు

దేశంలోని ఒక ప్రముఖ న్యాయవాది మనోభావం దెబ్బ తిన్నది. అలా ఎందుకు? అదేమిటో తెలుసు కోవాలి!మనిషికి బతకడానికి ఏం కావాలి? ఉద్యోగం,ఒక ఇల్లు, ఇలా ఒకదాని, వెనక ఒకటి ప్రయోరిటీలు ఉంటాయి. కనీసం ఉద్యోగం,అధిక ధరలు తగ్గింపు, చదువు, వైద్యం లాంటి విషయాలలో శ్రద్ధ చూపని ప్రభుత్వం, ఆ అసలు విషయాలు అడగకుండా ఉండడానికి, మందిర్, మస్జిద్, హిందూ, ముస్లిం రాజకీయాలను పదే, పదే తెర మీదికి తెస్తున్నారు.

**అధికారం కోసం మోసం**

జనాన్ని అధికారం కోసం మోసం చేస్తున్నారు. పరస్పరం విషం ను జనాల మెదళ్ళలో నింపేస్తున్నారు. ఆగం చేస్తున్నారు. అసలు విషయాలను ప్రశ్నించకుండా, పలు అవసరమే లేని, మనుషులను విభజించే విషయాలను తెరమీదికి తెస్తున్నారు. దేశంలో ఘర్షణ లకు కారణం అవుతున్నారు. బుద్ధి జీవులు ఇదంతా చోద్యం చూసే పరిస్థితి, అధికార యంత్రాంగం కు భయపడే పరిస్థితి వచ్చేసింది. ఈ నేపథ్యంలో ఒక సీనియర్ న్యాయవాది, దాదాపు అన్ని రాజకీయ పక్షాలు గౌరవించే ఒక లాయర్ దేశ పరిస్థితి మీద కంట తడి పెట్టేసాడు! చాలా ఓపెన్ గా మన మాజీ సుప్రీం



కోర్ట్ చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ పై ధ్వజమెత్తాడు. దేశంలో ప్రస్తుతం మస్జిద్, దర్గా ల కింద మందిర్ల కోసం తవ్వకాల, సర్వే లకు సంబంధించి వస్తున్న కోర్ట్ ల, ఆదేశాలు, పలువురికి పిటిషన్ లు, సంభల్ లో కాల్పుల సంఘటన, నలుగురి మృతి, పలువురికి గాయాలు లాంటి సంఘటనల మీద ప్రముఖ న్యాయవాది దుష్యంత్ దవే, కంట తడిపెట్టాడు, ఏడ్చేసాడు! దేశంలోని సుప్రీం కోర్ట్ లాయర్లలో ఆయన ప్రముఖుడు! ది వైర్ ఛానల్ కోసం సీనియర్ జర్నలిస్ట్ కరణ్ థాపర్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ లో ప్రస్తుతం దేశ పరిస్థితి మీద దుష్యంత్ దవే కంట తడి పెట్టడం సంచలనం అయ్యింది. దేశంలో చర్చ అయ్యింది. దీనికంతటికి మాజీ సిజెఐ జస్టిస్ చంద్ర చూడ్ కారణం అంటూ దావే పేర్కొన్నారు. 1991ప్రార్థనా స్థలాల యాక్ట్ కు విరుద్ధంగా జ్ఞానవాపి మస్జిద్ విషయం లో చంద్ర చూడ్ తీర్పు చెప్పి, చిచ్చు పెట్టారని, అన్నారు. సుప్రీం కోర్ట్ కు ఆ పిటిషన్ వచ్చినప్పుడు, 1991 యాక్ట్ ప్రకారం పిటిషన్ ను కొట్టేసి ఉంటే ఇన్ని గొడవలు జరిగేవి కాదని తన ఇంటర్వ్యూ లో దవే అన్నారు. 1947 ఆగస్టు 15 కు ముందు ఉన్న ప్రార్థన స్థలాలను అసలు డిస్టర్బ్ చేయడానికి వీలు లేదు. పిటిషన్స్ కూడ స్వీకరించడానికి వీలు లేదు! కాని సర్వే కు అనుమతులు ఇచ్చారని దవే ఆవేదన వ్యక్తం చేసారు.మస్జిద్ కింద మందిర్ ను తవ్వకం ద్వారా అన్వేషించే పనికి పూనుకోవడం,దానికి కోర్ట్ లు అనుమతులు ఇవ్వడం ఎక్కడి దాకా వెళ్లిందంటే, 800 ఏండ్ల కిందటి, ప్రధాని నరేంద్ర మోడీ సహా, ఎందరో మన దేశ మాజీ ప్రధానులు అజ్మీర్ దర్గా కింద మందిర్ ఉందని కోర్ట్ లో పిటిషన్ వేయడం దానిని కోర్ట్ విచారణకు స్వీకరించడం వరకు వెళ్ళింది. ఇలాంటి పరిస్థితి కి జస్టిస్ చంద్రచూడే కారణం అంటారు దుష్యంత్ దవే.



ఎండి. మునీర్
సీనియర్ జర్నలిస్ట్, 9951865223

# పరిమళించిన మానవత్వం

## షాద్ నగర్ ప్రజల గుండెను కదిలించిన జనంసాక్షి కథనం



- మానవత్వం వైపు జనంసాక్షి కథనాలు అంటూ చర్చించుకున్న ప్రజలు
- ఆస్తులు ఉన్న కుటుంబాలు కూడా తల్లితండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్న నేటి తరుణంలో
- పేదరికం మాత్రం కన్నతల్లిని కంటికి రెప్పలా కాపాడుకుంటుంది



బతుకు చక్రాల బండి.. అమ్మ వైద్యం కోసం.. అయ్యో ఎంత కష్టం

ఇంట్లో ఉన్న బియ్యాన్ని అమ్ముకొని చికిత్స

ఇది ఓ ఫరూక్‌నగర్ పేదింటి కథ

**షాద్ నగర్ డిసెంబర్ 02 (జనంసాక్షి)**

బతుకు చక్రాల బండి అమ్మ వైద్యం కోసం అయ్యో ఎంత కష్టం.. ఇంట్లో ఉన్న బియ్యాన్ని అమ్ముకొని తల్లికి వైద్య చికిత్స.. ఇది ఓ పేదింటి కథ.. అంటూ జనంసాక్షి పత్రిక ప్రచురించిన కథనాలు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ ప్రజల గుండెలను కదిలించాయి. ఉదయం నుండి మానవత్వం వైపు పరిమళించిన జనంసాక్షి కథనం అంటూ చర్చించుకున్నారు ప్రజలు వందల కోట్ల ఆస్తులు ఉన్న కుటుంబలలో కొంతమంది తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో వారి బాగోగులు చూసుకోకుండా వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్న నేటి సమాజంలో కటిక నిరుపేద కుటుంబంలో ఉన్న ఆ కన్న తల్లి కుమారులు మాత్రం ఆమెని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. షాద్ నగర్ పట్టణంలోని ఫరూఖ్ నగర్ ప్రాంతంలో ఇది ఓ పేదింటి కథ... పట్టణంలోని ఫరూక్ నగర్ లో నివాసం ఉండే జాన్నెబి బేగం కుటుంబం కిరాయి ఇంట్లో ఉంటూ జీవనంసాగిస్తుంది 75 ఏళ్ల వృద్ధాప్య వయసులో ఉన్న ఆమె ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉండగా ఆమె ఉండే కాలానికి వాహనాలు ఏవి కూడా వెళ్లే దారి లేకపోవడంతో 200 రూపాయలకు చక్రాల బండిని అద్దెకు తీసుకొని ఆసుపత్రికి ప్రయాణమయారు. కుటుంబ సభ్యులు చక్రాల బండిపై కన్నతల్లిని తీసుకొని అదే చక్రాల బండి పై ఇంట్లో తినడానికి ఉన్న బియ్యాన్ని అమ్మి ఆ చక్రాల బండి కిరాయి చెల్లించాలని ఆ కన్నతల్లికి ఆసుపత్రికి చూపించాలని ఆమెతోపాటు ఆ బియ్యాన్ని చక్రాల బండి పై పెట్టుకొని తోసుకుంటూ బయలుదేరారు కుటుంబ సభ్యులు. ఒకవైపు ఈ దేశంలో పేదరికం అనేది లేదు అంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు 75 ఏళ్ల స్వతంత్ర వారోత్సవాల్లో భాగంగా గొప్పలు చెప్పుకుంటుంటే పేదరికం అనేది ఎలా ఉందో ఈ కథనాలు మనకు సాక్ష్యలుగా కనిపిస్తాయి. ఈ కుటుంబాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నా లక్ష్యం



### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

**బాలనగర్ డిసెంబర్ 2 (జనం సాక్షి)**

జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నా లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. బాలానగర్‌లో ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలలోనీ విద్యార్థులకు ఎమ్మెల్యే షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాభ్యాసం కొనసాగించాలననే సంకల్పంతో నా సొంత నిధులతో వారికి ప్రోత్సాహంగా షూ ను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాభ్యాసం లభిస్తుందని అన్నారు. బాలానగర్, మిడ్జిల్ మండలాలకు డిగ్రీ కళాశాలలు, రాజాపూర్ మండలానికి ఇంటర్మీడియట్ కళాశాలని మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరడం జరిగిందని, వెంటనే ముఖ్యమంత్రి రాజాపూర్ మండలానికి ఇంటర్మీడియట్ కళాశాలను మంజూరు చేశారని ఆయన తెలిపారు. సి ఎస్ ఆర్ ద్వారా జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం జరిగే పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి 100% ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే కోరారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు షూ తో పాటు స్కూల్ బ్యాగు, వాటర్ బాటిల్ ను కూడా అందజేస్తానని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలిపారు.

## సొసైటీ రూల్స్‌కు విరుద్ధంగా 'నో' ఎంట్రీ



- ఈనెల 7 నుంచి 21 వరకు సీఎం కప్ ఆటల పోటీలు
- మధ్యాహ్న భోజనంలో లోపం ఉన్న కఠిన చర్యలు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 2 (జనంసాక్షి) :**

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, ప్రజా వాణి పిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఆసరా పెన్షన్, భూ సమస్యలపై (128 )ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్య పథకాలకు జిల్లా అధికారులు ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు లక్ష్యాలను పూర్తిచేసేందుకు కృషి చేయాలని అన్నారు.ముందుగా పర్మిషన్ తీసుకోకుండా గురు కుల స్కూల్స్, కాలేజీలలో ,పాటశాల లో ఎవ్వరిని కూడా అనుమతించరాదని, అనుమతి లేకుండా ఎవరైనా గురుకుల స్కూల్స్, కాలేజి లలో ప్రవేశించడం జరిగితే సొసైటి రూల్స్‌కు విరుద్ధమని ,కాబట్టి ఎవ్వరిని కూడా అనుమతించరాదని హెచ్చరించారు. సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రిని వేగవంతం చేయాలనీ అధికారులకు ఆదేశించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి అంగన్వాడీలు, పాఠశాలలు, రెసిడెన్సి పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో ఎలాంటి చిన్న లోపం లేకుండా చూసుకోవాలని అన్నారు. అన్ని పాఠశాలలో సంక్షేమ వసతి గృహాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సజావుగా అమలు చేయాలనీ అధికారులకు ఆదేశించారు. సిఎంకప్ క్రీడలను డిసెంబర్ 7వ తేదీ నుండి 21వ తేదీ వరకు చేపడుతున్నందున ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు.డిసెంబర్, 7వ తేదీ నుండి 8వ తేదీ వరకు గ్రామపంచాయతీ స్థాయిలో క్రీడలు నిర్వహించాలని, అదే నెలలో 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు మండల స్థాయిలోను, 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో జరిగే అన్ని అంశాలపై దృష్టి సారించి ప్రత్యేక చొరవ చూపించాలని అన్నారు. ముఖ్యంగా సంబంధిత శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎక్కడ సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుదీర్, ట్రైని కలెక్టర్ ఉమా హారతి, ఆర్‌డిఓ వాసు చంద్ర, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమిటో..?

- వినతి పత్రాలకే పరిమితం
- సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

**మల్కాజిగిరి,డిసెంబర్2(జనంసాక్షి)**



గెలిచిన సంవత్సరంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులు, తీసుకువచ్చిన నిధులు ఏమిటో శ్వేత పత్రం విడుదల చేయాలని మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఆనంద్ బాగ్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలపై వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు సీనియర్ నాయకులు మాట్లాడుతూ..ఎమ్మెల్యేగా గెలుపొంది సంవత్సర కాలమైన మర్రి రాజశేఖర్ రెడ్డి ఒక నయాపై అభివృద్ధి చేయలేదని కేవలం వినతి పత్రాలకే పరిమితమయ్యారని ఆరోపించారు, తను చేసిన పని, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటో శ్వేత పత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేయడం జరిగింది.మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెచ్చిన నిధులతోనే ఇప్పుడు కొబ్బరికాయలు కొడుతూ తానే చేస్తున్నానని చెప్పుకుంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని మండిపడ్డారు. మైనంపల్లి హనుమంతరావు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మౌలాలి కమాన్, ఆనంద్ భాగ్ అండర్ రైల్వే బ్రిడ్జి, కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశారని తెలిపారు.తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తెచ్చిన నిధుల తోటే కాకుండా ఇప్పుడు సంవత్సరంలో సుమారు 21 కోట్లు అభివృద్ధి పనులకు తాను వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారని వివరించారు. ప్రస్తుత ఎమ్మెల్యే ప్రతి కార్యాలయానికి వెళ్లి వినతి పత్రాలు ఇవ్వడం కాదు మల్కాజిగిరి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు, తీసుకువచ్చిన నిధులు ఏమిటో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్రనాథ్, సీనియర్ నాయకులు బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జీఎన్ వి సతీష్ కుమార్, బీకే శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, ఎస్ ఆర్ ప్రసాద్, బాబు, సత్యనారాయణ, రాందాస్ సంతోష్ ముదిరాజ్, నరేందర్ గౌడ్, సయ్యద్ మబ్బు, ఫరీద్, అధ్యక్షులు సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, ఇందిరా ప్రియదర్శిని, ఆశ, చెన్నారెడ్డి, చంద్రకాంత్, ఇస్తారి, కన్న, సిరిగిరి రాజు, బాలరాజు యాదవ్, ఆగమయ్య, వెంకటేశ్వరరావు, ఫారుక్, మంద భాస్కర్, చందు, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు

### ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ అజయ్ యాదవ్

**బోడుప్పల్ డిసెంబర్ 02 (జనంసాక్షి)**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రజాపాలన ఏడాది అయితున్న సందర్భంగా ప్రభుత్వం 1-9 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం కార్పొరేషన్ పరిదిలోని ఉత్సవాలు నిర్వహిస్తూ మూడవ డివిజన్‌లో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. అదేవిదంగా మొదటి డివిజన్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అదికారం చేపట్టి ప్రజల వద్దకే ఒఅలన అనేవిదంగా ప్రజాపాలన చేపట్టి ప్రజల సమస్యలను తీరుస్తుందని ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనకు నిదర్శనమని అన్నారు. గతంలో ఏద్దైన సమస్య ఉంటె ఎవరికి చెప్పాలో అర్థం అయ్యేది కాదని నేడు నేరుగా సంబంధిత అదికారులకు తమ గోడు వినిపించుకునే మేలు కుదిరిందని కొనియాడారు. కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక నిధుఉ తేవడం జరిగిందని మరింత అభివృద్ధి పరిచి బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజల కష్టాలు తీర్చడానికి పాలక వర్గం అహర్నిశలు కృషిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ రామలింగం, కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, కొత్త చందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రదాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌ల అమలుకు బీసీ డెడికేషన్ కమిటీ




### బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర రావు

**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 2 (జనంసాక్షి)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు అమలు కోసం బీసీ డెడికేటెడ్ కమిషన్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని బిసి డేడికేటెడ్ కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వర రావు అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మెదక్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి బీసీ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఇతర కుల సంఘాల నాయకుల ఫిర్యాదులను వినతులను బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ కు స్వాగతం పలికారు. జిల్లాలో బీసీల స్థితిగతులను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వివిధ కుల సంఘాల నుండి విజ్ఞప్తులు, వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వివిధ కుల సంఘాల నాయకులు 24 వినతులను అందజేశారు. జనాభా ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం జరిపించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా పూర్తిస్థాయిలో జనాభా వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించ నున్నట్లు కమిషన్ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెంబర్ సెక్రెటరీ బి సైదులు ఐఎఫ్ఎస్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, బీసీ సంక్షేమ శాఖ డిడి, ఆర్ రమేష్ ,జిల్లా బి సి సంక్షేమ అధికారి/ మెదక్ జిల్లా ఇంచార్జి బిసి సంక్షేమ అధికారి జగదీష్, సిద్దిపేట జిల్లా బిసి సంక్షేమ అధికారి షేక్ అహ్మద్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, డీఎస్పీ సత్తియ్యా గౌడ్, వివిధ కుల సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కబ్జాకు గురైన పార్కు స్థలాలను కాపాడాలి

### అడిషనల్ కలెక్టర్‌కి వినతి అందజేసిన రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి

మహేశ్వరం, డిసెంబర్ 2 (జనం సాక్షి)

ప్రభుత్వాలు మారిన సబితా ఇంద్రారెడ్డి అనుచరుల ఆగడాలు సాగుతూనే ఉన్నాయని బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31 డివిజన్ ఎంసిఆర్ కాలనీలోని సర్వే నంబర్ 139లో సుమారు 2000 గజాలకు పైగా పార్కు స్థలాలను కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోవాలని అన్నారు. కాలనీకి ప్రవేశించే ప్రధాన రహదారి కూడలి వద్ద ప్లాట్ నెంబర్ 73,74 తూర్పు దశలో షాడో కార్పొరేటర్ కబ్జా చేసి నాలుగు షెటర్లను వ్యాపార సముదాయం కొరకు నిర్మించారని స్థలాన్ని కూడా కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోవాలని ఈరోజు బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. అందుకుగాను అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న సబితా ఇంద్రారెడ్డి అనుచరుల ఆగడాలు కార్పొరేషన్‌లో ఆగడం లేదని విచ్చలవిడిగా పార్కు స్థలాలను, రోడ్లను సైతం వదలట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షాడో కార్పొరేటర్ పై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సతీష్ నంద, ప్రవీణ్ కుమార్ గౌడ్, పవన్ కుమార్, మల్లెల మహేందర్ పాల్గొన్నారు.

## మితి మీరుతున్న అధికార పార్టీ దురాగతాలు

- షాడో ఎమ్మెల్యేల ఆగడాల వల్లనే ఆత్మహత్యలు
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,డిసెంబర్02(జనంసాక్షి):**



కాంగ్రెస్ పాలనలో ప్రజలకు రక్షణ లేదని,అరాచకం రాజ్యమేలుతున్నదని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్ లో ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ నరెడ్ల సాయిరెడ్డి అనే రైతును మాజీ మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్రాడుతూ గ్రామానికో షాడో ఎమ్మెల్యే తయారయ్యారని, అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఇతరుల భూములను ఆక్రమిస్తున్నారని అన్నారు. అధికార పార్టీ ఆగడాలకు తట్టుకోలేకనే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. అధికారులు ఒత్తిడులకు లోనుకాకుండా చట్టపరిధిలో పని చేయాలని సూచించారు.ఏదుట్లకు చెందిన నరెడ్ల సాయిరెడ్డి అనే రైతుకు చెందిన భూమిని దాయాదులు ఆక్రమించి ఇబ్బందులకు గురిచేయడం వల్ల ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా తనకు న్యాయం జరగడం లేదని ఆవేదన చెంది ప్రజావాణిలో కలెక్టర్ ఎదురుగా మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించడం జరిగిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే జిల్లాకే చెడ్డ పేరొస్తుందని కలెక్టర్ స్వయంగా చొరవ తీసుకొని బాధితుడికి న్యాయం చేయాలని నిరంజన్ రెడ్డి కోరారు.ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. వైద్యులను అతని ఆరోగ్య పరిస్తితి గురించి అడిగి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు కరువైనాయని, ఒకవైపు రైతు పండుగ సంబరాలు జరుగుతుంటే మరోవైపు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. న్యాయం కోసం సాయిరెడ్డి పలుమార్లు పోలీసుల చుట్టూ తిరిగిన అధికార పార్టీ వారి ఒత్తిడులకు గురై పోలీసులు ఆయనకు న్యాయం చేయకపోగా వేధించడం,రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల భూమి పట్టా ఉన్నా సాగు చేయకుండా దాయాదులు దౌర్జన్యం చేయడం వల్ల విసిగి వేసారి ఆత్మహత్యకు పాల్పడినట్లు బాధితుడు చెప్పాడని, అని ఇది దురదృష్టకరం అని అన్నారు.వెంటనే ప్రభుత్వం,అధికారులు స్పందించి సాయి రెడ్డికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు అధికార పార్టీ ఆదేశాలు రాష్ట్రపతి హుకూం లాగా పని చేస్తున్నారని, సివిల్ పంచాయితీలలో పోలీసులు కలగజేసుకోవడం వంటి చర్యలకు పాల్పడకుండా చట్టపరిదిలో పనిచేయాలని అన్నారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత గ్రామములో వేలాది క్వింటాల ధాన్యం మాయమైతే దిక్కులేదని, అదేవిధంగా లక్షిమిపల్లిలో శ్రీధర్ రెడ్డి హత్య జరిగితే నేటికీ దోషులను పట్టుకోలేదని ఎద్దేవా చేశారు. నిరంజన్ రెడ్డి వెంట బీఆర్ఎస్ నాయకులు వెంట పి.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్,చిట్యాల రాము, రవికుమార్, నాగేంద్రము తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన మహిపాల్ రెడ్డి

**తూప్రాన్ డిసెంబర్ 2 (జనం సాక్షి):**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనోహరాబాద్ మండలం శివారులో బండ తిమ్మపల్లి శివారులో కోకోకోలా కంపెనీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా వెలిపాడు వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రికి రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మహిపాల్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. బొకే శాలువతో సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల బహుళ అంతస్తులు..!



- అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న అధికారులు
- అనుమతి మొదటి అంతస్తు..కట్టేది ఐదవ అంతస్తు
- నోటీసులతోనే సరిపెడుతున్న పంచాయతీ కార్యదర్శి
- వాయిసేన అకాడమీకి కూత వేటు దూరంలోనే అక్రమ అనుమతులు
- ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో గండి

జిన్నారం డిసెంబర్ 2(జనంసాక్షి)

పటాన్ చెరువు నియోజకవర్గం గుమ్మడిదల మండలం అనుమతులకు విరుద్ధంగా పుట్టగొడుగుల బహుళ అంతస్తులు నియమిస్తున్నారు. నిర్మాణాలను అడ్డుకోవలసిన అధికారులు నోటీసులతో సరిపెడుతున్నారు.గ్రామం, మండలం, డివిజన్, పంచాయతీ అధికారులు సైతం అక్రమ కట్టడాల నిర్మాణంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారతీయ వాయిసేన అకాడమీకి కూత వేటు దూరంలోనే అక్రమ కట్టడాలకు కార్యదర్శి అనుమతులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుని కమర్షియల్ నిర్మాణం జరిగిన తీరు జనాలకు ఇట్టే కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా అధికారులు చలనం లేకుండా పోయింది. భారతీయ వాయిసేన అకాడమీ నుండి సుమారు వంద మీటర్ల లోపు ఏ ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ ఐదు అంతస్తుల కమర్షియల్ నిర్మాణ పనులు జరుగుతున్న నిర్మాణ పనులను ఆపకపోవడంతో అధికారుల పాత్ర ఉందనేది తెలుస్తుంది. సంబంధిత శాఖ అధికారులు చూసి,చూడని వైఖరి తీరు పలు విమర్శలకు తావిస్తుంది. అనుమతికి విరుద్ధంగా అక్రమ కమర్షియల్ నిర్మాణానికి పలుమార్లు నోటీసులు జారీ చేశామంటూ అన్నారం మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సంగీత నాయక్ చేతులు దులుపుకుంటున్నారు. బడా బాబుల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లనే కమర్షియల్ నిర్మాణం జరిగిందంటూ బయట గుసగుసలు వినబడుతున్నాయి ఏది ఏమైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

# అంకిత భావంతో పని చేయాలి

- సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి
- ఎస్పీ యోగేష్ గౌతమ్



నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

విది నిర్వహణలో అంకిత భావంతో పని సవాళ్ల ను సమర్థంగా ఎదుర్కోవాలని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం అన్నారు. సోమవారం9 నెలల ట్రైనింగ్ పూర్తి చేసుకొని కొత్తగా విధుల్లో చేరుతున్న 78 కానిస్టేబుళ్లకు 47 మంది సివిల్ కానిస్టేబుల్లకు పోలీస్ స్టేషన్ వారిగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే 31 మంది అర్మడ్ రిజర్వు పోలీసులకు జిల్లా స్పెషల్ పార్టీకి పోస్టింగ్ ఇచ్చి వారికి జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. పోలీసుశాఖ మిగిలిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే ఎంతో భిన్నమైనదని, ఎన్నో సవాల్లతో కూడుకున్నదని, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు ఉద్యోగ బాధ్యతల్లో చేరిన మరుక్షణం నుండే ఎన్నో సవాల్లను ఎదుర్కొంటాడని శాంతి భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం పాటుపడతాడని పేర్కొన్నారు. పోలీసు శాఖలో ఏ హోదాలో ఉద్యోగంలో చేరినప్పటికీ ప్రతి ఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణలో సమాన ప్రాధాన్యత బాధ్యత కలిగి ఉంటారని అన్నారు. నూతన కానిస్టేబుళ్లకు ఉన్నతాధి కారుల నుండి సంపూర్ణ సహాయ సహకారాలు అందుతాయని, వారి సూచనలకు ఆదేశాలకు అనుగుణంగా క్రమ శిక్షణతో పని చేయాలని సూచించారు. నూతన కానిస్టేబుళ్లు అందరికీ వారి వారి శక్తి సామర్థ్యాలకు, విభిన్న నైపుణ్యాలకు తగినట్టుగా అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ క్రైమ్ వంటి సాంకేతికపరమైన నేరాల నేపథ్యంలో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారిని అటువంటి చదువులు చదివిన వారికి సైబర్ క్రైమ్, ఐటి సెల్ వంటి విభాగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నేర నియంత్రణలో శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యున్నత స్థాయిలో జిల్లలో పోలీసులు వినియోగిస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని, విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిని ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. పోలీస్ జీవితంలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనదని, అధికారులు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసులకు ప్రధాన బాధ్యత ప్రజల రక్షణ అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరిడెంట్ శంకర్ లాల్, ఎస్బిఐ సిఐ రామ్ లాల్, ఆర్ఐ నరసింహ, ఆర్ ఎస్పైలు శివశంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి బ్యూరో డిసెంబర్02 (జనంసాక్షి)

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంలతో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈరోజు ప్రజావాణికి



మొత్తం 32 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

**సర్వే డేటా ఎంట్రీ వేగంగా పూర్తి చేయాలి**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి డేటా ఎంట్రీ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ఫారంలను ఆన్లైన్ డేటా ఎంట్రీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా, నాణ్యతగా డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. ప్రతిరోజు డేటా ఎంట్రీ టార్గెట్ ను పూర్తి చేయాలన్నారు. ఫారమ్స్ ను చాలా జాగ్రత్తగా భద్రపరచాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పండుగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలు**

పండుగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డిసెంబర్ 9 తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంతో కేసీఆర్..మూసీతో రేవంత్

**ఎక్కడ వచ్చింది మార్పు**

- రాష్ట్రంలో అధికార మార్పిడే కాదు..కుటుంబ దోపిడి కూడా మారింది
- పాలకులు మారారు తప్ప..పాలన మారలేదు
- దోచుకోవడం దాచుకోవడం తప్ప ఏం మార్పు ఎక్కడ
- బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 2 (జనంసాక్షి) :

సంగారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ..2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 6 గ్యారంటీ ల పేరుతో ప్రజలను మోసం చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం అధికార మార్పిడి మాత్రమే జరిగింది కానీ పరిపాలన కాదు అని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి తెలంగాణ సంపదను దోచుకోవడంలో పోటీ పడుతున్నారు అని అన్నారు. అప్పుడు కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుంభం దోచుకొంటే ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబం మూసి పేరుతో దోచుకుంటుంది అని అన్నారు. రైతురుణ మాఫీ పేరుతో రైతులను 50 శాతం కూడా రుణం మాఫీ చెయ్యకుండా రైతులను మోసం చేసినందుకా.? ఈ రోజు మీరు రైతు పండగ పేరుతో సంబరులు చేస్తున్నారు అని ప్రశ్నించారు. రైతు బందు ఇవ్వకుండా నట్టేట ముంచిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కింది, మహిళలకు 2500 మహాలక్ష్మి పతకం ద్వారా ఇస్తాం అని చెప్పి ఇప్పటివరకు తెలంగాణలో ఎంత మందికి ఇచ్చారని, తెలంగాణలో ఎంత మంది రైతులకు ఇచ్చారో, సంబరాలు చేసే నాయకులు గ్రామాల్లో మహిళలకు సమాధానం చెప్పాలని అన్నారు. విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీ లు ఇస్తాం అని చెప్పి కనీసం నాణ్యమైన భోజనం కూడా ఏర్పాటు చెయ్యలేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కదా.? అని ప్రశ్నించారు. ఒక్క సంవత్సర కాలంలో అన్ని సాధించిందని సంబరాలు చేస్తున్నారా నిలదీశారు. అంతే కాకుండా సంగారెడ్డి జిల్లాలో వివిధ అసెంబ్లీ లలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయో కూడా జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజలకు సమాధానం చెప్పి సంబరాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్, ఎడ్ల రమేష్, రాష్ట్ర నాయకులు రాజేశ్వర్ రావుదేశ్ పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శులు అనంతరావు కులకర్ణి, మాణిక్ రావు, రాజశేఖర్ రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి రాజు గౌడ్, బీజేపీ ఉపాధ్యక్షులు పోచారం రాములు, నర్సింగ్ రావు, పఠాన్ చేరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, కార్యాలయ కార్యదర్శి విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి ఎల్లన, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మినా గౌడ్, పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలి

**జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు**

గద్వాల నడిగడ్డ,డిసెంబర్ 2 (జనంసాక్షి)

విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తూ ,ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించాలనీ జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు ట్రైనింగ్ పూర్తి చేసుకొని కొత్తగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు దిశానిర్దేశం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా నుండి 72 సివిల్, 33 ఏఆర్ కలిపి మొత్తం 105 మంది సెలెక్ట్ అయి 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని జోగులాంబ గద్వాల జిల్లాలో విధులు నిర్వహించడానికి రావడం జరిగినందున సోమవారం జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయం లోని గ్రీవెన్స్ హాల్ నందు వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. పోలీసుశాఖ మిగిలిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే ఎంతో భిన్నమైనదని, ఎన్నో సవాల్లతో కూడుకున్నదని, మానసికంగా,శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు ఉద్యోగ బాధ్యతల్లో చేరిన మరుక్షణం నుండే ఎన్నో సవాల్లను ఎదుర్కొంటాడని శాంతి భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం పాటుపడతాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె.గుణ శేఖర్, ఆర్.ఐ వెంకటేష్, ఎస్బి ఎస్సై శ్రీనివాస్,ఆర్ ఎస్సై చంద్ర కాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై ఉపాధ్యాయుని దాష్టీకం

- ప్రశ్నిస్తే తోటి ఉపాధ్యాయులపై బూత్ పురాణం
- కొల్చారం పాఠశాలలో సైకోలా ప్రవర్తించిన టీచర్



మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 2 (జనంసాక్షి):

మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు తోటి ఉపాధ్యాయులను, విద్యార్థులపై బూతు పురాణం ఎత్తుకున్నారు. ఇష్టా రీతిగా బూతులు తిడుతూ విద్యార్థులను కొడుతున్న విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సంపత్ గత కొన్ని రోజులుగా తోటి ఉపాధ్యాయులను విద్యార్థులను నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ వింత వింతగా, (సైకోలా) ప్రవర్తిస్తున్నాడు. సోమవారం పాఠశాలకు వచ్చిన గ్రామానికి చెందిన మేదరి నరసింహులు కుమారుడు అక్షిత్ కుమార్ ను రెండు చెవులు పట్టి పైకి లేపి కింద పడేయడంతో విద్యార్థి తరగతి గదిలోనే మూత్రం పోసుకొని అడ్డం పడిపోయాడు. ఈ విద్యార్థి అక్షిత్ కుమార్ కు గతంలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. అలాంటి విద్యార్థిని పైనుండి కిందికి పడవేయడంతో విద్యార్థి స్పృహ కోల్పోయాడు. ఈ విషయమై తోటి ఉపాధ్యాయులు ప్రశ్నిస్తే ఉపాధ్యాయుల ను సైతం బూతులు దుర్భాషలాడాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సఫియా బేగం ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కోరగా ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అట్టి ఉపాధ్యాయుడు విద్యార్థినీ విద్యార్థులను పుస్తకాలను చించివేస్తూ ఇష్టా రీతిగా కొడుతున్న విషయం తెలిసిన విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఆందోళన చేపట్టారు. వెంటనే సంబంధిత ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. దీంతో సదరు ఉపాధ్యాయుడు పాఠశాల నుండి ఎలాంటి అనుమతి లేకుండానే పలాయనంం చిత్తగించారు. విషయం తెలిసి కొల్చారం ఎంఈఓ సత్యనారాయణ రావు కొల్చారం పాఠశాలకు చేరుకొని విద్యార్థుల తల్లిదండ్రులను నచ్చ చెప్పారు. ఉపాధ్యాయుని ప్రవర్తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- శాంతి భద్రతల దృష్ట్యా జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ 1861 అమలు
- మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)


మహబూబ్ నగర్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, శాంతియుత వాతావరణాన్ని పెంపొందించేందుకు ఈనెల 2 వ తేదీ సోమవారం నుండి 1 జనవరి 2025 వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు చేయరాదన్నారు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దొడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను కలిగి ఉండటం, వాడడం నేరమన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను, జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేధమని, రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధమని, లౌడ్ స్పీకర్‌లు, డీజే ల వంటివి కూడా ఈ సమయంలో నిషేధమన్నారు. నియమాలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులు అని, పోలీసు నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పు ఎస్పీ హెచ్చరించారు.

# రైతుల్లో ఆనందం నింపిన కాంగ్రెస్

- పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన సీఎం
- వ్యవసాయానికి మహర్దశ చేకూర్చిన రేవంతన్న
- డీసీసీబీ చైర్మెన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి

వనపర్తి,డిసెంబర్02(జనంసాక్షి):

కాంగ్రెస్ సర్కార్ హయాంలో అసలైన రైతులకు సిసలైన ప్రయోజనం దక్కుతున్నదని ఉమ్మడి మహబూబ్ నగర్ డీసీసీబీ చైర్మెన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ప్రశంసించారు. పంట పండించే వాళ్లకే ప్రభుత్వ వెసులుబాట్లు కల్పించాలని అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి అనుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ దిశగా ఎన్నెన్నో కార్యక్రమాలు అమలు చేసి ఏడాది కాలంలోనే రైతు సంక్షేమం కోసం పాటుపడుతూ ఇది రైతు ప్రభుత్వం అని ప్రూవ్ చేసుకుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పక్కన పెట్టిన వాటిని ముందుకు తీసుకొచ్చి సేద్యం చేసే రైతులకు మేలు చేసిందని, రైతులకు డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకోవడం వరకే కాకుండా అత్యాధునిక వ్యవసాయ పద్ధతులపైనా మెలకువలు నేర్పించే పనిలో ఉంది సర్కార్ ఉందని అన్నారు.



**రైతుల కోసం వెచ్చించింది రూ.54,280 కోట్లు**

ఇవేవో బడ్జెట్ లెక్కలు కాదని అక్షరాలా ఈ ఏడాది కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాక్షాత్తూ రైతుల కోసం వెచ్చించిన నిధుల మొత్తం రూ.54 వేల 280 కోట్ల రూపాయలని అన్నారు. ఈ సీజన్ రైతు భరోసా తప్ప మిగితావన్నీ సాఫీగా సాగుతున్నాయని, 22 లక్షల రైతు కుటుంబాలకు ఇప్పటికే 2 లక్షల రూపాయల దాకా రుణమాఫీ జరిగిందన్నారు. మాఫీ కాని వారికి ఈనెల 30న సీఎం రేవంత్ రెడ్డి తీపి కబురు అందించారని అన్నారు. అదే సమయంలో గత ప్రభుత్వ హయాంలో రైతుబంధును కొండలు, గుట్టలు, రాళ్లు రప్పలున్న భూములు, లే అవుట్లకు కూడా ఇచ్చారని,కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి తప్పులు జరగకుండా, పంటలు పండించే వారి భూములకే రైతు భరోసా ఇచ్చేలా ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారని వివరించారు. ఆ రిపోర్ట్ రాగానే రైతు భరోసా నిధులు కూడా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందదన్నారు.

27 రోజుల్లోనే రూ. 17,869 కోట్లు రుణమాఫీ

అసలైన రైతు పండగ ఈ ఏడాది కాలంలోనే వచ్చిందన్నది రైతులు చెబుతున్న మాటని, ఎందుకంటే 27 రోజుల్లోనే 17,869 కోట్ల రూపాయలను 22 లక్షల రైతు కుటుంబాల ఖాతాల్లో వేయడం అంటే మాటలు కాదని ,గత కేసీఆర్ ప్రభుత్వం ఏళ్లకేళ్లు దీన్ని ప్రహసనంగా మార్చేసిందని అన్నారు. అయితే రైతులు నష్టపోవద్దన్న ఉద్దేశంతో రేవంత్ ప్రభుత్వం రుణమాఫీని ప్రాధాన్య అంశంగా తీసుకుని మాఫీ చేసిందని, టెక్నికల్ కారణాలతో మాఫీ కాని వారికి కూడా చేయబోతున్నట్లు ఆయన తెలిపారు.గత ప్రభుత్వం కేవలం రైతుబంధు, రైతుబీమా ఇచ్చి అన్నిటికీ ఇదే మందు అని చెప్పిందని, కానీ రైతులకు అసలైన లాభం పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, తాజాగా సన్నాలకు 500 రూపాయల బోనస్ ఇస్తుండడం అన్నారు. పంటల సబ్సిడీ కల్పించారని, అలాగే పంటల బీమా కూడా పునరుద్ధరించారని, ఇవన్నీ గత ప్రభుత్వ హయాంలో చేతులెత్తేసినవే అన్నారు. రేవంత్ ప్రభుత్వం మాత్రం రైతులకు ఏమి చేస్తే మేలు జరుగుతుందో గుర్తించి తొలి ఏడాదిలోనే చారిత్రక నిర్ణయాలు తీసుకుందన్నారు.

**సంపూర్ణ రుణమాఫీ చేసేందుకు కసరత్తు**

రైతుకు పెట్టుబడి దగ్గర్నుంచి సబ్సిడీలు అందించడం, పంటల బీమా కల్పించడం, చివరికి పండిన పంటను మద్దతు ధరతో కొనడమే కాదని, సన్నాలకు బోనస్ లు వంటివి ఇవ్వడం అంటే మాటలు కాదని,ఇవన్నీ చేస్తే రైతు రాజు అవడం ఖాయం అన్నారు. ఈ ఏడాది కాలంలో జరిగిన మార్పులేంటో రైతులందరికీ తెలుసని, ఈ సీజన్ రైతు భరోసా, రుణమాఫీ కాని వారు కొంత అసంతృప్తి ఉన్నా,ఇంత చేసి ఆ రెండు ప్రభుత్వం చేయకుండా ఉంటుందా అనే నమ్మకంతో రైతులున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు . ఇచ్చిన హామీలన్నీ నెరవేరి రైతులకు నిజమైన ఆర్థిక స్వాతంత్రం తీసుకొచ్చే దిశగా తొలి ఏడాదిలో గట్టి పునాదే పడిందన్నారు.అటు వ్యవసాయానికి కీలకంగా మారిన ఉచిత విద్యుత్ పథకానికి ఈ ఏడాది 10 వేల 444 కోట్ల రూపాయలు సబ్సిడీ కింద విద్యుత్ సంస్థలకు చెల్లించిందని, అందులోనూ త్రీఫేజ్ నాణ్యమైన కరెంట్ ను ప్రభుత్వం అందించిందని అన్నారు. కేసీఆర్ సర్కార్ హయాంలో పంటల బీమా అమలు చేయలేదని, కానీ రేవంత్ ప్రభుత్వం మాత్రం పంటలు నష్టపోతే రైతులకు పరిహారం అందేలా పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించి ప్రీమియం చెల్లించేందుకు రూ.1,300 కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు పది వేల చొప్పున అకౌంట్లలో వేశారని, ఎవరైనా రైతులు ఏ కారణంతో చనిపోయినా 5 లక్షల రూపాయల బీమా పరిహారం బాధిత కుటుంబానికి అందిస్తోందని తెలిపారు. రైతు బీమాకు ప్రీమియం కింద 1,455 కోట్ల రూపాయలు చెల్లించిందన్నారు.



## కవులు సామాజికాంశాలను సృజించాలి

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

వనపర్తి,డిసెంబర్02(జనంసాక్షి):

కవులు, రచయితలు తమ రచనల్లో సామాజిక అంశాలను సృజించాలని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఉద్బోధించారు. ప్రముఖ రచయిత వనపట్ల సుబ్బయ్య రచించిన 'అసిపె' దీర్ఘకావ్యం అనే పుస్తకాన్ని సోమవారం వనపర్తిలోని మాజీ మంత్రి నివాసంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రచనలు, కవిత్వాల ద్వారా సమాజ మార్పు జరుగుతుందని అన్నారు. విద్యార్థి దశలో తమ గురువులు గోడ పత్రికలను ఏర్పాటు చేసి రచనలు చేయడానికి ప్రోత్సహించే వారని గుర్తు చేశారు. రచయిత వనపట్ల సుబ్బయ్య రచనలన్నీ సాహితీవేత్తలను ఆలోచింపజేస్తాయని అన్నారు. సుబ్బయ్య తన సామాజిక వర్గానికి చెందిన కులవృత్తిని ప్రతిబింపజేసే విధంగా కవిత్వం వ్రాయడం అభినందనీయం అని అన్నారు. అసిపే దీర్ఘకావ్యం నేడు (మంగళవారం) హైదారాబాద్ రవీంద్రభారతి నందు ఆవిష్కరణ ఆవిష్కరణ చేయనున్న సందర్భంగా ముందస్తు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రియులు, విశ్లేషకులు బలరామ్, యోగానందము, చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల రమేష్, నందిమల్ల అశోక్, కే మాణిక్యం గంధం పరంజ్యోతి, చిట్యాల రాము తదితరులు ఉన్నారు.

## యస్‌బిఐటి కళాశాలలో మాదకద్రవ్యాలపై
# అవగాహనా సదస్సు



**ఖమ్మం జనం సాక్షి:**
ఖమ్మం యస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ విద్యార్థులకు జరిగిన మాదక ద్రవ్యాల నిర్మూలన సదస్సులో కలెక్టర్ ముజో మిలాఖాన్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తను దైనందిక జీవితంలో క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఉదయ కాలమున ధ్యాసంతో పాటు శారీరక శ్రమను అలవాటు చేసుకోవాలని తద్వారా జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని. సవాళ్ళను సులువుగా ఎదుర్కోవచ్చని తెలిపారు. ప్రస్తుత కాలంలో యువత ఒత్తిడి కారణంగా చెడు వ్యసనాలకు బానిసలై, తమ విలువైన జీవితాన్ని నష్టపరచుకోవటమే కాకుండా తమ యందు ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు తీవ్రమైన నైరాశ్యానికి లోనుచేస్తున్నారని చెప్పారు. విద్యార్థులందరు మదకద్రవ్యాల విషయంలో అప్రమత్తంగా ఉండి తోటి స్నేహితులు ఎవరైనా ఇటువంటి వ్యసనాలకు లోనైతే సామాజిక బాధ్యతగా బాధితుల వివరాలు సంబంధిత శాఖా అదికారులకు సమాచారము అందిచటం ద్వారా వారి యొక్క ఉజ్వల భవిష్యత్తును కాపాడిన వారవుతారని తెలిపారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ దృష్టిని విద్య మరియు భవిష్యత్తు వైపు కేంద్రీకరించాలని, చెడు అలవాట్లకు చోటు ఇవ్వకుండా భవిష్యత్తును దృష్టిలో 'పెట్టుకొని ప్రణాళికలు సిద్ధపరచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మరియు ట్రైనీ కలెక్టర్ మృణాల్ ఠాకూర్ ను కళాశాల చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫర్ ఆఫీసర్ రాంగోపాల్రెడ్డి మరియు డిసిపిఒ విష్ణువందన విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.



## లారీ చక్రాల కింద
# నలిగిన బతుకులు

ఇరుక్కొని తీవ్రగాయాలు పాలవ్వడంతో అతడిని బయటకు తీసి చికిత్సకోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. లారీ హైదరాబాద్‌లో అన్‌లోడ్ చేసి తిరిగి వికారాబాద్ వస్తున్న క్రమంలో అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా పేర్కొన్నారు.ఈ ఘటనతో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై భీతావహ వాతావరణం నెలకొంది. లారీ సృష్టించిన బీభత్సంలో మృతులను రాములు (ఆలూరు), ప్రేమ్ (ఆలూరు), సుజాత (ఖానాపూర్)గా గుర్తించారు. ఈ ఘటనలో మరికొందరికి గాయాలైనట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.దాదాపు వంద విరీటర్ల దూరం నుంచే లారీ అదుపు తప్పిన విషయాన్ని గమనించిన కూరగాయల వ్యాపారులు పరుగులు పెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు కూలిన చెట్టును జేసీబీతో పక్కకు తొలగించారు. ఘటనా స్థలానికి కి.విరీల దూరంలో నిన్న కూడా రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, కారు ఢీకొని బీడీఎల్ ఉద్యోగి దంపతులు నిన్న దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును విస్తరించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**
రంగారెడ్డి జిల్లాలో లారీ బీభత్సం సృష్టించిన ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# గుండెకు గుడికి అనుసంధానం

## ఆలయాల్లో ఆచార సంప్రదాయాలకు పట్టం

- భగవంతునికి.. భక్తునికి వారధిగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం
- యాదగిరిగుట్ట... వేములవాడ.. భద్రాచలం ఆలయాల అభివృద్ధికి చర్యలు
- సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.110 కోట్లు వ్యయం



**హైదరాబాద్, డిసెంబర్ 2 (జనంసాక్షి) :**
రాష్ట్ర నలుదిక్కుల ఖ్యాతిని మరింతగా పెంచడమే లక్ష్యంగా తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. విశ్వాసాన్ని పెంచేందుకు ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోందని, సనాతన ధర్మానికి పెద్దపీట వేస్తూ ఆచారవ్యవహారాలకు అనుగుణంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. గట్టుగా తెలంగాణ బిడ్డలు పిలుచుకునే యాదగిరిగుట్ట పేరును గత పాలకుడు యాదాద్రిగా మార్చివేశారు. ఆలయం స్తంభాలపై తన స్వీయ చిత్రాలు చెక్కించు కున్నారు.. ఆలయంలో వందల ఏళ్లుగా పాటిస్తున్న ఆచారాలకు మంగళం పాడారు.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలంగాణ వాసుల మనోగతాన్ని గౌరవిస్తూ యాద్రాద్రి కాదు యాదగిరిగుట్టనే అని ప్రకటించారు.
గతంలో ఎర్రటి ఎండలో గుట్టపైన భక్తులు మాడిపోవాల్సి వచ్చేది. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనం క్యూలైన్ల వద్ద నీడ కోసం షెడ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది.
దక్షిణ కాశీగా గుర్తింపుపొందిన వేములవాడ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృ త్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పర్యవేక్షణ కొరవడి ఇక్కడ భక్తులు సమర్పించిన కోడెలు మృత్యువాతపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. భవిష్యత్తులో కోడెలకు అటువంటి పరిస్థితి దాపురించకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశిం చారు. దాంతో అధికారులు వేములవాడ సమీపం తిప్పాపూర్‌లోని గోశాలను పరిశీలించారు. ఇప్పటికే రూ.1.11 కోట్లతో గోశాలలో ఫ్లోరింగ్ వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. గోశాలకు వచ్చే కోడెలను వివిధ మఠాలకు, గుర్తింపు పొందిన గోశాలలకు, వ్యవసాయం చేసే రైతులకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్ల నిధులు మంజూరు చేశారు.
భద్రాచల రాముడు తెలంగాణ ప్రజల ఇలవేల్పు.. భద్రాచలం.. పర్ణశాల అభివృద్ధికి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తామని చెప్పిన సీఎం మాట ప్రకారం రూ.180 కోట్లతో ఆలయ అభివృద్ధికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మాడ వీధులు అభివృద్ధి, ఇతర పనులకు ఇప్పటికే రూ.60.20 కోట్లు, గోదావరి వరదల నుంచి రక్షించేందుకు రూ.38 కోట్లతో కరకట్ట పనులు,1.5 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు, మహబూబ్‌నగర్ జిల్లా అమ్మాపురంలోని కురుమూర్తి స్వామిని, రాష్ట్రంలో ప్రముఖ క్షేత్రాలైన బాసర, కొండగట్టు, ధర్మపురి, కొమురవెల్లి, తదితర క్షేత్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.. రానున్న రోజుల్లో ఆయా ఆలయాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది.





## రామేశ్వరం లడ్డు ప్రసాదంలో నాణ్యత లేదు

**భక్తులకు త్రాగడానికి మంచి నీళ్ళు లేవు**
**భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలి**

**షాద్ నగర్ (జనంసాక్షి) :** ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు అమ్మే ప్రసాదంలో నాణ్యత లేదని భక్తులకు కనీసం త్రాగడానికి మంచినీటి సౌకర్యం కల్పించడం లేదని బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ మాట్లాడుతూ షాద్ నగర్ పట్టణనికి కూత వేటు దూరంలో ఉన్న కొన్ని వందల ఏళ్ళ చరిత్ర కలిగిన పురాతన ఆలయలలో రామేశ్వరం ఒకటి నిత్యం రద్దీగా ఉంటుందనీ ముఖ్యంగా కార్తీక మాసం పౌర్ణమి రోజు శివరాత్రి రోజు అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు అలాంటిది కనీస మౌలిక సదుపాయాలను కల్పించడం లో విఫలం అయ్యిందని అన్నారు. ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటుంది ప్రసాదంలో నాణ్యతలేదు నాణ్యత లేకపోగా ప్రసాదం కొబ్బరికాయలు ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముతున్నారు వచ్చిన భక్తులకు కనీసం త్రాగునీరు సరఫరా చేయడంలో కూడ దేవాదాయ శాఖ విఫలం అయ్యిందని తక్షణమే భక్తులకు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా సురక్ష ప్రముఖ్ ప్యాట వంశీ నగర సహా సంయోజక్ రోల్లు గిరి భాను పవన్ బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు..

## ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు క్యాన్సర్‌కు కారణం

- గోడ పత్రికను ఆవిష్కరించిన మధు యాష్కిగౌడ్
- క్యారీ యువర్ ఓన్ బ్యాగ్ బాక్స్.. 'అవాయిడ్ సింగిల్ యూస్ ప్లాస్టిక్



**ఎల్‌బి నగర్ డిసెంబర్ 2(జనం సాక్షి) :**
యాంటి పొల్యూషన్ డే డిసెంబర్ 2 పురస్కరించుకుని ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువుల వాడకం వలన తలెత్తే అనారోగ్య/కాలుష్య సమస్యల అవగాహన గోడ పత్రికను జాగృతి అభ్యుదయ సంఘం రూపొందించినది. హొటల్స్, టీ స్టాల్స్, కిరాణా, తోపుడు బండ్ల వద్ద అతికించి, ప్రచారం చేయడానికి రూపొందించిన ఈ పోస్టర్లను వనస్థలిపురం లోని ఒక కార్యక్రమానికి హాజరైన ఎక్స ఎంపీ మరియు ఎల్ బి నగర్ కాంటెస్టెడ్ మ్మెల్యే కాండిడేట్ ఐన మధుయాష్కి గౌడ్ గొడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేడి వేడి టీ, కాఫీ, సాంబార్ లాంటి ఆహార పదార్థాలు పలుచని ప్లాస్టిక్ కవర్లలో పట్టుకెళ్ళడం, ప్లాస్టిక్ గ్లాసుల్లో,పలుచని ప్లాస్టిక్ పొర ఉండే పేపర్ గ్లాసుల్లో త్రాగడం వలన క్యాన్సర్ సోకుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారని, వారి హెచ్చరికలను పట్టించుకుని ప్రత్యామ్నాయ ఫ్లాస్క్ లు, గాజు, పింగాణి, స్టీల్ గ్లాసులు వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజారోగ్యం/పర్యావరణ పరిరక్షణకు 15 సంవత్సరాలుగా శ్రమిస్తున్న జాగృతి సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్, కాంగ్రేసు పార్టీ వనస్థలిపురం, బి.ఎన్.రెడ్డి డివిజన్ల నాయకులు కుట్ల నరసింహ యాదవ్, మకుటం సదాశివుడు, భవాని, స్వర్ణ మాధవి, డా॥ఎవెంకట్ ఆచార్య, వేణుగోపాల్, ఉదయ్, ఉప్పు వెంకటేశం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవనే హోప్ ఫౌండేషన్ ప్రథమ కర్తవ్యం

**చైర్మన్ కొండా విజయ్ కుమార్**



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 02 (జనంసాక్షి) :**
నలుగురికి సహకారం అందించడంద్వారా అందరం బాగుండాలి...అందులో మనముండాలి అన్న మూల సూత్రాన్ని ఆధారంగా చేసుకొని హోప్ ఫౌండేషన్ ఆవిష్కృతమైందని, దాదాపుగా 9 సంవత్సరాల నుండి ఇదే సిద్ధాంతంతో ముందుకు సాగుతూ వందల సంఖ్యలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని హోప్ ఫౌండేషన్ అధ్యక్షులు కొండా విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు చందానగర్ పరిధిలో సోమవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై హాఫీజ్పేట్ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వికలాంగునికి వైద్య చికిత్స నిమిత్తం 10 వేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవే పరమావధి అన్న ప్రధాన ఆశయంతో హోప్ ఫౌండేషన్ పురుడు పోసుకుందని, నాటి నుండి నేటి వరకు లక్ష్యసాధనలో వెనకకు తిరిగి చూసిందే లేదని హోప్ రా తెలిపారు. హోప్ ఫౌండేషన్ సేవానిరతికి చిరునామా అని, ఇప్పటికే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, ఇకముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగించడం జరుగుతుందని విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగిరెడ్డి శాంతి భూషణ్ రెడ్డి, బర్క మల్లేష్ యాదవ్, మారం ప్రసాద్, సింగ దాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నా జీవిత లక్ష్యం ఆయిల్ పామ్ సాగుతో
# రైతులను రాజుగా మార్చడం

- రైతులు పేదరికం లేకుండా లాభాలు వచ్చే పంట ఆయిల్ పామ్ సాగు
- నేను మంత్రిగా ఏడాది పూర్తయ్యే నాటికి పామాయిల్ గెలలు ధర 20 వేలు దాటింది
- ఇవాళ టన్ను పామాయిల్ గెలలు ధర 20 వేల 413 రూపాయలు
- తెలంగాణ ఆయిల్ పామ్ సాగు హబ్ గా మార్చడమే నా జీవిత లక్ష్యం
- విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం, (జనం సాక్షి) :** నా జీవిత లక్ష్యం ఆయిల్ పామ్ సాగుతో రైతులను రాజుగా మార్చడం, రైతులు పేదరికం లేకుండా లాభాలు వచ్చే పంట ఆయిల్ పామ్ సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. సోమవారం రఘునాధపాలెం మండలంలోని నూతనంగా నిర్మించబోతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు పొలం బాట పట్టేలా ఆయిల్ పామ్ సాగు సాగును చేయించే విధంగా చూడాలన్నారు. తెలంగాణ ఆయిల్ పామ్ సాగు హబ్ గా మార్చడమే నా జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. నా చిరకాల కోరిక సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్య శ్యామలం నా జీవిత ఆశయం అన్నారు. వచ్చే ఆగస్ట్ 15 నాటి కల్ల సీతారామ ప్రాజెక్ట్ తో సాగు నీళ్ళు అందిస్తామన్నారు.
రఘునాధపాలెం మండలంలోని 66 కోట్లతో మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంక్రాంతి నాటికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఇప్పటికే జాతీ య రహదారులు ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రగతి బాట పట్టారని అన్నారు. నా రాజకీయ జీవితంలో ఇరిగేషన్, నేషనల్ హైవేల కోసం క్యాబినేట్ లో పనిచేసే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. రైతు బిడ్డైన నాకు రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసే అవకాశం వచ్చిందని అన్నారు. ఉద్యాన పంటలు సాగుతో రైతాంగం మేలు జరుగుతుందని తెలిపారు.
భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందని, అత్యున్నత స్థాయిలో అన్ని సౌకర్యాలతో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఏడో తేదీన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్ లో వసతులు కల్పించడం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లో సీట్ల పెంపుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ప్రతిపాదన తయారు చేసిన పంపాలని అధికారులను ఆదేశించారు. విద్యా రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన స్వామి నారాయ ణ ట్రస్ట్, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఏర్పాటు క్యాబినెట్ అనుమతి తెలిపిందని అన్నారు. ఖమ్మం ఎమ్మెల్యే గా క్యాబినెట్ లో ఉండే అవకాశం ఖమ్మం ప్రజానీకం ఆశీర్వాదంతో నాకు దక్కిందన్నారు. రఘునాథపాలెం మండలం సాగు నీటి కష్టాలు తీరేలా సాగర్ కాలువ పై లిఫ్ట్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇంపోర్ట్ టాక్స్ పెంచడం వల్ల దేశీయంగా ఆయిల్ పామ్ రైతాంగం కు లాభాలు వస్తున్నాయని, ఏడాదికి లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ ఫామ్ సాగు చేసే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఖమ్మం లో అరాచకం, అక్రమాలు లేని ప్రశాంతమైన ఖమ్మం కోసం ప్రజలు తీర్పు ఇచ్చారని, ప్రజలు స్వేచ్ఛాయి తంగా ప్రశాంతంగా ఉన్నారని అన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కోరినట్లు ఖమ్మం ప్రగతి బాటలు వేస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ ,ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, జడ్పీ సీఈవో దీక్ష రైనా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, మానుకొని రాధా కిషోర్, సాదు రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు



- వర్చువల్ విధానంలో నర్సింగ్ కళాశాల, మైత్రి క్లినిక్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 02 (జనంసాక్షి):** ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్ పల్లిలో భారత్ ఇన్స్టిట్యూట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆరోగ్య దినోత్సవం కార్యక్రమములో కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఆర్డీఓ అనంత రెడ్డి, ఆదిభట్ల మున్సిపల్ ఛైర్మన్ నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను, మైత్రి ట్రాన్స్ క్లినిక్ ను మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. ఆనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం నర్సింగ్ కళాశాలను మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేయడం శుభసూచకమనీ ఈ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినిలకు కావలసిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని ఆయన అన్నారు. తరచూ ఈ కళాశాలను సందర్శిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫ్యాకల్టీ పరంగా గాని, ఇతర మెడికల్ ఎక్విప్మెంట్ సదుపాయాలను కూడా సమకూరుస్తామని అన్నారు. ఈ నూతన కాలేజీలో చేరి నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియ చేశారు. ముందుగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల నూతన భవనాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ సునీత, వైద్యారోగ్య శాఖ అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.



## పబ్బుల్లో తనిఖీలు

**మల్కాజిగిరి, డిసెంబర్ 2 (జనంసాక్షి) :**
పబ్బుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని సహించబోమని కుషాయిగూడ ఏసీపీ మహేష్ పేర్కొన్నారు. నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న కైరో, అర్బన్ హౌస్ పార్టీ,10డీ, హీరో జో హమ్ పబ్బులను ఏసిపి మహేష్, నేరేడ్ మెట్ ఇన్ స్పెక్టర్ సందీప్ కుమార్ బృందంతో కలిసి ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగంపై నిర్వాహకులను ఆరా తీశారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని పసిగట్టే నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీ చేపట్టారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు వివరించి చట్టరీత్యా శిక్షించే చర్యలపై పబ్బుల యజమానులకు అవగాహన కల్పించారు.డ్రగ్స్ సంస్కృతిని ఎట్టి పరిస్థితిలోనూ సహించేది లేదని హెచ్చరించారు. పబ్బులకు వచ్చే కొత్త వారిపై నిఘా ఉంచాలని,రాత్రుల్లో నిర్ణీత సమయానికి పబ్బులను మూసివేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

# రైతు పొలాలకు సాగునీరు అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు

## రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వర రావు

- సంక్రాంతి నాడు మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన
- 66 కోట్లతో 36 చెరువులు నింపేలా మంచుకొండ ఎత్తిపోతల పథకం రూపకల్పన
- 500 కోట్లతో రఘునాథపాలెం మండల అభివృద్ధికి చర్యలు
- ఆయిల్ పామ్ పంటతో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ కంటే అధికంగా రైతులకు ఆదాయం



**ఖమ్మం, డిసెంబర్ 2, (జనంసాక్షి) :** రైతు పొలాలకు సాగునీరు అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి తుమ్మల, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి రఘునాథపాలెం మండలంలో పర్యటించి ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. నిధులతో శివాయి గూడెం గ్రామం నందు 21 లక్షల 50 వేలతో చేపట్టిన (5) అంతర్గత సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు, పువ్వాడ నగర్ గ్రామం నందు 78 లక్షలతో చేపట్టిన 11 అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, మంచుకొండ గ్రామంలో ఒక కోటి 34 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మంచుకొండ గ్రామం తో అనేక సంవత్సరాలుగా తనకు పరిచయం ఉందని, ఇక్కడ మంచి నీళ్లు, పాఠశాలలో నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో భాగం పంచుకునే అవకాశం తనకు లభించిందని అన్నారు. రైతాంగం, పేద ప్రజల కోసం భగవంతుడు తనకు ఇచ్చిన శక్తి మేరకు కృషి చేస్తున్నానని, ఖమ్మం జిల్లాలో ముందు సాగునీరు, తరువాత రహదారులు, విద్య, వైద్యం అభివృద్ధికి బాధ్యత తీసుకొని, మన ఖమ్మం జిల్లా సస్యశ్యామలంగా ఉండే విధంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. రఘునాథ పాలెం మండలంలో ఉన్న చెరువులు త్వరగా నింపేందుకు సాగర్ నీళ్లను అత్యవసరంగా తీసుకొని రావాలని 66 కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకం శ్రీకారం చుట్టామని, దీని వల్ల 36 చెరువులు నింపేటట్లు రూపకల్పన చేయడం జరిగిందని, ప్రజలు సహకరిస్తే సంక్రాంతి నాటికి పనులకు శంకుస్థాపన చేస్తామని, వేసవి పూర్తయ్యే లోపు ప్రాజెక్టు పూర్తి చేసి చెరువుల నింపే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి తెలిపారు. రూ.500 కోట్లతో రఘునాథపాలెం మండల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మండలంలోని అంగన్వాడీ భవనాలు నిర్మాణం, పాఠశాలల్లో మౌళిక వస్తువుల కల్పన, ప్రతి ఇంటికి మంచి నీరు, సాగు నీటి వసతి కల్పిస్తున్నామని అన్నారు. మండలంలో రైతులతో చర్చించి పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, ఆయిల్ పామ్ పంటకు కోతులు, అకాల వర్షాల వంటి అనేక సమస్యలు ఉండవని, సాఫ్ట్ వేర్ ఇంజినీర్ కంటే అధికంగా రైతులకు ఆదాయం వస్తుందని అన్నారు. రైతు భరోసా, రైతు బీమా ఇస్తామని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని, అర్హులు ఎవరికైనా పథకాలు అమలు కాకపోతే మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని, డైట్ చార్జీలు, మెస్ చార్జీలు గణనీయంగా పెంచామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యత అందిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఎటువంటి అవకతవకలు పాల్పడవద్దని మంత్రి సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ మంచుకొండ గ్రామంలో కోటి 30 లక్షల విలువ గల సీసీ రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రభుత్వం మంజూరు చేసిందని, వీటిని నాణ్యతతో పూర్తి చేసుకోవాలని అన్నారు. ఇతర జిల్లాలతో పోల్చితే మన దగ్గర మెరుగైన రోడ్లు ఉన్నాయని తెలిపారు. గ్రామాలలో ఏర్పాటు చేసే వీధి దీపాలను గ్రామ పంచాయతీ నిధులతో నిర్వహించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో అనవసరంగా పెద్ద వీధి దీపాలు పెడితే పంచాయతీ నిధులు వృధా అవుతాయని అన్నారు. గ్రామాలకు ప్రాధాన్యతగా అవసరమైన అంశాలను గ్రామసభ నిర్వహించి పారదర్శకంగా నిర్ణయించాలని తెలిపారు. పన్నుల నుండి అవసరం ఉన్న పనులను ముందు వరుసలో చేపట్టాలని, గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

## రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**టేకులపల్లి మండలంలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన**

**8.26 కోట్ల వ్యయం అంచనా తో బీటీ రోడ్లకు శంకుస్థాపన**



**టేకులపల్లి,డిసెంబర్ 2 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గం టేకులపల్లి మండలంలో రాష్ట్ర రెవిన్యూ,హౌసింగ్,సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు. మంత్రి వెంట ఇల్లందు శాసనసభ్యులు కోరం కనుకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం 15.38 కోట్ల అంచనా వ్యయం తో చేపట్టానున్న పలు బిటీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. సింగ్య తండా నుండి గొల్లగూడెం వరకు 2.2 కిలోమీటర్ల రహదారి, ఎర్రాయి గూడెం గ్రామం నుండి చింతలకట్ట గ్రామం వరకు రహదారి, దాసు తండా నుండి ఎర్రబోడు వరకు 3.8 కి.మీ రహదారి పనులకు, వొడ్డుగూడెం రోడ్డు నుండి జంగాలపల్లి వయా బర్లగూడెం వరకు నాలుగు కిలోమీటర్లరహదారి, పెద్ద చర్లపల్లి గ్రామం వరకు, గంగారం నుండి ఉలవచిలక గ్రామం వరకు నిర్మించనున్న ఎస్ టి ఎస్ టి ఎఫ్ నిధులు 15.38 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి పోగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ శంకుస్థాపన చేసిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలన్నారు. రానున్న పది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమం చేపడతామన్నారు. అర్హులైన పేదవారి అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. దీనిలో భాగంగా మొదటి విడతగా స్థలం ఉండి ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని పేదవారికి ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. టేకులపల్లి మండలం గంగారం గ్రామంలో వున్న ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా మంత్రి వసతి గృహంలో వంటశాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం కల్పిస్తున్నారా లేదా అని అడిగారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు బెడ్లు ఉన్నాయా, వారికి చదువుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యల పరిష్కారానికై ప్రజలు తెచ్చిన దరఖాస్తులను మంత్రి స్వీకరించి దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా టేకులపల్లి తహసిల్దారు నాగభవానిని ఆదేశించారు. ఈ పర్యటనలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లెనినా, మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, నళిని,జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల1 నుండి 9 వరకు ప్రజాపాలన కార్యక్రమాలు

## కలెక్టర్ ఇలా త్రిపాఠి





**నల్గొండ బ్యూరో,డిసెంబర్ 2, (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుండి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాల్లో భాగంగా అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం ఆమోదించిన ప్రజా పాలన విజయోత్సవాల అధికారిక లోగోను ప్రింట్,డిజిటల్ ప్లాట్ఫామ్స్ లో ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ప్రజా పాలనపై సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన "తెలంగాణ రైజింగ్ నంబర్ వన్" లోగోను అన్నిచోట్ల,అందరికీ బాగా కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు.అన్నీ ప్రభుత్వ కార్యాలయాలలో,ఛాంబర్లలో నెంబర్ వన్ లోగో స్టాండీస్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 9 వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు. ఆయా శాఖల వారిగా గత సంవత్సర కాలంలో సాధించిన అభివృద్ధిపై విజయ గాథలను రూపొందించి సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని, పోస్టర్లు,కరపత్రాల రూపంలో ప్రచారం చేయాలని చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న ప్రజా విజయోత్సవాలను జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాలు, మండల స్థాయిలో స్థానిక ప్రజాప్రతి నిధులను, ప్రజలను,అధికారులను భాగస్వామ్యం చేస్తూ విజయోత్సవాలు ఘనంగా నిర్వహించా ల్సిందిగా ఆమె ఆదేశించారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా డిసెంబర్1న ఆదివారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని, అంతేకాక 2 కె రన్ లను నిర్వహించడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 3న పట్టణ ప్రాంతాలలో స్థానిక సంస్థల కార్యాలయాలను విద్యుదీ కరించడం, నల్గొండ మున్సిపాలిటీ పరిధిలో ఎన్జీ కాలేజీ నుండి క్లాక్ టవర్ వరకు 2కే రన్ నిర్వహణ, మిర్యాలగూడ మున్సిపాలిటీలో అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం, దేవరకొండ మున్సిపాలిటీలో మెప్మా ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అలాగే నకిరేకల్ మున్సిపల్ పరిధిలో కోటి 50 లక్షల రూపాయల విలువచేసే ఇందిరా మహిళ చెక్కుల పంపిణీ ఉంటుందని,చండూరులో 40 లక్షలు,హాలియా మున్సిపాలిటీలో 30 లక్షల రూపాయల చెక్కుల పంపిణీ ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాలు నిర్వహించాలని,సేఫ్టీ కిట్లను పంపిణీ చేయాలని ఆదేశించారు.డిసెంబర్ 4న అటవీ శాఖ ద్వారా పార్కుల్లోకి ఉచిత ప్రవేశ సౌకర్యాన్ని కల్పించాలని, మొక్కలు నాటడం, ర్యాలీల నిర్వహణ చేయాలని ఆదేశించారు. అలాగే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పెద్దపల్లిలో నియామక పత్రాలను, అందజేసేందుకు అభ్యర్థులను సమీకరించాలని అన్నారు. డిసెంబర్ 5న డిఆర్డిఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ,వడ్డీ లేని రుణాలు కింద చెక్కుల పంపిణీ చేపట్టాలని, మహిళా శక్తి పథకంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని,నల్గొండ ఐటిఐ ప్రారంభం నిర్వహించాలని ఆదేశించారు. డిసెంబర్ 6న వై టి పి ఎస్ ప్రారంభం ఉంటుందని,డిసెంబర్ 7న పోలీసు, అగ్నిమాపక శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని, డిసెంబర్ 8న ఐటీఐ టవర్ విద్యుదీకరణ చేపట్టాలని చెప్పారు.డిసెంబర్ 9న హైదరాబాదులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ప్రజా పాలన ముగింపు కార్యక్రమానికి సంసిద్ధం కావాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, డిఆర్ఓ అమరేందర్,స్పెషల్ కలెక్టర్ నటరాజ్, తదితరులు హాజరయ్యారు.

## ఒలంపిక్ క్రీడల్లో మెడల్స్ సాధించే దిశగా

# గ్రామీణ కళాకారులకు ప్రోత్సాహం

## కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్గొండ బ్యూరో,డిసెంబర్ 2,(జనంసాక్షి)** ఒలంపిక్ క్రీడలలో మెడల్స్ సాధించే దిశగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం క్రీడా కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా ఈనెల 7,8 తేదీలలో గ్రామాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, హెడ్మాస్టర్,సీనియర్ ఆటగాడు కమిటీలో సభ్యులుగా ఉంటారని,అనంతరం మండల స్థాయికి వచ్చిన క్రీడాకారులతో ఈ నెల10 నుండి 12వరకు మండల స్థాయిలో సిఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని,ఈ పోటీలు ప్రత్యేక అధికారి అధ్యక్షతన,ఎంపీడీవో కన్వీనర్ గా, తహసిల్దార్, ఎంఈఓ,స్కూల్ గేమ్ ఫెడరేషన్ తరపున ఒకరు సభ్యులుగా ఉంటారని చెప్పారు.మండల స్థాయి క్రీడా పోటీల అనంతరం జిల్లా స్థాయిలో ఈ నెల16 నుండి 21 వరకు 5 రోజులపాటు సీఎం క్రీడా కప్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా కమిటీ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన,ఎస్పీ వైస్ చైర్మన్ గా,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కోవైస్ చైర్మన్గా ఉంటారని, స్పెషల్ ఆఫీసర్,ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, డిఈఓ, జిఎం ఇండస్ట్రీస్, మున్సిపల్ కమిషనర్,ఎస్జీఎఫ్ డిస్టిక్ ఆర్గనైజింగ్ సెక్రటరీ,డిపిఆర్ఓ, సీఈవో,డి ఐ ఓ ఆధ్వర్యంలో ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. అన్నిస్థాయిలో క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రత్యేకించి పోటీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి క్రీడాకారులను ప్రోత్సహించాలని ముఖ్యంగా 2028 లో నిర్వహించనున్న ఒలింపిక్స్ లో రాష్ట్రం నుండి మెడల్స్ సాధించే దిశగా క్రీడా కారులను తయారు చేయాలని ఆమె ఆదేశించారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్ఓ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్,జిల్లా నూతన స్పోర్ట్స్ అధికారి నర్సిరెడ్డి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# విద్యతో దేనినైనా సాధించవచ్చు

## భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాచలం, డిసెంబర్ 2 (జనంసాక్షి):** విద్య ఉంటే దేనినైనా సాధించవచ్చు అని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సోమవారం దుమ్ముగూడెం మండలం నరసాపురంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవంలో ఆయన పాల్గొని వాలీబాల్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటపాటలు కూడా ముఖ్యమని తెలియచేసారు. పాఠశాలలో ఐ టి సి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మంచినీటి సౌకర్యాన్ని ఎమ్మెల్యే తన చేతుల ప్రారంభించారు. అనంతరం పాఠశాలలోని వంట షెడ్ వద్ద ఇంకుడు గుంట ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రత్నకుమారి మాట్లాడుతూ పాఠశాలలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అందరి సమక్షంలో హామీ ఇచ్చారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రావులపల్లి రవి, మాజీ జడ్పిటిసి సత్యాలు, హెచ్ఎం బెక్కంటి శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రత్నకుమారి, ఐటీసీ ఎం ఎస్ కే ప్రాజెక్ట్ ఆఫీసర్ జయప్రకాష్, వాష్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బాలకృష్ణ, సిబ్బంది సునీల్ బాబు, వెంకట్, మల్లి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్గొండ బ్యూరో, డిసెంబర్ 2,(జనంసాక్షి)** ఫిర్యాదుదారులను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమె ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ అనవసరంగా కాలయాపన చేయకుండా ఫిర్యాదుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా ఫిర్యాదులు పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె పునరుద్ధరించారు. కాగా ఈ సోమవారం (66) మంది పిర్యాదుదారులు వారి ఫిర్యాదును సమర్పించారు. ఎప్పటిలాగే ఈ సోమవారం సైతం వ్యక్తిగత ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. అందులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు, భూములకు సంబంధించిన అంశాలు,తదితర ఫిర్యాదులు ఉన్నాయి. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్ఓ అమరెందర్,స్పెషల్ కలెక్టర్ నటరాజ్,జిల్లా అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

## త్వరితగతిన పరిష్కరించాలి

**కలెక్టర్ హనుమంతరావు**

**భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 2 (జనంసాక్షి)** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. సోమ వారం నాడు జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 64 దరఖాస్తులను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 39, జిల్లా పంచాయతీ అధికారి 10, శిశు సంక్షేమ 5, విద్యాశాఖ 2, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2 , ఇఇ ఇరిగేషన్, వైద్య ఆరోగ్య మున్సిపాలిటీ, దేవాదాయ శాఖ, ఫుడ్ ఇన్స్పెక్టర్, పోలీస్ నుండి ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్,జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శోభారాణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్ ప్రసాద్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# పోలీస్ విధులు చాలా ప్రత్యేకమైనవి

- ప్రజలకు సేవలు అందించడానికి పోలీస్ ఉద్యోగం చక్కని అవకాశం
- లక్ష్యాలు, సవాళ్లతో కూడినది పోలీస్ ఉద్యోగం
- లక్ష్యంతో పనిచేసి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలి
- క్రిమినల్స్ పట్ల కఠినంగా ఉండాలి
- నూతన కానిస్టేబుళ్లకు పోలీస్ స్టేషన్ ల కేటాయింపు
- విధుల నియామక పత్రాలు అందించిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్





**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** పోలీస్ విధులు చాలా ప్రత్యేకమైనవని, ప్రజలకు సేవలు అందించడానికి పోలీస్ ఉద్యోగం చక్కని అవకాశమని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ రిక్రూట్మెంట్ నందు ఉద్యోగం పొంది 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 281 మంది నూతన కానిస్టేబుల్స్ జిల్లాకు వచ్చారు. ఇందులో 197 మంది సివిల్ కానిస్టేబుల్స్, 84 మంది ఏఆర్ కానిస్టేబుల్స్ ఉన్నారు. జిల్లాకు వచ్చిన 281 మంది నూతన కానిస్టేబుళ్లకు జిల్లా కేంద్రంలో గల ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియం నందు జరిగిన కార్యక్రమంలో విధుల నియామక పత్రాలను, పోలీస్ స్టేషన్ నియామక పత్రాలను ఆయన అందించి, నియామక పత్రాలు పొందిన నూతన కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలిపారు.విధుల నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. సివిల్ విభాగంలో పురుషులు 129 మంది, మహిళలు 68 మంది, ఏఆర్ విభాగంలో పురుషులు 65 మంది, మహిళలు 19 మంది ఉన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో పోలీసు విధులు అనేవి చాలా ప్రత్యేకమైనవి, ఇతర శాఖల విధులతో పోలిస్తే పోలీసు డ్యూటీ క్లిష్టమైనదన్నారు. సవాళ్లతో, లక్ష్యాలతో కూడినదన్నారు. విధుల నిర్వర్తించే సమయంలో సమాజం దృష్టి పోలీసు సిబ్బందిపై ఉంటుందన్నారు.యూనిఫాంలో క్రమశిక్షణతో బాధ్యతగా, ఆదర్శంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. ప్రజలకు సేవలు అందించడానికి పోలీసు ఉద్యోగం మంచి మార్గమన్నారు. క్రిమినల్స్ పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే సాధారణ ప్రజలతో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలని ఆదేశించారు. సమస్యలతో బాధితులు పోలీసు స్టేషన్ కు వస్తారని, అలాంటి వారికి ధైర్యం, భరోసా కల్పించాలని అన్నారు.మన ప్రవర్తన, మన విధుల వల్ల మన తల్లిదండ్రులకు, పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు.అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అందరికీ సమాన సేవలు అందించాలన్నారు.బాగా పని చేసే వారికి సమాజంలో గుర్తిపు ఉంటుందని, రివార్డులు అందిస్తామన్నారు.క్రమశిక్షణ లేకుండా ప్రజలను ఇబ్బందులు పెడితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.శిక్షణలో నేర్చుకున్నవన్ని అన్ని గుర్తు పెట్టుకోవాలని, ఎలాంటి విధులైనా నిర్వర్తించే విధంగా మానసిక దృఢత్వంతో, ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలని అన్నారు, వత్తిడి లేకుండా పని చేయాలని విధులతో పాటుగా ఆరోగ్యం కాపాడుకోవాలని పేర్కొన్నారు.పని చేసే చోట సీనియర్స్ ను గౌరవించాలని క్షేత్రస్థాయిలో సమస్యలను అధిగమించడం, పరిష్కరించడం నేర్చుకోవాలన్నారు.సాంకేతికత బాగా అభివృద్ధి చెందినది సోషల్ మీడియా బాగా ప్రాచుర్యంలో ఉందని,యూనిఫామ్ లో ఉండి సెల్ఫీ వీడియోలు రీల్స్ లాంటివి సోషల్ మీడియా నందు పెట్టవద్దని తెలిపారు. విధుల నిర్వహణలో పురుషులు మహిళలు అందరూ సమానమేనని, అన్ని విధులు అందరూ నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. లక్ష్యంతో పనిచేసి అక్రమ రవాణాను, అసాంఘిక కార్యకలాపాలను నివారించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడంలో, డ్రగ్స్ నివారించడంలో, సైబర్ మోసాలను నివారించడంలో, మహిళలకు రక్షణ కల్పించడం బాగా పని చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం నందు ఆర్మ్డ్ అదనపు ఎస్పీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విధంగా క్రమశిక్షణతో ఉంటూ విధులు నిర్వర్తించాలని, సమయానికి విధులకు చేరుకోవాలన్నారు.ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి నరసింహచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, ఆర్మ్డ్ ఇన్స్పెక్టర్స్ నారాయణ రాజు, నరసింహ, సూర్యాపేట టౌన్ సీఐ రాజశేఖర్, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, అన్వర్, నూతన కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# 2047 నాటికి విక్షిత్ భారత్ లక్ష్యం

- ఉద్యోగుల శిక్షణకు స్వదేశీ ఫ్రేమ్‌వర్క్
- వికాస్, గర్వ, కర్తవ్య, ఐక్యత అనే నాలుగు సందేశాలతో రూపకల్పన
- హెచ్‌ఆర్ సభ్యుడు ఆర్ బాలసుబ్రహ్మణ్యం వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబర్ 2 (జనంసాక్షి) :** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారి భారతదేశంలో నైపుణ్యాభివృద్ధికి స్వదేశీ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది కేంద్ర ప్రభుత్వం. 2047 నాటికి విక్షిత్ భారత్ అనే మోదీ గారి లక్ష్యానికి అనుగుణంగా ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించారు. ఆధునిక బ్యూరోక్రసీకి శిక్షణ ఇవ్వడానికి 2021లో ప్రధాని మోదీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ద్వారా దీనిని డెవలప్ చేశారు. కర్మయోగి కాంపిటెన్సీ ఫ్రేమ్ వర్క్ పేరుతో రూపొందించిన ఈ కోర్సు.. ముస్సూరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌తో సహా ప్రభుత్వ శిక్షణా అకాడమీలలో కోర్సులు, వర్క్‌షాప్‌లకు పునాదిగా ఉపయోగిస్తున్నారు. ఈ ఫ్రేమ్‌వర్క్‌లో అంశాలను భగవద్గీతలోని అంశాల ఆధారంగా పేర్కొన్నారు. సహకారం, స్వాధ్యాయ, రాజ్య కర్మ, స్వధర్మం అనే నాలుగు ప్రధాన ధర్మాలను పెంపొందించడానికి ఈ ఫ్రేమ్ వర్క్‌లో అంశాలను ప్రస్తావించారు. 3.2 మిలియన్ల మంది పౌర సేవలకు శిక్షణిచ్చేందుకు ఈ మొట్టమొదటి మేడ్ ఇన్ ఇండియా మాడ్యుల్‌ను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుకు శిక్షణ ఇచ్చేందుకు ఈ మాడ్యుల్‌ను రూపొందించారు. ఈ విషయమై కెపాసిటీ బిల్డింగ్ కమిషన్‌లోని హెచ్‌ఆర్ సభ్యుడు ఆర్ బాలసుబ్రహ్మణ్యం పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. బ్యూరోక్రసి శిక్షణా ఫ్రేమ్‌వర్క్ విషయంలో ఇప్పటి వరకు పశ్చిమ దేశాలను అనుకరిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు స్వంత ఫ్రేమ్ వర్క్‌ను ఉపయోగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఫ్రేమ్ వర్క్ భారతీయ నాలెడ్జ్ సిస్టమ్, భగవద్గీత సూత్రాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈ ఫ్రేమ్ వర్క్‌ను డెవలప్ చేయడానికి 18 నెలలకు పైగా సమయం తీసుకున్నామని బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ ఫ్రేమ్ వర్క్ దాదాపు 60 మంత్రిత్వ శాఖలు, 93 విభాగాలతో పాటు వాటి కింద 2,600 పైగా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అవసరాలను తీర్చాలని భావిస్తోంది. కమిషన్ ప్రతి ఉద్యోగి వారి సంబంధిత పని విభాగాలలోని పాత్రలను మ్యాప్ చేసిందని, ఆశించిన ఫలితాలను సాధించడానికి అవసరమైన నిర్దిష్ట సామర్థ్యాలను గుర్తించిందని డాక్టర్ ఆర్ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఫ్రేమ్‌వర్క్‌లోని అంశాలపై కమిషన్ ఎలా నిర్ణయం తీసుకుందనే దానిపై బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. 'భారతదేశ భవిష్యత్తును నిర్దేశించడానికి ప్రధాని మోదీ చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకున్నాము. ప్రధాని మోదీ చెప్పిన వికాస్, గర్వ, కర్తవ్య, ఐక్యత అనే నాలుగు సందేశాలను గుర్తించాము. ఈ నాలుగు తీర్మానాలను సాధించడానికి, ప్రభుత్వ అధికారులు నాలుగు పునాది విలువలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని మా పరిశోధనలో తేలింది. వీటికి అనుగుణంగా ఫ్రేమ్ వర్క్‌ను డిజైన్ చేశామని' చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే ఫ్రేమ్‌వర్క్ అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు భౌతికంగా శిక్షణను అందించడానికి వార్షిక జాతీయ అభ్యాస వారోత్సవాన్ని నిర్వహించాలని కేంద్రం యోచిస్తోంది. ఇటీవల ఢిల్లీలో ఈవారం మొదటి ఎడిషన్ ముగిసింది. ఇందులో కేంద్ర, రాష్ట్రాలల నుంచి 4.8 మిలియన్ల మంది పౌర సేవకులను ఆకర్షించింది. 43 శాతం మంది కనీసం నాలుగు కోర్సులను పూర్తి చేసారు.







## 400 నగరాలకు స్విగ్గీ విస్తరణ

- పది నిమిషాల ఫుడ్ డెలివరీ సేవల విస్తరణ..!

**బెంగళూరు, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ల మధ్య రోజురోజుకు పోటీ పెరుగుతోంది. బెంగళూర్ కేంద్రంగా కస్టమర్లకు ఫుడ్ డెలివరీ సేవలందిస్తున్న యాప్ 'స్విగ్గీ' తన సేవలను విస్తరిస్తోంది. తన పది నిమిషాల ఫుడ్ డెలివరీ సర్వీస్ 'బోల్ట్' సేవలను దేశంలోని 400 పై చిలుకు నగరాలకు విస్తరిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. తొలి దశలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబై, పుణె నగరాల్లో స్విగ్గీ తన బోల్ట్ సేవలను ప్రారంభించింది. క్విక్ కామర్స్ డార్క్ స్టోర్స్ గల జెప్టో గత నెలలో లిమిటెడ్ ఫుడ్ ఐటమ్స్ తో కేఫ్ బిజినెస్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. బెంగళూరులోనే స్విష్ ' అనే పది నిమిషాల ఫుడ్ డెలివరీ యాప్.. బెంగళూరు నగర పరిధిలోనూ, ఇతర ప్రథమ శ్రేణి నగరాల్లో సేవల విస్తరిస్తోంది. ఇందుకోసం ఎసెల్ నుంచి 20 లక్షల డాలర్ల సీడ్ ఫండ్ సేకరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బోల్ట్ సేవలకు ఆదరణ ఎక్కువగా ఉంటుందని స్విగ్గీ వెల్లడించింది. తర్వాత హర్యానా, తమిళనాడు, గుజరాత్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల పరిధిలో బోల్ట్ సేవలకు కస్టమర్ల నుంచి ఆదరణ ఉందని వివరించింది. తక్కువ సమయంలో తయారయ్యే ఆహార పదార్థాలను మాత్రమే బోల్ట్ కింద డెలివరీ చేస్తామని స్విగ్గీ తెలిపింది. ఈ తరహా ఆర్డర్లకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా సంబంధిత రెస్టారెంట్లతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు వివరించిది. డెలివరీ బాయ్స్ భద్రతను దృష్టిలో పెట్టుకుని సాధారణ, బోల్ట్ ఆర్డర్ల డెలివరీ గురించి తెలియజేయడం లేదని పేర్కొంది. ప్రస్తుతం రెండు కి.మీ పరిధిలో మాత్రమే బోల్ట్ సేవలను పరిమితం చేశామని, భవిష్యత్ లో విస్తరిస్తామని వివరించింది. ఈ బోల్ట్ ఆర్డర్ల డెలివరీ కోసం డెలివరీ బాయ్స్‌కు ఎటువంటి అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వట్లేదని స్పష్టం చేసింది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

- 80వేల మార్క్‌ని దాటిన సెన్సెక్స్



**ముంబయి, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఇటీవల వరుస నష్టాలతో ఒడిదుడుకులను ఎదుర్కొన్న మార్కెట్లు సోమవారం లాభాల బాటలో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో పాటు పెరిగిన కొనుగోళ్లతో.. సెన్సెక్స్ ప్రారంభంలోనే 500 పాయింట్లకుపైగా పెరిగింది. ముఖ్యంగా చివర సెషన్‌లో మార్కెట్లలో కొనుగోళ్లు కనిపించడంతో సెన్సెక్స్ 80వేల పాయింట్ల మార్క్‌ను దాటింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 79,743.87 పాయింట్ల వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 79,308.95 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 80,337.82 పాయింట్లకు పెరిగింది. చివరకు 445.29 పాయింట్ల నష్టంతో 80,248.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 142.90 పాయింట్ల లాభంతో 24,274 వద్ద ముగిసింది. నిఫ్టీలో అల్ట్రాటెక్ సిమెంట్, అపోలో హాస్పిటల్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, శ్రీరామ్ ఫైనాన్స్ అత్యధికంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎల్‌అండ్‌టీ నష్టపోయాయి. రియాల్టీ, ఫార్మా, మెటల్, ఆటో, మీడియా ఒకశాతం శాతం వృద్ధితో లాభాల్లో ముగిశాయి. బీబిఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం శాతం చొప్పున పెరిగాయి.

## డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ 4 రెట్లు పెంచిన ఓలా..

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** భారతదేశంలో ఈవీ రంగంలో పెద్ద మార్పులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పోటీ సైతం ఎక్కువగానే ఉన్నందున దీనిని తట్టుకునేందుకు, కస్టమర్లకు మరింతగా చేరువకావాలని ఓలా నిర్ణయించింది. ఈ క్రమంలో కంపెనీ తన స్టోర్ల ఏర్పాటుతో పాటు సర్వీస్ మెరుగుపరచటంపై దూకుడు పెంచింది. దేశంలో అతిపెద్ద ఈవీ టూవీలర్ తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ డిసెంబర్ 20, 2024 నాటికి తన స్టోర్ నెట్‌వర్క్‌ను 4,000కి పెంచింది. 3,200కి పైగా కొత్త స్టోర్లు తెరవబోతున్నందున ఓలా దేశంలోని అన్ని పిన్‌కోడ్‌లను కవర్ చేస్తూ అతిపెద్ద ఈవీ పంపిణీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది. ఇది దేశంలో యాక్సెస్, వృద్ధి, స్వీకరణను ప్రోత్సహిస్తుంది. దేశవ్యాప్తంగా కంపెనీ సర్వీస్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తూ.. కొత్తగా ప్రారంభించిన అన్ని స్టోర్‌లు సర్వీసె ఫెసిలిటీలతో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో కంపెనీ తన స్టోర్లను ఏకంగా నాలుగు రెట్ల వేగంతో విస్తరించింది. దేశం ప్రస్తుతం ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు వేగంగా కదులుతోందని ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భవిష్ అగర్వాల్ పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా తాము స్టోర్ నెట్‌వర్క్ విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో విస్తృత డీ2సీ నెట్‌వర్క్‌తో పాటు నెట్‌వర్క్ పార్టనర్ ప్రోగ్రామ్ కింద టచ్‌పాయింట్‌లు, టైర్1 నగరాలను దాటి దేశం మొత్తాన్ని కవర్ చేయనున్నట్లు వెల్లడించారు. కంపెనీ ఓలా గిగ్, ఓలా గిగ్ ప్లస్, ఓలా ఎస్1 జెడ్, ఓలా ఎస్1 జెడ్ ప్లస్లతో కూడిన దాని గిగ్, ఎస్1 జెడ్ స్కూటర్ శ్రేణిని ప్రారంభించినట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. వీటి ధరలు సాధారణ మధ్యతరగతి వినియోగదారులకు అందుబాటులో రూ.40 వేల నుంచి రూ.65 వేల మధ్య ఉంటాయని కంపెనీ వెల్లడించింది. ఇది గ్రామీణ, సెమీ అర్బన్ కస్టమర్లను టార్గెట్ చేసి విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటి డెలివరీలను 2025 ఏప్రిల్-మే మధ్య నుంచి ప్రారంభించాలని చూస్తోంది.

# జాతీయం అంతర్జాతీయం

## మహారాష్ట్ర బీజేపీ ఎల్పీ పరిశీలకుల నియామకం

- పరిశీలకులుగా నిర్మలా సీతారామన్, విజయ్ రూపానీ
- నూతన ప్రభుత్వ ఏర్పాటును పర్యవేక్షించనున్న ఇరువురు
- సీఎంగా ఫడ్నవీస్ దాదాపుగా ఖరారు!

**న్యూఢిల్లీ, నవంబర్ 2(జనంసాక్షి) :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి భారీ విజయం సాధించినప్పటికీ, సీఎం పదవి ఎవరు చేపట్టాలన్న అంశం కారణంగా ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యమైంది. దీనిపై బీజేపీ హైకమాండ్ దృష్టి సారించడంతో... మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వచ్చిన తొమ్మిది రోజుల తర్వాత ప్రభుత్వ ఏర్పాటు ఓ కొలిక్కి రానుంది. ఈ క్రమంలో బీజేపీ అధిష్ఠానం ఇద్దరు పరిశీలకులను నియమించింది. మహారాష్ట్ర బీజేపీ ఎల్పీ పరిశీలకులుగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీలను ప్రకటించారు. వీరిద్దరూ ముంబయి వెళ్లి మహారాష్ట్ర నూతన ప్రభుత్వ ఏర్పాటును పర్యవేక్షించనున్నారు. మహా సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్ దాదాపుగా ఖరారైనట్టే. నూతన సీఎం బీజేపీ నుంచే వస్తారని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ఇప్పటికే తమ వైఖరి వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఫడ్నవీస్ పేరును ప్రకటించడం లాంఛనమే. గురువారం నాడు ప్రమాణస్వీకారోత్సం ఉంటుందని సమాచారం. ముంబయిలోని ఆజాద్ మైదాన్ లో ఆ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ భవాంకులే, బీజేపీ ఎమ్మెల్సీ ప్రవీణ్ దరేకర్ ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లను నేడు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయస్థాయి అగ్రనేతలు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతారని తెలుస్తోంది.

# కుమారుడికి బైడెన్ క్షమాభిక్ష

- అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే ముందు ఆశ్చర్యకర చర్య



**వాషింగ్టన్, డిసెంబర్ 2 (జనంసాక్షి) :** మరికొన్ని రోజుల్లో పదవి నుంచి దిగిపోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కుమారుడు హంటర్ బైడెన్‌కు భారీ ఊరట కల్పించారు. రెండు క్రిమినల్ కేసుల్లో హంటర్‌కు బైడెన్ క్షమాభిక్ష ప్రసాదించారు. తండ్రిగా, అధ్యక్షుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో ప్రజలు అర్థం చేసుకుంటారని భావిస్తున్నట్టు ఈ సందర్భంగా బైడెన్ పేర్కొన్నారు.

అక్రమంగా తుపాకీ కొనుగోలు, ఆదాయపు పన్ను విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారని డెలావెర్, కాలిఫోర్నియాలో హంటర్‌పై కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఆయుధం కొనుగోలు వ్యవహారంలో నమోదైన కేసులో హంటర్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చింది. అయితే, ఇప్పటి వరకూ శిక్ష మాత్రం ఖరారు చేయలేదు. దీనిపై అప్పట్లో బైడెన్ స్పందిస్తూ.. హంటర్ దోషిగా తేలిన సమయంలో క్షమాభిక్షకు యత్నించబోనని స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడు మాత్రం అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే సమయంలో కుమారుడికి క్షమాభిక్ష ప్రసాదించే అవకాశాన్ని వినియోగించుకున్నారు. బైడెన్ నిర్ణయం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జనవరి 20న రెండోసారి అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

### బైడెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు..
### హంటర్‌కు క్షమాభిక్షపై ట్రంప్ స్పందన

మరికొన్ని రోజుల్లో పదవి నుంచి దిగిపోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తనకున్న అధికారాలతో కుమారుడు హంటర్ బైడెన్ కు భారీ ఊరట కల్పించిన విషయం తెలిసిందే. తుపాకీ కొనుగోలు, పన్ను ఉల్లంఘనలకు సంబంధించిన ఆరోపణలపై దోషిగా తేలిన తన కుమారుడు హంటర్‌కు బైడెన్ క్షమాభిక్ష ప్రసాదించారు. బైడెన్ నిర్ణయంపై డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇది పూర్తిగా న్యాయవిరుద్ధమని, బైడెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తీవ్రంగా మండిపడ్డారు.

ఈ మేరకు తన ట్రూత్ సోషల్‌లో ట్రంప్ ఓ పోస్ట్ పెట్టారు. 'హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదించినట్లే ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్న జే-6 బందీలకు ఎందుకు ఉపశమనం కల్పించలేదు..? కుమారుడి విషయంలో బైడెన్ తీసుకున్న నిర్ణయం పూర్తిగా న్యాయవిరుద్ధం, అధికార దుర్వినియోగం' అని ట్రంప్ పోస్ట్ పెట్టారు. జే-6 బందీలు అంటే 2021 జనవరి 6న క్యాపిటల్ హిల్‌లో ట్రంప్ తరఫున అల్లర్లలో పాల్గొన్నవారు. బైడెన్ విజయాన్ని ధ్రువీకరించేందుకు వాషింగ్టన్ క్యాపిటల్ భవనంలో కాంగ్రెస్ సమావేశమైన సమయంలో ట్రంప్ మద్దతుదారులు వేలాదిగా క్యాపిటల్ భవనంలోకి దూసుకొచ్చి విధ్వంసం సృష్టించారు. ఈ దాడిలో 140 మందికిపైగా పోలీసు అధికారులు గాయపడ్డారు. అక్రమంగా తుపాకీ కొనుగోలు, ఆదాయపు పన్ను విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారని డెలావెర్, కాలిఫోర్నియాలో హంటర్ బైడెన్‌పై కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఆయుధం కొనుగోలు వ్యవహారంలో నమోదైన కేసులో హంటర్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చింది. అయితే, ఇప్పటి వరకూ శిక్ష మాత్రం ఖరారు చేయలేదు. దీనిపై అప్పట్లో బైడెన్ స్పందిస్తూ.. హంటర్ దోషిగా తేలిన సమయంలో క్షమాభిక్షకు యత్నించబోనని స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పుడు మాత్రం అధ్యక్ష పీఠం నుంచి దిగిపోయే సమయంలో కుమారుడికి క్షమాభిక్ష ప్రసాదించే అవకాశాన్ని వినియోగించుకున్నారు. బైడెన్ నిర్ణయం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్ని పార్టీల లోక్‌సభాపక్ష నేతలతో భేటీ



**న్యూఢిల్లీ, నవంబర్ 2 (జనంసాక్షి) :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్ని పార్టీల లోక్‌సభాపక్ష నేతలతో సమావేశమయ్యారు. పార్లమెంట్‌లోని లోక్‌సభ స్పీకర్ ఛాంబర్ సమావేశం జరుగుతోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమై ఐదు రోజులవుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి సభాకార్యకలాపాలు జరగకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టడం, స్పీకర్ సభను వాయిదా వేయడం జరుగుతోంది. దాంతో పార్లమెంట్‌లో చర్చ చేపట్టడం ప్రభుత్వానికి ఇష్టం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓంబిర్లా అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఈ సమావేశం కొనసాగుతోంది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్లను స్పీకర్ కోరనున్నట్లు సమాచారం. కాగా పార్లమెంట్‌లో గౌతమ్ అదానీ వ్యవహారంపైన, మణిపూర్ అంశంపైన, సంభాల్, అజ్మేర్ ఘటనలపైన, నిరుద్యోగ సమస్యపైన ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. గత ఐదు రోజులుగా ప్రతిపక్షాలు ఇవే అంశాలపై చర్చకు పట్టుబడుతుండగా స్పీకర్ సభను వాయిదా వేస్తూ వస్తున్నారు. ఇవాల్టి ఫ్లోర్ లీడర్ల సమావేశం తర్వాతనైనా లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగుతాయో లేదో చూడాలి.

## ఆప్‌లో చేరిన ప్రముఖ ఎడ్యుకేటర్ అవధ్ ఓఝా



**న్యూఢిల్లీ, నవంబర్ 2 (జనంసాక్షి) :** ప్రముఖ ఎడ్యుకేటర్ అవధ్ ఓఝా ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్, సీనియర్ నాయకుడు మనీష్ సిసోడియా సమక్షంలో ఓఝా ఆప్ తీర్థం పుచ్చుకున్నారు. అర్వింద్ కేజ్రీవాల్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఓఝా మీడియాతో మాట్లాడుతూ.. విద్య అనేది కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఆత్మ లాంటి మాధ్యమమని అన్నారు. రాజకీయాల్లో చేరి విద్యాభివృద్ధికి కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించిన అర్వింద్ కేజ్రీవాల్‌కు, మనీష్ సిసోడియాకు అవధ్ ఓఝా కృతజ్ఞతలు తెలిపారు. 'ఇవాళ నేను రాజకీయాల్లో అడుగుపెడుతున్న సందర్భంగా మీతో ఒక విషయం స్పష్టం చేయదల్చుకున్నాను. నేను రాజకీయాలు, ఎడ్యుకేషన్‌లో ఏదో ఒకటి మాత్రమే ఎంచుకోవాల్సి వస్తే కచ్చితంగా ఎడ్యుకేషన్‌నే ఎంచుకుంటాను' అని ఓఝా చెప్పారు. రాజకీయాల్లో చేరడం ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేయాలని తాను ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నానని ఓఝా తెలిపారు. ఓఝా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసే అభ్యర్థులకు శిక్షణ ఇస్తుంటారు. ఆయన దగ్గర శిక్షణ తీసుకున్న ఎంతో మంది ఉద్యోగార్థులు పెద్దపెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు.

### డివైడర్ నుంచి జంప్ చేసిన కారు

**అహ్మదాబాద్, నవంబర్ 2 (జనంసాక్షి) :** మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు డ్రైవ్ చేశాడు. ఆటోను తప్పించబోయి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో గాల్లోకి లేచిన ఆ కారు అవతల రోడ్డులోకి జంప్ చేసింది. ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. దానిపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం అర్ధరాత్రి వేళ నరోడా-దేహ్‌గామ్ రోడ్డులో హ్యుందాయ్ క్రెటా కారు వేగంగా ప్రయాణించింది. ముందున్న ఆటోను ఓవర్ టేక్ చేసేందుకు కారు డ్రైవర్ ప్రయత్నించాడు. కాగా, ఆ కారు అదుపుతప్పింది. డివైడర్ పైనుంచి దూకి అవతల రోడ్డులోకి వెళ్లింది. కొన్ని సెకన్లు గాలిలో ఉన్న ఆ కారు ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. దానిపై ప్రయాణించిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి మరణించారు. మరోవైపు ఇది చూసి స్థానికులు షాక్ అయ్యారు. వెంటనే కారు వద్దకు వెళ్లారు. కారును ర్యాష్‌గా డ్రైవ్ చేసిన డ్రైవర్ గోపాల్ పటేల్‌ను పట్టుకుని కొట్టారు. ఈ ప్రమాదం గురించి తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులకు అతడ్ని అప్పగించారు. కారు డ్రైవర్ గోపాల్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడ్ని అరెస్ట్ చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులను 26 ఏళ్ల అమిత్ రాథోడ్, 27 ఏళ్ల విశాల్ రాథోడ్‌గా గుర్తించారు. మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## రోడ్డు ప్రమాదంలో ఐపీఎస్ అధికారి మృతి

**న్యూఢిల్లీ, నవంబర్ 2 (జనంసాక్షి) :** శిక్షణ పూర్తి చేసుకొని డ్యూటీలో చేరేందుకు వెళ్తున్న ఓ ఐపీఎస్ ఆఫీసర్‌ని మృత్యువు వెంటాడింది. రోడ్డు ప్రమాదంలో సదరు ఆఫీసర్ ప్రాణాలు కోల్పోయాడు. విధుల్లో చేరాల్సిన అతను విగతజీవిగా మార్చురీలో చేరాడు. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రంలో చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన హర్ష వర్ధన్ (26) సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధించి ఐపీఎస్ ఎంచుకున్నారు. కర్ణాటక కేడర్‌లో ఐపీఎస్‌కు ఎన్నికైన అతను.. మైసూరులోని కర్ణాటక పోలీస్ అకాడమీలో తన నాలుగు వారాల శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో హసన్ జిల్లాలో ప్రొబేషనరీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా అతనికి తొలి పోస్టింగ్ వచ్చింది. సోమవారం డ్యూటీలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. దీంతో అతను ఆదివారం రాత్రి అక్కడికి పయనమయ్యారు. ఇంతలో మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో వెంటాడింది. సోమవారం తెల్లవారుజామున ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. కారు టైరు ఒక్కసారిగా పేలింది. అనంతరం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇంటిని, ఆపక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో హర్ష వర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రమాద తీవ్రత కారణంగా అతను చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
03.12.2024

## సంక్షిప్తంగా..



### ఎమ్మెల్సీ కవితను కలిసిన ఎడపల్లి మండల నాయకులు

ఎడపల్లి డిసెంబర్2 (జనంసాక్షి) : నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ కల్వకుంట కవితను సోమవారం ఎడపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉండి నాగేందర్ రెడ్డి, దుబ్బాక రవీందర్ గౌడ్, గడ్డం శ్రీనివాస్, పరిగె సుమన్, మహబూబ్, మహేందర్ రెడ్డి, కొండ సాయన్న, కృష్ణ, అల్తాఫ్, ఒడ్డేర సాయిలు, మంగళపాడ్ సురేష్, అహ్మద్ తదితరులు ఎమ్మెల్సీని కలిశారు.

### అక్రమకేసు నమోదు.. న్యాయవాదుల విధుల బహిష్కరణ



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): వేములవాడ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న నక్క దివాకర్ పై బోయినపల్లి పోలీస్ స్టేషన్లో అక్రమ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం వేములవాడ కోర్టు విధులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ ఈ న్యాయవాదులపై అక్రమ కేసుల నమోదు పరిపాటిగా మారిపోయిందన్నారు. కేసు నమోదు చేసే క్రమంలో విచారణ చేయాల్సిన పోలీసు అధికారులు విచారణ చేయకుండా ప్రాక్టీస్ న్యాయవాదిపై అక్రమ కేసు నమోదు చేయడం దారుణమన్నారు. న్యాయవాదిపై పెట్టిన అక్రమ కేసును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్, న్యాయవాదులు సత్యనారాయణ, విద్యాసాగర్ రావు పొత్తూరి అనిల్ కుమార్, అంజయ్య, మధు, సంపత్, అంజయ్య, సత్యనారాయణ రెడ్డి, శంకరయ్య, మనోహర్, శ్రీనివాస్, మహేందర్, రాజు కుమార్, నర్సింగ రావు, మహేష్ రాజశేఖర్, మల్లేష్, శ్రీకాంత్, సుజాత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

### అనుమతిలేని నిర్మాణాలకు జరిమానా



డిఎల్పిఓ శివకృష్ణ

ఆర్మూర్(జనంసాక్షి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతికి విరుద్ధంగా నిర్మించిన కమర్షియల్ నిర్మాణానికి రెండు మూడు రోజుల్లో జరిమానాలు విధిస్తామని డిఎల్పిఓ శివకృష్ణ తెలిపారు. అంకాపూర్ లో 63వ జాతీయ రహదారి పక్కన గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకున్నారన్నారు. ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని వ్యాపార సముదాయాలు నిర్మించినందున డిటిసిపి నిబంధనల మేరకు జరిమానా విధిస్తామన్నారు. అనుమతికి విరుద్ధంగా భవనాలను నిర్మించిన గ్రామ కార్యదర్శి తన దృష్టికి తీసుకు రాలేదన్నారు. గ్రామ కార్యదర్శితో మాట్లాడి మరిన్ని వివరాలు సేకరించి జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఇప్పటినుంచి గ్రామపంచాయతీ ద్వారా తీసుకున్న అనుమతి ప్రకారం ఇంటి నిర్మాణాలు చేయాలని ఆయన యజమానులకు సూచించారు.

### బీఆర్ఎస్వి నాయకుల గురుకుల పర్యటన



కరీంనగర్ ప్రతినిధి(జనంసాక్షి) కరీంనగర్ నియోజకవర్గం లో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కరీంనగర్ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా కో ఆర్డినేటర్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని సుమారుగా 10 గురుకుల, కేజీబీవీ మోడల్ స్కూల్ లను సందర్శించారు. వివిధ రకాల సమస్యలను విద్యార్థులు తెలియజేసినారనీ, వాటిని ఒక నివేదిక రూపంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కమిటీకి అందజేస్తున్నామని, వాటన్నింటిని కలిపి రాబోవు అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి బిఆర్ఎస్ నివేదించబోతుందనీ కావున అన్ని గురుకులాల్లో వారి సమస్యలను బిఆర్ఎస్వి నుండి వచ్చే ప్రతినిధులకు తెలియజేయాలని చెప్పామని అనిల్ కుమార్ గౌడ్ అన్నారు. సమస్యల పైన ఒక నివేదిక తయారుచేసి ఎమ్మెల్యే గంగుల నేతృత్వంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీ కి అందజేయనున్నారు. రాబోవు రెండు మూడు రోజుల్లో గంగుల కమలాకర్ కూడా నగరం లోని వివిధ గురుకులాల పరిశీలనకు స్వయంగా వెళ్ళనున్నట్లు తెలియజేశారు. బి.ఆర్.ఎస్. వి నగర అధ్యక్షులు బొంకూరి మోహన్, టిఆర్ఎస్ వివిధ అనుబంధ సంఘాల నాయకులు మొగిలి గణేష్, జితేందర్, సతీష్, మహేందర్, సోహెల్, పరుశురాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రైవేటు, ప్రభుత్వ సమన్వయంతో పోటీపరీక్షలకు శిక్షణ

• జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 02 (జనంసాక్షి) : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమన్వయంతో విద్యార్థులకు పలు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కలెక్టోరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించేందుకు గాను ప్రైవేటు పాఠశాల యజమానులు చేయూతనివ్వాలని వారిని గతంలో కోరడం జరిగిందని తెలిపారు. ఇందుకు పలు ప్రైవేట్ సంస్థల యజమానులు ముందుకు వచ్చి ప్రభుత్వంతో పలు ఒప్పందాలు కుదుర్చుకోవడం అభినందనీయమని అన్నారు. పారమిత, అల్ఫోర్స్, సెయింట్ జార్జ్, వివేకానంద, సాధన, నందిని వంటి విద్యాసంస్థలు ఐఐటి, ఒలంపియాడ్, బాస్కెట్ బాల్, మోరల్ ఎడ్యుకేషన్ టిఎస్ఆర్ జె సి వంటి వివిధ పోటీలకు ప్రభుత్వ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ప్రైవేటుపాఠశాలలచైర్మన్లు పాల్గొన్నారు.

### మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ని వినియోగించుకోవాలి

కరీంనగర్ ప్రధాన ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్ ని ట్రాన్స్ జెండర్లు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మైత్రి ట్రాన్స్ క్లినిక్ లను, ప్రభుత్వ పారామెడికల్ నర్సింగ్ కళాశాలలను సోమవారం ప్రారంభించారు. కరీంనగర్ జిల్లాలోని కొత్తపెల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నర్సింగ్ కళాశాలను, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో మైత్రి ట్రాన్స్ క్లినిక్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా నుండి వర్చువల్ గా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవాలకు హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మైత్రి ట్రాన్స్ క్లినిక్ ను ఉద్దేశించి మాట్లాడారు. ట్రాన్స్ జెండర్ ల కోసం ఏర్పాటుచేసిన మైత్రి క్లినిక్ లో ట్రాన్స్ జెండర్లు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, ఆర్ఎంఓ నవీన, సఖి అడ్మిన్ లక్ష్మీ పాల్గొన్నాం



## 'సోయా' సమస్యను పరిష్కరించండి

• ప్రజావాణిలో రైతుల ఫిర్యాదు



బోధన్(జనంసాక్షి):సాలూర మండలంలోని హున్స, మంధర్న, ఖాజాపూర్ గ్రామాలకు చెందిన సోయా రైతులు సోయాపంట కొనుగోలులో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ ను ప్రజావాణిలో కలసి ఫిర్యాదు చేశారు. హున్స సహకార సంఘం చైర్మన్ మందర్న రవి ఆధ్వర్యంలో రైతులు జిల్లా కలెక్టర్ ను కలిశారు. సోయా పంటను ఆరబెట్టి సుమారు నేటికీ రెండు నెలల సమయం అయినప్పటికీ ఏదైతే కేంద్ర ప్రభుత్వం నాఫెడ్ ద్వారా తెలంగాణాలో, మార్క్ఫెడ్ ద్వారా సొసైటీల ద్వారా ప్రభుత్వం మద్దతు ధర రూ. 4892/- కొనుగోలు చేస్తున్న సందర్భంలో మా ప్రాంతంలో చాల మంది రైతులు పోయా పంటలు కొయ్యడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంలో చేనులో ఉన్న ఆకుల, అలముల పసరు సోయా గింజలకు అంటుకొని కొంత డిస్కలర్ అయినదని దాంతో సారంగాపూర్ గోడౌన్ అధికారులు ఇట్టి సోయా లారీలను తిప్పి పంపడం జరుగుతునదన్నారు. దీని మూలంగా అసలే ఈ యేడాది ప్రైవేటు మార్కెట్ లో కూడా కేవలం క్వింటాల్ సోయా రూ. 4000 - 4200 చొప్పున దళారులు కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటునారు. దీని మూలంగా సోయా రైతులు క్వింటాలకు. 800 చొప్పున ఎకరానికి రూ. 8000 రూపాయిల నష్టానికి గురికావలసి వస్తుందన్నారు. కావున తమరు పెద్ద మనసుతో సోయా రైతుల పట్ల సానుకూల స్పందించి వెంటనే హున్స సహకార సంఘం పరిధిలోని సోయా పంటను అధికారులతో మాట్లాడి సోయా పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు జరిగేటట్టు చూస్తారని రైతులు కోరారు. హున్స సహకార సంఘం అధ్యక్షులు మంధర్న రవి, వైస్ చైర్మన్ వినోద్ బాబా, సొసైటీ డైరెక్టర్లు ఖాజాపూర్ అశోక్, చింతం మైసయ్య, మూర్గే శంకర్, హున్స, మంధర్న, ఖాజాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సీఎం సభను విజయవంతం చేయాలి

కాంగ్రెస్ నాయకులు దొడ్డ బాలాజీ, చొప్పరి సదానందం



ముత్తారం డిసెంబర్ 02(జనంసాక్షి)పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే యువశక్తి బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ,మాజీ జడ్పిటిసి చొప్పరి సదానందం అన్నారు. రేపటి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య,ముత్తారం పిఎసిఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, గోవిందుల పద్మ ఆనంద్, కుమారస్వామి,వాజీద్ పాషా, శ్రీనివాస్,వినీత్ యాదవ్ , రజిత రఫీ,నాగేష్, సంపత్ రావు,శంకర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు ..

## దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

దుబ్బమల్లన్న స్వామి పెద్దపట్నం కార్యక్రమంలో పాల్గొన్న వొడితెల ప్రణవ్



జమ్మికుంట, డిసెంబర్ 2 (జనంసాక్షి): అత్యంత మహిమ కలిగిన కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం,మినీ కొమరవెల్లిగా పేరుగాంచిన దుబ్బ మల్లన్న ఆలయాన్ని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో గల దుబ్బ మల్లన్న ఆలయంలో జరిగిన పెద్దపట్నం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు,నాయకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని త్వరలోనే ఆలయ కమిటీలు నియమించి దేవాలయల అభివృద్ధికి మరింత తోడ్పాటును అందిస్తామని అన్నారు. ఇటీవల వేములవాడకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నిధులే ఇందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): పట్టణంలోని గురుకుల పాఠశాలను మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇబ్బంది కలగకుండా చూడాలనేదే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరికని, విద్యార్థులకు నాణ్యమైన రుచిక రమైన భోజనాన్ని పెట్టాలని, ఆదేశించారు, అలాగే మెనూ ప్రకారం భోజనాన్ని ఆకు కూరగాయలను, గుడ్లు,పప్పు, ఉండేటట్టు చూడాలని,పాఠశాల సిబ్బందికి సూచించి, మంచినీటి సౌకర్యం కూడా ఉండేటట్టు చూడాలని ఆదేశించారు,ఈ కార్యక్ర మంలో వార్డ్ కౌన్సిలర్ చాట్ల వంశీకృష్ణ,వనిత రామ్మోహన్, పిడుగు మమత, సాయిబాబా, పాఠశాల ప్రిన్సిపాల్, అమర్ సింగ్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ రైతుకు మిలియనీర్ పురస్కారం

మంథని(జనంసాక్షి): ఆదర్శ రైతుగా గుర్తింపబడి ఢిల్లీలోని పూసాలో జరిగిన కిసాన్ మేళాలో మన రాష్ట్రం నుండి ఎన్నికైనా 12 మందిలో రామగిరి మండలం కల్వచర్ల గ్రామ రైతు వేముల వెంకటేశ్వర్లు మిలియనీర్ పురస్కారం అవార్డు అందుకున్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, జాతీయ వ్యవసాయ మాసపత్రిక కృషి జాగరణ సంయుక్తంగా ప్రధానం చేసే మిలినీర్ పురస్కారాలకు మన తెలంగాణ రాష్ట్రం 12 మందిని ఎంపిక చేశారు. వీరిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ముగ్గురిని ఎంపిక చేయగా, వేముల వెంకటేశ్వర్లు ఎంపిక చేశారు. మూసా ధోరణి పద్ధతిలో పంటలు సాగు చేయకుండా విభిన్న పంటలను ఎంచుకుని సుమారు 18 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేసి, మిగిలిన రైతులకు ఆదర్శంగా నిలిచి పురస్కారానికి ఎంపిక అయ్యారు. ఢిల్లీలోని పూసలో జరిగిన కార్యక్రమంలో జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అధికారుల చేతుల మీదుగా మెమోంటో అందుకున్నారు. జిల్లాలోని మొదటి ఆదర్శ రైతుగా ఎంపికైన వెంకటేశ్వర్లను పలువురు అభినందించారు.



## అభివృద్ధిని ఓర్వలేకే.. బీఆర్ఎస్ దుష్ప్రచారాలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్



తంగళ్ళపల్లి (జనంసాక్షి):మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు కాంగ్రెస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిని, నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డిని, కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసే ముందు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య స్థాయి ఏంటో తెలుసుకొని నోరు అదుపులో పెట్టుకొని మాటా్లడాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్నటువంటి అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిని అమలులోకి తీసుకువచ్చిం దని, అలాగే ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సంద ర్భంగా ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తుందని తెలిపారు. వీటిని వక్రీకరించి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ నాయకున్ని అరెస్టు చేస్తే, ఏదో స్వతంత్ర సమరయోధుడిని అరెస్టు చేసినట్టు, జిల్లా ఉద్యమకారుని అరెస్టు చేసినట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. చట్టాలు ఏ పార్టీలకు అతీతం కాదని ఎవరికి ప్రత్యేక చట్టాలు లేవనిఅన్నారు. కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేసే సంస్కృతి కేకే మహేందర్ రెడ్డి కి లేదని, స్థానికుడు కాబట్టే ఈ ప్రాంతానికి మంచి చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నాడని, కేటీఆర్ ఏమైనా స్థానికుడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఐఏఎస్ లను ఐపీఎస్ లను అవహేళనగా మాట్లాడడాన్ని మానుకోవాలని సూచించారు. గతంలో సిరిసిల్ల ఉద్యమంలో తోట ఆగయ్యను ఎలా తరిమి కొట్టారో మళ్లీ పునరావృతం కానుందని. అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, లింగాల భూపతి, మహేష్, రాము, సత్యనారాయణ రెడ్డి, పరుశరాములు, బాలు, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్, ప్రశాంత్, శంకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ రైతుల పోరుబాట

డిమాండ్ల సాధనకు ఈ నెల 6న దేశ రాజధాని ఢిల్లీకి పాదయాత్ర నిర్వహించాలని పంజాబ్‌కు చెందిన రైతు నేత శర్వణ్ సింగ్ పంధేర్ పిలుపునిచ్చారు. దేశంలోని రైతులందరూ వారివారి నేతలు, సంఘాల ఆధ్వర్యంలో పాదయాత్రగా ఢిల్లీకి కదిలి రావాలని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని భద్రతా దళాలు ఫిబ్రవరి 13న నిలిపివేయడంతో వారు పంజాబ్, హర్యానా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరి ప్రాంతాల్లో నిలిచిపోయారని పంధేర్ ఆదివారం మీడియా సమావేశంలో చెప్పారు..

## రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు గాంధారి విద్యార్థులు



గాంధారి (జనంసాక్షి):మండలం లోని గౌరారం కలాన్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రఘునాథ్, సరిత, సెపక్ తక్రా అండర్14 బాల బాలికల విభాగం లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. పోతంగల్ కలన్ గ్రామంలో నిర్వహించిన, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ చాటినట్లు తెలిపారు. వీరు డిసెంబర్ 1నుంచి 3 వరకు కామారెడ్డి జిల్లాలోని బాయ్స్ హై స్కూల్ లో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటున్నారు,.అని తెలిపారు. పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ బృందనీ బాబు రావు, ఉమామహేశ్వరరావు , శశికాంత్,లింగం , బాబు, సరోజ, నిరోష, అభినందించారు.

## నిరుద్యోగాన్ని రూపుమాపుతాం

- రేపటి సీఎం సభను విజయవంతం చేయాలి
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి(జనంసాక్షి) : రేపు జరుగబోయే నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్బంగా పెద్ద ఎత్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే సి ఎచ్ విజయరమణా రావు ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఈనెల 4వ తేదీన పెద్దపల్లిలో జరుగబోయే నిరుద్యోగ విజయోత్సవ సభకు పెద్ద ఎత్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని 4 న జరగబోయే యువ వికాస బహిరంగ సభ ద్వారా ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం పూర్తి అవుతున్న సందర్బంగా గత 10 రోజుల నుండి అనేక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ యంత్రాంగంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర మంత్రులు మరియు ఎమ్మెల్యేలందరు పాల్గొనడం జరుగుతుందన్నారు. స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పేరు పై వరంగల్ లో మహిళా సభ, మహబూబ్ నగర్ లో రైతు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహిరంగ సభ 4 వ తారీఖున పెద్దపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో యువ వికాస బహిరంగ సభ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగింది. ఔటర్ రింగురోడ్డు అమ్ముకొని గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం నామమాత్ర రుణమాఫీ చేస్తే రైతులకు అప్పులకు సరిపోలేదు రైతుల విషయంలో నల్ల చట్టాలను అమలు చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదే కానీ ఇప్పుడు రైతుల పై మొసలి కన్నీరు కరుస్తున్నారన్నారు. ఎలాంటి కటింగులు లేకుండా వడ్ల కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు 24 గంటలలో రైతుల ఖాతాలో జమ చేస్తున్నాం. సన్న వడ్లకు రూ. 500 చొప్పున కూడా రైతుల ఖాతాల్లో వెంట వెంటనే ప్రభుత్వం జమ చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ని ఓర్వలేక బి ఆర్ ఎస్ పార్టీ విష ప్రచారం చేస్తుందన్నారు. ఈ పట్టణ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు,, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

రేపు పెద్దపల్లిలో నిర్వహించబోయే యువ శక్తి నిరుద్యోగ విజయోత్సవ సభ ఏర్పాట్లను, సభ స్థలాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, జిల్లా ఉన్నత అధికారులతో కలిసి పరిశీలింమంత్రి శ్రీధర్ బాబు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మరియు కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో రామగుండం సిపి ఎం శ్రీనివాస్ .ఐపీఎస్ , జిల్లా అదనపు కలెక్టర్, ఉన్నంత అధికారులు, రెవెన్యు డివిజనల్ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్, పోలీసు యంత్రాంగం, విద్యుత్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై చర్చకు సిద్ధం

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన సోమవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో విపక్షాలు లేవనెత్తిన పలు అంశాలను చర్చించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ముఖ్యంగా లోక్‌సభలో సంభల్ అంశంపై మాట్లాడేందుకు సమాజ్‌వాదీ పార్టీకి, బంగ్లాదేశ్ పరిస్థితులపై మాట్లాడేందుకు తృణమూల్ కాంగ్రెస్‌కు అనుమతించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం.

## తెలంగాణ యూత్ డే సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం డిసెంబర్ 02,(జనంసాక్షి): తెలంగాణ జన సమితి అనుబంధ సంఘాలు యువ జన సమితి , విద్యార్థి జన సమితి ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 3 న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో "తెలంగాణ యూత్ డే" సదస్సు గోడ పత్రికను విద్యార్థి జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షులు జిల్లపల్లి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ ప్రభుత్వం అమరుల త్యాగాలను మరచి పాలన చేసింది. గత నాలుగు సంవత్సరాలుగా అమరుడు శ్రీకాంత్ ఆచారి వర్ధంతిని యూత్ డిమాండ్స్ డే గా తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో విద్యార్థి జన సమితి మరియు యువజన సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా నిరుద్యోగుల యువత సమస్య పరిష్కారానికై కొత్త కార్యచరణను మరియు నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాము. కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మేము లేవనెత్తిన జాబ్ క్యాలెండర్ ఏర్పాటు రెగ్యులర్గా ఉద్యోగం నోటిఫికేషన్ విడుదల , మేస్ బిల్లుల పెంపు తదితర డిమాండ్లను పట్టించుకోలేదు. కానీ పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని పరిష్కరించింది, విద్యార్థుల నిరుద్యోగులపై ప్రత్యేక పెట్టింది. 10 సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల పేరుతో తెలంగాణ యువతను మోసం చేస్తూ వచ్చిన తరుణంలో శ్రీకాంతాచారి స్ఫూర్తితో యువతలో చైతన్యం వచ్చే దిశగా ముందడుగు వేస్తూ, గత పదేళ్ళలో బీఆర్ఏస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను తయారు చేసింది. కానీ ఒక లక్షా యాభైవేల ఉద్యోగాలు భర్తీ చేశామని తప్పుడు ప్రచారం చేసుకుంది. తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు దశరథ్ రెడ్డి గారు , తెలంగాణ జన సమితి ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు కంతి రమేష్ గారు, తిరుపతి, సోమేశ్, దీపక్, మణిదీప్, గంగాధర్, మనోజ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## నగదు రహిత లావాదేవీలపై అవగాహన ఉండాలి

• సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని(జనంసాక్షి):నగదు రహిత లావాదేవీలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని కెడిసిసి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత - నగదు రహిత లావాదేవీలపై మండలంలోని పుట్టపాక గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బ్యాంకుల లావాదేవీలన్ని డిజిటలీకరణ జరిగినందున ప్రతి ఒక్కరు ఆర్థిక లావాదేవీలపై, నగదు రహిత లావాదేవీలపై అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత రైతులు, ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సహకార బ్యాంక్, సంఘాల ద్వారా అందిస్తున్న ఋణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెడిసిసి బ్యాంక్ మంథని మేనేజర్ కె. ఉదయశ్రీ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నందున ఏటిఎం పిన్ నెంబర్లు, ఓటీపీ పాస్వర్డ్స్ ఇతరులతో పంచుకోరాదని, ఎటిఎం కార్డు పిన్ నంబర్లు తరుచుగా మార్చుకోవాలని సూచించారు. ఆన్లైన్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ యందు ఖాతా కలిగిన ప్రతి ఒక్క ఖాతాదారుడు తమ ఈ ఆధార్ బ్యాంక్ లో సమర్పించి కె వైసి చేసుకోవాలని కోరారు. బ్యాంక్ డిఈ దిలీప్, అసిస్టెంట్ మేనేజర్లు పోతరాజు సతీష్, బూడిద వసంత, సిబ్బంది యం. మహేందర్, అమరేందర్, కె. రమేష్, నాయకులు చాట్లపల్లి సంతోష్, ఎడ్ల శ్రావణ్, సవాయి గణేష్, కన్నూరి సుదర్శన్, రేపాక శంకర్, పెద్ద సంఖ్యలో బ్యాంకు ఖాతాదారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



### అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధి మంథని మండలం సూరయ్యపల్లి, కాకర్లపల్లి, ఎక్లాస్ పూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. ప్రతీ సెంటర్ లో హమాలిల సంఖ్యను పెంచి కొనుగోళ్లను వేగిరం చేయాలని అన్నారు. వరి ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో కప్పి ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని కొనుగోలు ప్రక్రియను పరిశీలించి సెంటర్ ఇన్చార్జిలకు పలు సూచనలు చేశారు. సింగిల్ విండో చైర్మన్ వెంట సంఘ డైరెక్టర్ ఆకుల రాజబాబు, తదితరులు ఉన్నారు.





భారత టెస్టు జట్టు భవిష్యత్తు సారథి స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అని సీనియర్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా అన్నాడు. సుదీర్ఘ కాలం భారత జట్టును బుమ్రా నడిపిస్తాడని తెలిపాడు. బుమ్రా జట్టు మనిషి అని, తన ప్రదర్శన గురించి కాకుండా జట్టు లాభం గురించి ఆలోచిస్తాడని పేర్కొన్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో తొలి టెస్టుకు వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ దూరమవ్వడంతో, టీమిండియాను బుమ్రా గొప్పగా నడిపించిన విషయం తెలిసిందే. న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన అనంతరం తీవ్ర ఒత్తిడిలో బరిలోకి దిగిన భారత్‌ను బుమ్రా నడిపించిన తీరుపై ప్రశంసలు వచ్చాయి. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై టీమిండియా 295 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది.

# బూమ్రా ప్యానిక్


## అత్యంత గొప్ప బౌలర్‌గా బుమ్రా ఎదుగుతున్నాడు

- అతనితో వచ్చే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నాం
- జస్‌ప్రీత్ బుమ్రాపై ట్రావిస్ హెడ్ ప్రశంసల జల్లు

పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్టులో టీమిండియా చేతిలో ఆస్ట్రేలియా 295 పరుగుల తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో నిలవాలంటే భారత్‌తో పాటు ఆసీస్‌కు ఈ సిరీస్ ఎంతో కీలకం. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాను 150 పరుగులకే ఆలౌట్ చేసినప్పటికీ.. భారత బౌలర్ల ముందు తమ బ్యాటర్లు నిలవలేక మ్యాచ్‌పై ఆస్ట్రేలియా పట్టు చేజార్చుకుంది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లి సెంచరీలు బాదడంలో బౌలర్లు నిస్సహాయంగా కనిపించారు. అనంతరం కొండంత లక్ష్యాన్ని ఛేదించలేక బ్యాటర్లు చతికిలపడ్డారు. ఈ నేపథ్యంలో అడిలైడ్ వేదికగా జరిగే రెండో టెస్టులో విజయం సాధించి అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్ ఆధిక్యాన్ని సమం చేయాలని ఆస్ట్రేలియా ఉవ్విళూరుతోంది. డిసెంబర్ 6 నుంచి పింక్ బాల్‌తో జరగనున్న ఈ డే/నైట్ టెస్టు భారత కాలమాన ప్రకారం ఉదయం 9.30 గంటలకు మొదలవుతుంది. ఈ నేపథ్యంలో అడిలైడ్ లోకల్ బాయ్ ట్రావిస్ హెడ్ మాట్లాడుతూ... జస్‌ప్రీత్ బుమ్రాపై ప్రశంసల జల్లు కురిపించాడు. "అత్యంత గొప్ప బౌలర్‌గా బుమ్రా ఎదుగుతున్నాడు. అతనితో వచ్చే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్నాం. అతనికి వ్యతిరేకంగా ఆడటం గొప్ప విషయం. వెనక్కి తిరిగి చూసి..కెరీర్‌లో బుమ్రాను ఎదుర్కొన్నామని మనవళ్లతో చెప్పడం ఎంతో బాగుంటుంది. మరికొన్ని సార్లు మాత్రమే అతన్ని సవాల్‌గా ఎదుర్కోవాలని ఆశిస్తున్నా" అని ట్రావిస్ హెడ్ పేర్కొన్నాడు. గాయం కారణంగా హేజిల్‌వుడ్ దూరమవ్వడం తమ జట్టుకు ప్రతికూలాంశమని ట్రావిస్ హెడ్ అన్నాడు. పక్కటెముకుల గాయం కారణంగా రెండో టెస్టుకు హేజిల్‌వుడ్ దూరమైన విషయం తెలిసిందే. పెర్త్ టెస్టులో ట్రావిస్ హెడ్ మినహా మిగిలిన బ్యాటర్లు ఎవరూ సత్తాచాటలేకపోయారు. రెండో ఇన్నింగ్స్‌లో హెడ్ 101 బంతుల్లో 89 పరుగులు చేశాడు. కాగా, బుమ్రా తొలి ఇన్నింగ్స్‌లో అయిదు, సెకండ్ ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీశాడు.

## ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తొక్కిసలాట

- అభిమానుల మధ్య ఘర్షణ
- వందమందికి పైగా మృతి, పెరగనున్న మృతుల సంఖ్య



గినియాలో మిలిటరీ జుంటా నేత మమాడి దౌంబోయ గౌరవార్థంగా ఎన్‌జెరెకోర్‌లో ఫుట్ బాల్ టోర్న మెంట్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో అభిమానుల మధ్య ఘర్షణ చెలరేగడంతో దాదాపుగా వంద మందికి పైగా మృతి చెందారు. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గినియా మిలిటరీ జుంటా నేత మమాడి దౌంబోయ గౌరవార్థంగా ఓ టోర్నమెంట్ నిర్వహించారు. అసలేం జరిగిందంటే.. సెప్టెంబర్ 2021 తిరుగుబాటులో అధికారాన్ని చేజిక్కించు కుని, తనను తాను అధ్యక్షుడిగా ప్రకటించు కున్న గినియా జుంటా నాయకుడు మామాడి డౌంబౌయా గౌరవార్థం జెరెకొరె నగరంలో ఓ ఫుట్ బాల్‌టోర్నమెంట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఓ మ్యాచ్ జరిగింది. అయితే ఈ మ్యాచ్‌లో రిఫరీ తీసుకున్న నిర్ణయం వివాదస్పదంగా మారింది. రిఫరీ నిర్ణయానికి వ్యతిరేకిస్తూ ఓ జట్టు అభిమానులు మైదానంలోకి దూసుకొచ్చారు. మరోవైపు అవతల జట్టు అభిమానులు కూడా ప్రతిదాడి చేయడానికి గ్రౌండ్‌లో అడుగుపెట్టారు.ఇది చివరికి మారణ హోమంగా మారింది. ఇరు జట్ల అభిమానులు మధ్య మొదలైన గొడవ వీధుల్లోకి వ్యాపించింది. తీవ్ర హింసాత్మకంగా మారింది. సమీపంలో ప్రాంతమంతా రక్తసిక్తంగా మారింది. ఇరు జట్ల అభిమానులు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌ను కూడా ధ్వంసం చేశారు. దానికి నిప్పంటించారు. ఆసుపత్రిలో, దాని చుట్టూ కనుచూపు మేరలో మృతదేహాలు వరుసగా ఉన్నాయి. క్షతగ్రాతులు భారీ సంఖ్యలో ఉన్నారు. మార్చురీ నిండిపోయింది. సుమారు 100 మంది చనిపోయారు" అని స్థానిక వైద్యుడు తెలిపారు.

## భారత టెస్టు జట్టు భవిష్యత్తు సారథి బుమ్రా

### ఛతేశ్వర్ పుజారా కితాబు

వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను తప్పక గెలవాల్సిన పరిస్థితిలో ఆరంభ పోరులో ఆల్‌రౌండ్ షోతో సత్తాచాటింది. "బుమ్రా సుదీర్ఘ కాలం భారత కెప్టెన్‌గా ఉంటాడనడంలో ఎలాంటి సందేహం లేదు. సొంతగడ్డపై కఠిన సిరీస్ (న్యూజిలాండ్)ను ఎదుర్కొన్న అనంతరం, ఆస్ట్రేలియాలో తొలి టెస్టు ఆడిన విధానం అసాధారణం. బుమ్రాకు జట్టును నడిపించే సామర్థ్యం ఉంది. అతను టీమ్ మ్యాన్. అతన్ని చూడండి.. తన గురించి మాత్రమే ఎప్పుడు మాట్లడడు. జట్టు గురించి, ఇతర ఆటగాళ్ల గురించే మాట్లాడతాడు" "కొన్ని సందర్భాల్లో ఆటగాళ్లకు సలహాలు అవసరం ఉండవు. దానిని బుమ్రా అంగీకరిస్తాడు. ఇక అనుభవజ్ఞులు ఉన్నప్పుడు అతను మౌనంగా ఉంటాడు. అతను మంచి కెప్టెన్ అనడానికి ఇదే సంకేతం. అతను కిందిస్థాయి నుంచి పైకి వచ్చాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లతో సరదాగా ఉంటాడు. సాయం చేయడానికి ఆతృతగా ఉంటాడు. అతను ఎంతో మంచి వ్యక్తి. క్రికెట్ అవతల కూడా అతని వ్యక్తిత్వం వినయంగానే ఉంటుంది" అని పుజారా పేర్కొన్నాడు. కాగా, బుమ్రా నుంచి రోహిత్ టీమిండియా సారథి బాధ్యతలు తిరిగి అందుకున్నాడు. అయిదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రెండో టెస్టు నుంచి జట్టును నడిపించనున్నాడు. అడిలైడ్ వేదికగా డిసెంబర్ 6 నుంచి రెండో టెస్టు జరగనుంది. ఈ డే/నైట్ మ్యాచ్ భారత కాలమాన ప్రకారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుంది.

## 15.5 ఓవర్లలో 5 పరుగులు..

### వెస్టిండీస్ పేసర్ జాడెన్ సీల్స్ అద్భుతమైన బౌలింగ్

టెస్టు క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన బౌలర్ల జాబితాలో వెస్టిండీస్ పేసర్ జాడెన్ సీల్స్ పేరు కూడా కనిపిస్తుంది. 10 మెయిడిన్లతో 5 పరుగులకే వెనుదిరగడం కూడా విశేషం. జమైకాలోని సబీనా పార్క్ మైదానంలో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న 2వ టెస్టు మ్యాచ్‌లో జాడెన్ సీల్స్ అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో జాడెన్ 15.5 ఓవర్లు బౌలింగ్ చేసి 10 మెయిడిన్లతో 5 పరుగులు మాత్రమే ఇచ్చాడు. 4 వికెట్లు కూడా తీశాడు. దీనితో పాటు, గత 46 ఏళ్లలో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ ఎకానమీ రేట్‌తో బౌలింగ్ చేసిన రికార్డును జేడెన్ సీల్స్ పంచుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో సీల్స్ 15.5 ఓవర్లలో 5 పరుగులు మాత్రమే ఇచ్చాడు. అంటే, ఓవర్‌కు సగటున 0.31 పరుగులు ఇచ్చాడు. ఇంతకు ముందు ఇలాంటి అరుదైన రికార్డు టీమిండియా పేసర్ ఉమేష్ యాదవ్ పేరిట ఉంది. 2015లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టులో ఉమేష్ యాదవ్ 21 ఓవర్లలో 9 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. ఆ రోజు టీమిండియా పేసర్ ఓవర్‌కు కేవలం 0.41 సగటుతో పరుగులు ఇచ్చి రికార్డు సృష్టించాడు.



## రహానెకే పగ్గాలు

### కేకేఆర్ కెప్టెన్సీ రేసులో రహానె ముందంజ

### ఢిల్లీ కెప్టెన్సీ రేసు నుంచి కేఎల్ రాహుల్ ఔట్..?

ఐపీఎల్ సీజన్లలో కెప్టెన్ల కోసం చాలా జట్లు గందరగోళానికి గురవుతున్నాయి. ఇప్పుడు కోల్‌కతా నైట్ రైడర్స్ కూడా అదే సమస్యను ఎదుర్కొంటోంది. గత సీజన్ వరకు జట్టుకు నాయకత్వం వహించిన శ్రేయస్ అయ్యర్‌ను జట్టును తప్పించి, కొత్త కెప్టెన్ కోసం అన్వేషిస్తోంది. వేలంలో కోల్‌కతా యాజమాన్యం వెంకటేశ్ అయ్యర్‌ను భారీ మొత్తమైన రూ.23.75 కోట్లకు కొనుగోలు చేయగా, అజింక్య రహానేను రూ.1.5 కోట్ల బేస్ ప్రైజ్‌తో సొంతం చేసుకుంది. తొలుత కెప్టెన్సీ బాధ్యతలు వెంకటేశ్ అయ్యర్‌కు అప్పగిస్తారని భావించినా, అనుభవం ఉన్న రహానె వైపు ఫ్రాంచైజీ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. టీమిండియాకు పలు సార్లు నాయకత్వం వహించిన రహానె, తన నైపుణ్యాన్ని ఇప్పటికే నిరూపించాడు. ప్రస్తుతం రంజీ ట్రోఫీలో ముంబయి జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. అతని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని, రహానెకు కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించేందుకు కోల్‌కతా 90 శాతం నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. వెంకటేశ్ అయ్యర్ కూడా కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాడు. అయితే అతడిని వైస్ కెప్టెన్‌గా ఉంచి, రహానెకు పూర్తిస్థాయి నాయకత్వం అప్పగించాలనే ఆలోచనలో కేకేఆర్ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక మీడియా కథనం ప్రకారం రహానెను కెప్టెన్సీకి ఎంపిక చేయడం కోసం ప్రత్యేకంగా వేలంలో కొనుగోలు చేసినట్లు ఫ్రాంచైజీ వెల్లడించింది. జట్టులో ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేయడంలో రహానే అనుభవం కీలకంగా మారనుంది. మరి కేకేఆర్ ఈ కీలక నిర్ణయాన్ని అధికారికంగా ఎప్పుడు ప్రకటిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 మెగా వేలం తర్వాత, ఇప్పుడు చాలా జట్ల ముందు ఉన్న అతిపెద్ద సవాలు ఏంటంటే.. తమ జట్టుకు కెప్టెన్‌గా ఎవరిని చేయాలి? అంటూ వినిపిస్తోన్న ప్రశ్నలు. ఈ క్రమంలో ప్రస్తుతం కెప్టెన్ కోసం వెతుకుతున్న జట్లను ఓసారి పరిశీలిస్తే.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ ముందున్నాయి. మిగతా జట్లైనా సన్‌రైజర్స్ హైదరాబాద్ (పాట్ కమిన్స్), చెన్నై సూపర్ కింగ్స్ (రుతురాజ్ గైక్వాడ్), గుజరాత్ టైటాన్స్ (శుభ్‌మన్ గిల్), ముంబై ఇండియన్స్ (హార్దిక్ పాండ్యా), రాజస్థాన్ రాయల్స్ (సంజూ శాంసన్) జట్లకు మాత్రమే కెప్టెన్లు ఉన్నారు. ఇక ఢిల్లీ క్యాపిట్స్ విషయానికి వస్తే.. జట్టులో కేఎల్ రాహుల్, ఫాఫ్ డు ప్లెసిస్ కెప్టెన్సీ మెటీరియల్‌తో సిద్ధంగా ఉన్నారు. అక్షర్ పటేల్ కూడా కెప్టెన్సీకి పోటీదారుగా నిలిచాడు. అయితే, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్సీపై ఇప్పటి వరకు ఉత్కంఠ నెలకొంది. అక్షర్ పటేల్ (16.50 కోట్లు), కుల్దీప్ యాదవ్ (13.25 కోట్లు), ట్రిస్టన్ స్టబ్స్ (10 కోట్లు), అభిషేక్ పోరెల్ (4 కోట్లు)లను ఢిల్లీ క్యాపిటల్స్ తన వద్ద ఉంచుకుంది. ఐపీఎల్ వేలంలో ఢిల్లీ జట్టు కేఎల్ రాహుల్‌ను రూ.14 కోట్లకు కొనుగోలు చేసింది.

## షమీకి బీసీసీఐ కండీషన్స్!

ఆస్ట్రేలియాలో జరుగుతున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఆడాలని ఉవ్విలూరుతున్న భారత పేసర్ మహ్మద్ షమీకి బీసీసీఐ బిగ్ షాక్ ఇచ్చింది. ఇటీవలే గాయం నుంచి కోలుకున్న షమీ.. రెండో టెస్టు నాటికి ఆసీస్‌లో అడుగు పెట్టబోతున్నాడంటూ వార్తలొచ్చాయి. అయితే దీనిపై తాజాగా స్పందించిన బీసీసీఐ ఇప్పుడే షమీని ఆసీస్ పంపించట్లేదని తెలిపింది. కానీ షమీ వెళ్లేందుకు సిద్ధం గా ఉంటే.. తాము పెట్టిన రెండు కండీషన్లను పూర్తి చేస్తేనే పంపిస్తామని, ఇందుకు డెడ్‌లైన్ కూడా పెట్టినట్లు తెలుస్తోంది. ఈ మేరకు 'షమీని వైద్య బృందం పరిశీలిస్తోంది. అతను బౌలింగ్ తీరును గమనిస్తోంది. రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ ట్రోఫీ మ్యాచుల్లో షమీ బౌలింగ్‌పై ఫోకస్ చేశాం. మెడికల్ టీమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తేనే షమీ ఫ్లైట్ ఎక్కే ఛాన్స్ ఉంది. టీ20ల్లో 4 ఓవర్ల ఆధారంగా అతడి ఫిట్‌నెస్‌పై నిర్ణయం తీసుకోలేం' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇక షమీని జట్టులోకి డైరెక్ట్ గా తీసుకోవాలంటే రెండు టెస్టులు పాస్ కావాలి. డిసెంబర్ రెండో వారంలోపే పూర్తి చేయాలి. డిసెంబర్ 14 వరకు బరువు తగ్గాలి. పూర్తి ఫిట్‌నెస్ సాధించాలి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ దగ్గరలో ఉన్నందున అతనిపై ఒత్తిడి పడకుండా చూడాలని భావిస్తున్నామని తెలిపారు. ఇక రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో షమీ మెరుగైన ప్రదర్శన చేశాడు.

## విద్యార్థులు సకాలంలో స్కాలర్‌షిప్ అందే విధంగా చర్యలు తీసుకోవాలి

**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 2 (జనం సాక్షి) :** విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్ అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎస్సీ విద్యార్థులకు అందించే పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ పై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ , యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్ కు దరఖాస్తు చేసుకునే క్రమంలో వస్తున్న సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి సర్టిఫికెట్ లో ఉన్న వివరాలకు ఆధార్ కార్డులో ఉండే విధంగా తప్పులను సరి చేసుకునేందుకు వీలుగా ఆధార్ కిట్లను సమకూర్చుకోవాలన్నారు. విద్యార్థుల గ్యాప్ సర్టిఫికెట్ నిమిత్తం కళాశాల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు డీఎస్సీడివో కు విద్యార్థుల జాబితాలను సమర్పించాలని తెలిపారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇ-పాస్ పోర్టల్ స్కాలర్ షిప్ నిమిత్తం రిజిస్టర్ చేసుకున్నట్లయితే స్కాలర్ షిప్ త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, డిటిడిఓ కమలాకర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



## కరడుగట్టిన కార్ల దొంగల ముఠా అరెస్ట్

### 2.5 కోట్ల సొత్తు స్వాధీనం



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 02 (జనంసాక్షి) :** కార్లను అద్దెకి తీసుకొని తదనంతరం సంబంధిత యజమానులకు అప్పగించ కుండా వాటిని ఇతరుల కు అమ్ముకొని సొమ్ము చేసుకోవడం ఆనవాయితీగా మార్చుకున్న కరడు కట్టిన నలుగురు దొంగల ముఠాను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసు కున్నారు... సైబరాబాద్ డిసిపి వెల్లడించిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లి పరిధి టెలికాం నగర్ లో నివాసముండే జూపూడి ఉష, షేక్ పెట్ నాలా సమీపంలో ఉండే తుడుముల మల్లేష్, బీదర్ కు చెందిన సాగర్ పాటిల్, అత్తాపూర్‌లో నివాసముండే జమానే అనిల్ కుమార్ లు ఒక ముఠాగా ఏర్పడి విలువైన కార్లను దొంగిలిస్తూ వాటిని అమ్మి వచ్చిన సొమ్ముతో జల్సా లకు పాల్పడుతుంటారు. ఈ క్రమంలో ముందుగా జూపూడి ఉష కార్ ట్రావెల్స్, ఇతర కార్లను అద్దెకిచ్చే వ్యక్తులను సంప్రదించి రెంట్ బేస్ పై కార్లు ముందుగా అద్దెకు తీసుకుంటుంది. తర్వాత బీదర్ ప్రాంతానికి చెందిన సాగర్ పాటిల్‌కు దానిని ముట్ట చెప్పడం, అతడు దానిని ఇతర ప్రదేశాలలో అమ్మేసి సొమ్ము చేతిలోకి రాగానే జూపూడి ఉష ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కార్యజమానుల నుండి తప్పించుకోవడం శివాజీగా మార్చు కుంది. ఈ నేపథ్యంలో పలువురు వ్యక్తులు ఓ మహిళ తమ కార్లను అద్దెకు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని చెబుతూ రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసుల కేసును దర్యాప్తు చేయగా పలు సంచలనాత్మక విషయాలు బయటకు వచ్చి 2.5 కోట్ల విలువ చేసే 21 కార్లను ఈ ముఠా దొంగిలించినట్టు గుర్తించి తిరిగి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటిలో మహేంద్ర తార్(4), మారుతి సుజుకి ఎర్టిగా(10), టయోటా ఇన్నోవా క్రిష్ట(1), హుండాయ్ ఐ20(1), హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 (1) ఉన్నాయని డిసిపి తెలిపారు. కార్లను స్వాధీనం చేసుకొని యజమానులకు అప్పగించడం జరిగిందని, కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేదించడంలో రాయదుర్గం ఎస్హెచ్ఓ, ఏసిపి, ఇతర ఉన్నతాధికారులు గట్టి కృషి చేశారని, ఎందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు డిసిపి వివరించారు.

### దౌర్భాగ్యమైన పరిస్థితిలో

## తాండూర్ మున్సిపాలిటీ

- ఫోటోలకు ఫోజులిస్తున్న చైర్ పర్సన్, కమిషనర్
- సమస్యలు గాలికి... అభివృద్ధి శూన్యం
- 20వ వార్డు కౌన్సిలర్ సంగీత అజయ్ సింగ్ ఠాకూర్.



**తాండూరు డిసెంబర్ 2(జనంసాక్షి) :** ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా సోమవారం గాంధీనగర్ వార్డ్ నెంబర్ 20 లో ఒకే ఒక్క మున్సిపల్ లేబర్ తో ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ సంగీత అజయ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ వార్డు లలో మున్సిపల్ వర్కర్స్ కొరత ఉంది కానీ చైర్ పర్సన్ ఇంట్లో మాత్రం కొరత లేదని విమర్శించారు. వార్డులో చేయవలసిన మున్సిపల్ వర్కర్లు ఆమె ఇంట్లో పని చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కేవలం ఫోటోలోకి ఫోజులిస్తున్న చైర్పర్సన్, కమిషనర్ ఆదివారం న్యూస్ పేపర్లో వచ్చిన వార్తకు స్పందించి వార్డులో వెళ్లి ముగ్గేస్తూ చైర్ పర్సన్ స్వప్న ఫోటో దిగడము జరిగింది.మరి అక్కడ ముగ్గేసి ఏం ఉద్ధరించిందని ప్రశ్నించారు. రెండు గంటల వ్యవధిలోనే అక్కడ చెత్త కుప్పలు ఏర్పడడం మరి అదేనా ప్రజాపాలన విజయోత్సవమా అని పెదవి విరిచారు. చెత్త కుప్పల దగ్గర డస్ట్ బిన్లను ఏర్పా టు చేయాలన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నించాలని కోరారు. స్పెషల్ డ్రైవ్ వర్కర్లను తీసుకొని శానిటేషన్ చేయించాలన్నారు. ఎంత దౌర్భాగ్యమైన పరిస్థితిలో మన మున్సిపల్ ఉందో ఒకసారి ప్రజలందరూ ఆలోచించాలి.అలాగే మన తాండూర్ ఎమ్మెల్యే గారికి కూడా మేము విన్నవించుకోవడం ఏమనగా ప్రజా పాలన విజయ ఉత్సవాలకు ప్రతిపక్షాలు వ్యతిరేకం కాదు. మీ పార్టీలో ఉండి మీకే చెడ్డ పేరు తెచ్చేటట్టు చైర్ పర్సన్, కమిషనర్ వ్యవహరించడం పై ఎమ్మెల్యే తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. వార్డులలో చేయవలసిన వర్కర్లు చైర్ పర్సన్ ఇంట్లో పనిచేయడం పై ప్రజలే వ్యతిరేకతను చూయిస్తున్నారు.



## ఆయిల్ ఫామ్ మొక్కలు పెంచేందుకు కృషి చేయాలి

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** ఆయిల్ ఫామ్ మొక్కలు పెంచేందుకు కృషి చేయాలి అని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు ఆదేశించారు.సోమవారం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఆయిల్ ఫామ్ మొక్కలు పెంపకానికి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.ఆర్.జి.ఎస్ ద్వారా ఆయిల్ ఫామ్ మొక్కలు పెంపకానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పని చేస్తూ రైతులకు సబ్సిడీలు అందే విధంగా కృషి చేస్తూ పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ మొక్కలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని, పెండింగు పనులను ముందుగా పరిష్కరించాలని, అంకిత భావంతో పని చేయాలని, కింది స్థాయిలో శాఖ పని తీరును పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసి పనులు పెండింగులో లేకుండా చూడాలని కలె క్టర్ తెలిపారు. ఫైల్స్ పెండింగ్ పెట్టకుండా నిబంధనల ప్రకారం పనులచేయాలని అన్నారు.

## మోమిన్ పేట గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి



**మోమిన్ పేట డిసెంబర్ 2 (జనం సాక్షి) :** మోమిన్ పేట గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి జిల్లా గ్రంథాలయాసంతో కార్యదర్శి డి సురేష్ బాబు సోమవారం ఆకస్మిక తనకి నిర్వహించారు ఈ సందర్భంగా గ్రంథాలయా నికి ప్రహరీ గోడ నిర్మాణం పుస్తకాల సంఖ్య పెంచడం పాఠకులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందుల్లో గురవుతున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నే శంకర్ యాదవ్ జిల్లా చైర్మన్ రాజేష్ రెడ్డి కార్యదర్శి సురేష్ బాబు దృష్టికి తీసుకొచ్చారు త్వరలో ప్రవాహరి గోడ నిర్మాణానికి పాఠకులకు బాత్రూం తాగునీటి వసతి పోటీ పరీక్షల కోసం నాణ్యమైన పుస్తకాలు మరుగుదొడ్లు వాడకాలికి బోరు వంటి సదుపాయాల కల్పనకు ప్రణాళికలు తయారుచేసి పంపించండి అని గ్రంథ పాలకునికి ఆదేశించారు ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు గ్రంథ పాలకులు సమయపాలనపాటించి పాఠకులకు అందుబాటులో ఉండే విధంగా గ్రంథాలయం తెరిచి ఉండాల న్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నే శంకర్ యాదవ్ పిఏసిఎస్ మాజీ చైర్మన్ సుభాష్ గౌడ్ మైనార్టీ నాయకులు హేరాజ్ పాల్గొన్నారు



## ఆర్టీసీ కాలనీ వద్ద ఆగిన రోడ్డు విస్తరణ పనులు

### పరిష్కారం చూపిన కార్పొరేటర్

**హయత్ నగర్, డిసెంబర్ 2 (జనం సాక్షి) :** జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా హయత్ నగర్ ఆర్టీసీ కాలనీ వద్ద సమాధులు ఉండడంతో చాలా రోజులుగా నిర్మాణ పనులు నిలిచిపోవడంతో స్థానిక హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి చోరువతో పరిష్కార మార్గం లభించింది. సంబంధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి స్థలం నష్టపరిహారాన్ని అధికారులచే అందించి రోడ్డు నిర్మాణానికి ఒప్పించారు. మధ్యలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు.




# ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ గోడలు నినదిస్తున్నయ్

## ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటాన్ని నూరిపోస్తున్న వాల్‌రైటింగ్స్

### కదం తొక్కిన మహిళా రైతులు, కార్మికులు



పెద్ద ధన్వాడ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు రద్దు చేయాలని కోరుతూ ఫ్యాక్టరి వ్యతిరేక పోరాట సమితి సభ్యులు కదం తొక్కారు. పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సోమవారం పెద్ద ధన్వాడ, చిన్న తాండ్రపాడు, కేశవరం, చిన్న ధన్వాడ, మానుదొడ్డి, నసనూర్ ఆయా గ్రామాల విధుల్లో గోడలపై ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక నినాదాలు రాశారు. రోజు రోజుకు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వానికి, అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేదని, పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఆయా గ్రామాల ప్రజలు ప్రకటించారు. ప్రభుత్వం దిగొచ్చి ఫ్యాక్టరీ పనులు నిలిపే వరకు ప్రతిరోజూ నిరసన కార్యక్రమాలు చేపడతామని ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు తెలిపారు.

- రాజోలి, డిసెంబర్ 02 (జనంసాక్షి)

### మా బతుకు కష్టమైతది



ఇథనాల్ ఫ్యాక్టరీ పెడితే వ్యవసాయాన్ని నమ్ముకున్న మేము బతుకుడు కష్టమైతది. పరిశ్రమ చుట్టూ ఉన్న భూముల్లో ఏడాదికి మూడు పంటలు వేసేటోళ్లం. ఒక్క పంట కూడా తీయలేక ఆగమైపోతం. మా భూములు, నీళ్లు, గాలి అన్నీ కలుషితమైపోయి. భూములు పాడయ్యి రోడ్డు మీద పడాల్సి వస్తది. అందుకే మాకు ఇథనాల్ పరిశ్రమ వద్దు

-కళావతి, చిన్న ధన్వాడ

### ఫ్యాక్టరీ రద్దు చేయకాపోతే ఆత్మహత్య చేసుకుంటా



పచ్చని పంట పొలాల్లో ఫ్యాక్టరీని నిర్మించడం వలన మేము అనేక విధాలుగా నష్టపోతాం. ఫ్యాక్టరీ నిర్మాణం రద్దు చేయలేని పక్షంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుంది

-ఎంకటమ్మ, పెద్ద ధన్వాడ

### నమ్ముకున్న పొలాలే లేకుంటే



మాకు పట్టేడన్నం పెట్టె పొలలే లేకుంటే రేపొద్దున మా పరిస్థితి ఏంటన్న అనే ప్రశ్న మమల్ని ఇంతలా కదిలించింది. అందుకే ఈ ఉద్యమంలో మనమంతా భాగం కావాలని మా గ్రామం మహిళలందరం నిర్ణయించుకున్నాం. ఇది ఏ ఒక్కరి కోసం చేసేది కాదని, మన ఊళ్లు, పిల్లలు, బాగుండాలని చేస్తున్నామని చెబుతూ అందరూ ఇందులో భాగమయ్యేలా చేశాం.

-ఏసమ్మ, చిన్న ధన్వాడ

### సరిగ్గా బువ్వ కూడా పోవట్లే



మా ఊరి మధ్య ఇథనాల్ ఫ్యాక్టరీ పెడుతున్నారని తెలిసినప్పటి నుంచి మాలో ఆందోళన మొదలైంది. ఆ మహమ్మారి పరిశ్రమతో మా ఊళ్లు, పంటపొలాలు దెబ్బతింటాయని తెలిసినప్పటి నుండి సరిగ్గా మాకు బువ్వ కూడా పోవట్లే. ఇక మా పిల్లల భవిష్యత్తు కోసం ఏమైనా పర్వాలేదనే ముందుకొచ్చాం.

-ప్రేమిలమ్మ, చిన్న ధన్వాడ

### ఈసారి మా ఆడోళ్ళమే ముందుంటాం



మా ఊర్లు మా పిల్లలు భవిష్యత్తు బాగుండాలన్నా పచ్చని మా పల్లెలో చిచ్చుపెట్టే ఆ ఫ్యాక్టరీ ఉండొద్దని అనుకున్నాం. ఈసారి మేమే ముందుండాలని నిర్ణయించుకున్నాం. పోలీసులు అరెస్టులే చేయని, లాటిలతో కొట్టని ఇక వెనక్కు తగ్గేది లేదు. మాకు ఫ్యాక్టరీ రద్దు చేయాలి.

-భావమ్మ, చిన్న తాండ్రపాడు

### పరిశ్రమ రద్దు కావడమే మా ఎజెండా



రెండు నెలలు కావొస్తున్న తమ పోరాటాలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని, ఇథనాల్ పరిశ్రమ రద్దు కావడమే మాకు ఎజెండా. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల మా పంటలు, పొలాలు దెబ్బతింటాయని, పర్యావరణం దెబ్బతింటుందని ఫ్యాక్టరీ ఏర్పాటును రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదు.

-అంజనమ్మ, చిన్న ధన్వాడ



# గ్రేటర్ పరిధిలో సిక్స్‌లేన్ ఫ్లైఓవర్

- నెహ్రూ జులాజికల్ పార్క్ నుంచి అరాంఘర్ ఫ్లైఓవర్
- త్వరలో సీఎం చేతుల మీదుగా జాతికి అంకితం చేసే అవకాశం

హైదరాబాద్, డిసెంబర్8 (జనంసాక్షి) : ట్రాఫిక్ కష్టాలతో కునారిల్లుతున్న జంటనగరాల వాసులకు మరో శుభవార్త. నెహ్రూ జులాజికల్ పార్క్ నుంచి అరాంఘర్ సిక్స్ లేన్ ఫ్లైఓవర్.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు పట్టాలెక్కబోతోంది. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమైంది. ఇది భాగ్యనగరంలోనే అతిపెద్ద రెండో ఫ్లైఓవర్. 24 మీటర్ల వెడల్పు, నాలుగు కిలోమీటర్ల పొడవైన ఈ ఫ్లైఓవర్ కోసం 636 కోట్ల రూపాయలు ఖర్చయింది. ఫ్లైఓవర్‌కు రెండువైపులా ఎనిమిది కిలోమీటర్ల సర్వీస్ రోడ్డు పూర్తి చేయడమే ప్రాజెక్టులో అతి పెద్ద సవాల్. అడ్డుగా ఉన్న నిర్మాణాలను కూల్చివేసి సర్వీస్ రోడ్‌ను చకచకా నిర్మిస్తున్నారు. ఫ్లైఓవర్ పనులు దాదాపుగా 90 శాతం పూర్తయ్యాయి. హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో కలిసి బల్దియా కమిషనర్ ఇటీవలే పనులను పర్యవేక్షించారు. నాలుగు రోజుల్లో సర్వం సిద్ధమై.. సీఎం చేతుల మీదుగా ప్రజలకు అంకితం అవుతుంది. నగరం అంతటా పట్టణాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన "ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు" కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కీలక ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ఫ్లై ఓవర్ వల్ల శాస్త్రిపురం, కాలాపత్తర్ వంటి కీలకమైన జంక్షన్‌లలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు. ఇది గనుక అందుబాటులోకి వస్తే.. జూపార్క్ నుంచి ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు, మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, బెంగళూరు వెళ్లేవారికి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. తాడ్‌బన్, దానమ్మ హట్స్, హసన్ నగర్ జంక్షన్లలోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఇక ఆగాల్సిన పనే ఉండదు. జూపార్క్‌కు వచ్చే సందర్శకులు, పాతబస్తీ వైపు వెళ్లే వాహనాలకు ప్రయాణం సులభతరం అవుతుంది.

# పాలకుర్తి అభివృద్ధికి నిధులివ్వండి


- సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తి, డిసెంబరు 02(జనంసాక్షి) : పాలకుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ, సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి హనుమండ్ల ఝాన్సీ రెడ్డి లు విజప్తి చేశారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు, ఎమ్మెల్యే వెంటా కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హానుమండ్ల ఝాన్సీ రెడ్డి ఉన్నారు.

# సంబరంలో సకల జనులు

- దీక్షా దివస్ మీటింగు జరుపుకోవడానికి కూడా బిఆర్ఎస్ పార్టీ అవినీతి సొమ్ము
- రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆనందాన్ని వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం
- పలు కూడళ్ళలో ప్రజాపాలన విజయోత్సవాలకు హాజరైన సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




కరీంనగర్ బ్యూరో, డిసెంబర్ 02 (జనంసాక్షి) : ప్రజా ప్రభుత్వంలో సకల జనులు సంబరంగా ఉన్నారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట మహాత్మా జ్యోతిబాపూలే చౌరస్తా వద్ద, నాకా చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఏడాది ప్రజా పాలన విజయోత్సవ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించి స్థానికులు లబ్దిదారులతో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... పది సంవత్సరాలు ప్రజలను మోసం చేసి లక్షల కోట్ల అప్పులు మిగిల్చిన బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం నుండి విముక్తి లభించి ప్రజా పాలన వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలతో మమేకమై ఈ సంబరాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. 500 కు గ్యాస్ సిలిండర్ వస్తుందా, బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారా, 200 యూనిట్ల లోపు వినియోగించుకున్న లబ్ధిదారులకు గృహ జ్యోతి వస్తుందా, కులగణన సక్రమంగా జరుగుతుందా అని ప్రజలను తాము అడిగితే సంతోషం వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ తాము తమకు సకాలంలో అందుతున్నాయని, ఆనందంగా చెప్పడంపై రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని, ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన పాపాలను కడుగుతూ ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రజాపాలనను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందిస్తుందన్నారు. నగర వ్యాప్తంగా కలియతిరిగి ప్రజలను కలుస్తూ.. వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ సంబరాలను నిర్వహిస్తామన్నారు. తాము వెళ్లిన చోటల్లా ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, స్వచ్ఛందంగా ప్రజలు సంబరాలు పాల్గొంటున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు బేషుగ్గా అందుతున్నాయని, ప్రజా పాలనను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాబోయే 20 సంవత్సరాల పాటు అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ల బాధ్యులు అస్తపురం రమేష్, మల్లికార్జున్, తిరుమల, రజిత రెడ్డి, కమ్రొద్దిన్, షేక్ శేహెన్శ, సిరాజొద్దిన్, బషీర్, మహమ్మద్ భారీ, షబానా మహమ్మద్, నదిం, జాఫర్ , ఇమామ్, స్వప్న, గన్ను మహేందర్ రెడ్డి, కిరణ్ రెడ్డి, వాడే వెంకట్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌ను కాపాడాలనే హైడ్రా

- హైడ్రాకు తూట్లు పొడిచే ప్రయత్నాలు
- బీఆర్ఎస్ సినిమాకు శుభం కార్డు పడింది
- సమగ్ర సర్వేను అటకెక్కించిన బీఆర్ఎస్
- తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు



హైదరాబాద్, డిసెంబర్8 (జనంసాక్షి) : హైదరాబాద్‌ను కాపాడాలనే ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకువచ్చామని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. దీనికి కూడా తూట్లు పొడిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొన్నేళ్లపాటు కేబినెట్లో మహిళలకు చోటు కల్పించని పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర సర్వే చేయించి ఆ తర్వాత దానిని అటకెక్కించారని విమర్శించారు. బీసీలకు బీఆర్ఎస్ అనుకూలమా? కాదా? చెప్పాలని నిలదీశారు. దామాషా పద్ధతిలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఫలాలు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే తాము బీసీ గణన చేపడుతున్నట్లు చెప్పారు. బతుకమ్మ చీరల పేరిట గత ప్రభుత్వం నేతన్నల జీవితాలను ఆగం చేసిందన్నారు. సూరత్ నుంచి చీరలను తెచ్చి ఇచ్చారని మండిపడ్డారు. ఆ చీరలు కూడా మహిళలు కట్టుకోవడానికి ఉపయోగపడలేదని... పంటచేలలో బెదురు పెట్టేందుకు ఉపయోగపడ్డాయని విమర్శించారు. ఒక్క డీఎస్సీ ఇవ్వని ప్రభుత్వం కేసీఆర్‌దే అన్నారు. గ్రూప్-1 పేపర్లు లీక్ చేసిన చరిత్ర ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సినిమాకు శుభం కార్డు పడిందని చురక అంటించారు.

# అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి శంకుస్థాపన

బెంగళూరు, నవంబర్ 2 (జనంసాక్షి) : కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించాలన్న దీర్ఘకాలిక డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. ఈ మేరకు 'కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డు' నుంచి కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోషియేషన్‌కు భూకేటాయింపు జరిగింది. స్టేడియం నిర్మాణానికి మొత్తం 41 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోమవారం ఉదయం తుమకూరులో క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. మొత్తం 41 ఎకరాల్లో నిర్మించనున్న ఈ స్టేడియాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు మొత్తం రూ.150 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా వేశారు. స్టేడియం పూర్తయితే ఇక్కడ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

# కేసీఆర్ ఒక మొక్క కాదు.. వేగుచుక్క

- ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, నవంబర్ 2 (జనంసాక్షి) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొక్క అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కేసీఆర్ మొక్క కాదు పీకేయడానికి కేసీఆర్ ఒక వేగుచుక్క అని కొనియాడారు. రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్ అని కవిత ప్రశంసించారు. ఎమ్మెల్సీ కవిత నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకోబోము. ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా తిట్ల పరిపాలన చేస్తున్నారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదలయ్యి పారేవి.. ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయని కవిత విమర్శించారు.

# నన్ను కాల్చి చంపినా నేను పేదల పక్షానే ఉంటా

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




హైదరాబాద్, నవంబర్ 2 (జనంసాక్షి) : సీఎం రేవంత్ రెడ్డి.. మీరు నా మీద ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, కాల్చి చంపినా నేను నోరు లేని ఈ పేద బిడ్డల పక్షపాతిగానే ఉంటానని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ గురుకుల బాట చేపట్టిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై రేవంత్ సర్కార్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. మీ సోషల్ మీడియా లీకులు, మీరిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం మతిస్థిమితం లేని మంత్రులు, ఎమ్మెల్యేలు, మరెందరో చిల్లర మూకలు నాపై చేస్తున్న దాడికి నేను బెదరను. మీరేసే తాయిలాలకు గతంలో లొంగలేదు, భవిష్యత్తులో కూడా లొంగను. మీరు స్కూళ్లకు తాళాలు వేసుకుంటెనో, పోలీసులతో మమ్ముల అరెస్టు చేయిస్తేనో మా గురుకుల బాట ఆగుతదనుకుంటే మీ అంత మూర్?లు ఇంకొకరుండరు అని రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఇక అసలు విషయానికొస్తే.. మీరు ఎందుకు నిజాలను దాచిపెట్టాలని అనుకుంటున్నారో ప్రజలకు చెప్పండి. మీరు చెప్పకపోతే వాటిని చెప్పాల్సిన బాధ్యత మా పిల్లలకోసం మా బీఆర్ఎస్ పార్టీపై ఉంది. మీ బంగళాలో బతికే నలుగురి కోసం నలభై మంది పనిచేయొచ్చు కానీ, మా పేద పిల్లలు చదువుకునే హయత్ నగర్ ప్రతిభా పాఠశాలలో 600 మంది విద్యార్థుల స్కూల్‌ను శుభ్రం చేయడానికి కేవలం ఒకటే ఒక వృద్ధ మహిళను ఎట్ల పెడుతరు..? అదీ ఆమెకు టైంకు జీతాలు ఇవ్వకుండా..? అని ఆర్ఎస్పీ నిలదీశారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిభావంతులైన పేద పిల్లలను ఎంట్రన్స్ ద్వారా సెలక్టు చేసి వాళ్లకు అవసరమైన ఉపాధ్యాయులను ఇవ్వకపోతే వాళ్ల భవిష్యత్ కు భరోసా ఎవ్వరు..? హయత్ నగర్‌లో ఇంటర్మీడియట్‌కు ఇప్పటికీ ఇద్దరు జూనియర్ లెక్చరర్స్ లేరని పిల్లలు కన్నీరు పెట్టుకున్నారు. వాళ్లు పరీక్షలు ఎట్ల పాసైతరు? మీ పిల్లలకు టీచర్లు లేకపోతే మీరు ఊరుకుంటారా? ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పిల్లలు ఇంగ్లీష్ మాట్లాడలేని పరిస్థితి దాపురించిన పరిస్థితిని మీరెట్ల చూస్తరు? అని రేవంత్ రెడ్డిని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# కాటారం ఎస్సీ హాస్టల్లో ఉద్యోగి అర్ధరాత్రి వింత ప్రవర్తన



కాటారం డిసెంబర్ 2 ( జనం సాక్షి): సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో వింత సంఘటన చోటు చేసుకుంది. ఈ వసతి గృహం లో పనిచేస్తున్న నైట్ వాచ్మెన్ వింతగా ప్రవర్తించడంతో ఏడవ తరగతి చదివే మారుపాక వైష్ణవిక భయాందోళనకు గురై ప్రాణప్పయస్థితికి చేరుకొంది. సదరు నైట్ వాచ్మెన్ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విద్యార్థుల తలుపు తట్టి పూనకంలో వింత వింతగా విద్యార్థులు భయపడే విధంగా బండారు, మేకపోతులను తీసుకురండి మాట్లాడుతుండడంతో విద్యార్థులు భయం భయంగా రోజులు గడుపుతున్నారని సమాచారం. వాచ్మెన్ చేష్టలకు విద్యార్థులు ఎవరికి చెప్పుకోలేక రాత్రి సమయంలో హాస్టల్ అంటేనే జంకుతున్నారు. వసతి గృహ వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఎవరితో చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. మహాముత్తారం మండలం పాత రేగుల గూడెం గ్రామానికి చెందిన మారుపాక వైష్ణవిక సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటూ ఏడవ తరగతి చదువుతుంది. ఆదివారం రాత్రి వాచ్మెన్ ఇలా ప్రవర్తించడంతో భయాందోళనకు గురైంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370